PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 245 | విజయవాడ, మంగళవారం 8 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 8 April 2025 | Rs

నయా ఫాసిస్ట్ ధోరణులపై పోరాటం

- సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి పిలుపు
- పి.రామమూర్తి విగ్రహం వద్ద నివాళి

7

కోహ్లీ, పటీధర్ అదరహో...

- ఉత్కంఠ పోరులో ముంబయిపై బెంగళూరు గెలుపు
- బుమ్రా పునరాగమనం

8

విరాళాల్లో 88% బిజెపికే..

2023-24లో కమలానికి రూ.2,243 కోట్లు

ఎడిఆర్ నివేదిక

న్యూఢిల్లీ : అధికార పార్టీ బిజెపికి విరాళాలు వెల్లువెత్తాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆ పార్టీకి ఏకంగా రూ.2,243 కోట్లకు పైగా విరాళాలు వచ్చాయి. కేవలం 8,358 విరాళాల ద్వారా ఇంత భారీ మొత్తాన్ని బిజెపి ఆర్జించిందని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) ఈ మేరకు ఒక నివేదిక ప్రచురించింది. కార్పొరేట్లకు సమస్త వనరులను దోచిపెడుతున్న ఫలితంగానే విరాళాలు వెల్లువెత్తాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఈ నివేదిక ప్రకారం మొత్తంగా జాతీయ పార్టీలకు వచ్చిన విరాళాల్లో 88శాతం బిజెపికే దక్కాయి. 20వేల కంటే ఎక్కువ వచ్చిన విరాళాలపై ఎన్నికల సంఘానికి జాతీయ రాజకీయ పార్టీలు సమర్పించిన వివరాల ప్రకారం 2023-24లో ఈ పార్టీలకు మొత్తం రూ.12,547 కోట్లు విరాళాలుగా వచ్చాయి. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఈ విరాళాలు 199శాతం ఎక్కువ. రూ.281.48 కోట్ల విరాళాలతో కాంగ్రెస్ రెండోస్థానంలో నిలిచింది. పేరుకు రెండో స్థానంలో ఉన్నా బిజెపికి కంటే హస్తం పార్టీ చాలా దూరంలో ఉంది. మిగిలిన జాతీయ పార్టీలు సిపిఎం, ఆప్, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిఇపి) తమకు తక్కువ మొత్తంలో విరాళాలు వచ్చినట్లు ఇసికి నివేదించాయి. మరో జాతీయ పార్టీ బిఎస్‌పి ఈసారి కూడా తమకు ఎలాంటి విరాళాలు రాలేదని తెలిపింది. గత 18 ఏళ్ల నుంచి బిఎస్‌పి ఇదే విషయాన్ని పేర్కొంటూ వస్తోంది.

2022-23 ఆర్థిక సంవత్సరంలో బిజెపికి రూ.719.858 కోట్ల విరాళాలు రాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి అవి రూ.2,243.94 కోట్లకు పెరిగాయి. అంటే ఏకంగా 211.72 శాతం పెరిగాయి. కాంగ్రెస్‌కు 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.79.924 కోట్ల విరాళాలు రాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.281.48 కోట్లకు పెరిగాయి. కాంగ్రెస్‌కు 252.18 శాతం విరాళాలు పెరిగాయని ఎడిఆర్ నివేదిక పేర్కొంది. ఇదే సమయంలో ఆప్‌నకు విరాళాలు 70.18 శాతం లేదా 426.038 కోట్లు తగ్గాయి. ఎన్‌పిఇపికి కూడా విరాళాలు 98.02 శాతం లేదా రూ.7.331 కోట్లు తగ్గాయి. విరాళాల వివరాలను సమర్పించేందుకు గతేడాది సెప్టెంబర్ 30 వరకు ఇసి గడువు ఇచ్చింది. ఈ గడువులోగా ఆప్, బిఎస్‌పి మాత్రమే తమ నివేదికలను సమర్పించాయి. బిజెపి 42 రోజులు ఆలస్యంగా తన వివరాలను సమర్పించింది. సిపిఎం, కాంగ్రెస్, ఎన్‌పిఇపిలు వరసగా 43, 27, 23 రోజులు ఆలస్యంగా ఇసికి వివరాలు సమర్పించాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ పార్టీలకు కార్పొరేట్/వ్యాపార రంగాల నుంచి 3,755 విరాళాలు ద్వారా. రూ.2,262.55 కోట్లు (మొత్తం విరాళాలలో 88.92 శాతం) రాగా, 8,493 మంది వ్యక్తిగత దాతలు రూ. 270.872 కోట్లు (మొత్తం విరాళాలలో 10.64 శాతం) విరాళంగా ఇచ్చారని నివేదిక పేర్కొంది.

కార్పొరేట్/వ్యాపార రంగాల నుంచి వచ్చిన విరాళాల్లో 3,478 విరాళాలు (రూ.2,064.58 కోట్లు) బిజెపికే వచ్చాయని ఎడిఆర్ మిగతా 7లో

మరో బాదుడు

- రూ.50 పెరిగిన గ్యాస్ ధర
- నేటి నుంచే అమలు
- ఉపసంహరించాలి : సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి- న్యూఢిల్లీ, అమరావతి బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కారు సామాన్యులపై మరో భారం మోపింది. గృహావసరాలకు వినియోగించే 14.2 కేజీల ఎల్‌పిజి సిలిండర్‌పై రూ.50 మేర పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో ఈ భారం ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై) కింద సబ్సిడీ పొందుతున్న లబ్ధిదారులు, సబ్సిడీయేతర వినియోగదారులపై పడనున్నది. సవరించిన ధరలు నేటి (మంగళవారం) నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ ప్రకటించారు. "పిఎంయువై లబ్ధిదారులకు సిలిండర్‌పై ధర రూ.500 నుంచి రూ.550కు పెరగనున్నది. ఇతర వినియోగదారులకు ఇది రూ.803 నుంచి రూ.853కు పెరుగుతుంది" అని కేంద్రమంత్రి తెలిపారు. ఈ పెరిగిన ధరలు రాష్ట్రాలను బట్టి మారుతాయి. ప్రస్తుతం దేశరాజధాని న్యూఢిల్లీలో సబ్సిడీయేతర వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.803గా ఉన్నది. కోల్‌కతాలో రూ.829, ముంబయిలో రూ.802.50, చెన్నైలో రూ.818.50గా ధరలు ఉన్నాయి. అయితే, ఈ ధరలు మంగళవారం రూ.50 మేర పెరగనున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి : సిపిఎం

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గ్యాస్ ధరల పెంపునకు వ్యతిరేకంగా నిరసనలు తెలియజేయాలని ప్రజలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సోమవారం ప్రకటన విడుదల చేశారు. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లకు, ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.50 పెంచడం దారుణమన్నారు. ఇప్పటికే దేశంలో ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్న దశలో నిత్యావసరమైన గ్యాస్ ధర పెంచడం ప్రజల నెత్తిన బండ వేయడమేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ పథకం పైన కూడా భారం పడుతుందన్నారు. అందువల్ల పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కేంద్రప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని శ్రీనివాసరావు కోరారు.

పిపిపి మోడ్‌లో అమరావతిలో మెగా మెడ్ సిటీ

ఆరోగ్య సేవలకు బిల్‌గేట్స్, టాటాల భాగస్వామ్యం ● వయబిలిటీగ్యాప్ ఫండ్ ఇస్తాం
హెల్త్ టూరిజం ప్రమోషన్ ● ఆహార అలవాట్ల ద్వారా జీవనవిధానంలో మార్పు
ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో పిపిపి విధానంలో మెగా గ్లోబల్ మెడ్‌సిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో 25 మెడ్‌సిటీలను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉందని, అమరావతిలో మెడ్‌సిటీ నిర్మాణంపై కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. జిల్లాల వారీగా హెల్త్ రిపోర్టులపై సోమవారం సచివాలయంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. వరల్డ్ హెల్త్ డే సందర్భంగా సిఎం మీడియాతో మాట్లాడుతూ ఇందుకోసం 200 ఎకరాల భూమిని కేటాయించి అందులో 100 ఎకరాలు హెల్త్‌కేర్‌కు, సర్వీస్ సెక్టార్‌కు 40 ఎకరాలు రెసిడెన్షియల్‌కు 40 ఎకరాలు, కమర్షియల్‌కు 20 ఎకరాలు ఇచ్చే విధంగా విధానం రూపొందిందని, మెడ్‌సిటీ ఏర్పాటుపై ఆరోగ్యశాఖ, సిఆర్‌డిఎ కలిసి పనిచేస్తాయని వివరించారు. హెల్త్ టూరిజానికి కూడా ఈ మెగా మెడ్‌సిటీ ఉపయోగపడుతుందన్నారు. ఆహార అలవాట్లు , జీవన విధానం మార్పు ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని, ఇందుకోసం ప్రతిరోజు వ్యాయామం, యోగా , ధ్యానం చేయడంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. వాకింగ్‌తో పాటు దైవచింతనతో వత్తిడి తగ్గుతుందని సిఎం చెప్పారు. మన దేశ వారసత్వ సంపదైన యోగాను ప్రపంచమంతా నేడు అనుసరిస్తోందన్నారు. పొగాకు, డ్రగ్స్, ఆల్కహాల్‌ను దూరం పెడితే క్యాన్సర్ , లివర్, కిడ్నీ సమస్యలు తగ్గుతాయన్నారు. జంక్‌ఫుడ్,

పాలిష్డ్ బియ్యం తినడం తగ్గించి మిల్లెట్స్, ముడి బియ్యం తీసుకోవడంతో పాటు ఆహారంలో పీచు పదార్థం, కూరగాయలు ఎక్కువగా తినాలని ఆయన సూచించారు. రాష్ట్రాన్ని సంపన్న, ఆరోగ్య, సంతోష రాష్ట్రంగా తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉప్పు, నూనె, చక్కెర తగ్గిస్తే దాదాపు ఆరోగ్య సమస్యలు రావని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలన్నారు. కేరళ ప్రభుత్వం షుగర్ ఫ్రీ స్కూల్ మీల్స్ ప్రకటించిందని, తమిళనాడులో రేషన్ షాపుల్లో గ్లూకోజ్ టెస్ట్‌లకు స్ట్రిప్స్ ఉచితంగా ఇస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో క్లీన్‌కుక్ స్టవ్ పంపిణీ కింద అంగన్‌వాడీలకు గ్యాస్ స్టవ్‌లు ఇచ్చామని తెలిపారు. డెంగ్యూ ప్రూఫ్ హౌసింగ్ మోడల్ కింద సింగపూర్‌లో అక్కడి ప్రభుత్వం ఇళ్లకు ప్రత్యేక పేయింటింగ్ వేసి దోమల బెడద లేకుండా చేస్తోంన్నారు. ఎన్‌టిఆర్ ట్రస్ట్ తరపున న్యూట్రిఫుల్ యాప్ డెవలప్ చేశామని, దీనికి స్కాచ్ అవార్డు రావడంతో పాటు 4 లక్షల మంది ఈ యాప్‌ను అనుసరిస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. రైతులు పంటలకు పురుగుమందుల వినియోగం తగ్గించాలని వీటి వాడకం వల్ల పంజాబ్ క్యాన్సర్ కేపిటల్ అయిందని చెప్పారు. రాష్ట్రంలో రైతుల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యత నిస్తామన్నారు. మహిళల్లోనే హైపర్ టెన్షన్, క్యాన్సర్ ఎక్కువగా ఉందని, జిల్లాల వారీగా ఏ జిల్లాలో ఏ వ్యాధి ఎక్కువగా ఉందనే అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

డిజి లాకర్‌లో హెల్త్ రికార్డులు :

ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్లజారీలో రాష్ట్రం ముందంజలో ఉందని, రాష్ట్ర జనాభాలో 88శాతం మంది ప్రజలకు హెల్త్ అకౌంట్లు రూపొందించామన్నారు. కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా డిజిటల్ నెర్వ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదటి దశలో చిత్తూరు జిల్లా, ఫేజ్-3లో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఈ వర్చువల్ ఆసుపత్రులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా మన్నారు. హెల్త్ రికార్డులను రూపొందించి డిజిటల్ లాకర్‌లో పెడతామని,ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని చిన్న తనం నుంచే ట్రాకింగ్ చేస్తామని సిఎం తెలిపారు. కాలాన్ని బట్టి వ్యాధులు ఎప్పుడు వస్తాయో ప్రజలకు అలెర్ట్ మెసేజ్‌లు పంపేలా రూపకల్పన మిగతా 7లో

డోలీ మోతలు తప్పిస్తాం

- 'అడవితల్లి బాట'లో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్
- రూ.1005 కోట్లతో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- డుంబ్రిగుడ (అల్లూరి జిల్లా)

డోలీ మోతలు తప్పిస్తామని, దీనిలో భాగంగా గిరిజన ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలంలో సోమవారం ఆయన పర్యటించారు. తొలుత పెదపాడు పివిటిజి గ్రామాన్ని సందర్శించారు. థింసా నృత్యంతో గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను పవన్ పంపిణీ చేశారు. గ్రామస్తులతో ముఖాముఖి ద్వారా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాము పండించిన చిరుధాన్యాలను, అటవీ ఉత్పత్తులను స్టాల్స్‌గా గ్రామస్తులు పెట్టి వాటి గురించి పవన్‌కు వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను పవన్ సందర్శించారు.

అడవితల్లి బాట కార్యక్రమం ద్వారా పిఎం జన్‌మన్, పిఎంజిఎస్‌వై, ఎంజిఎన్ఆర్ఇజిఎ, పిఆర్ఆర్, టిఎస్‌పి పథకాల కింద రూ.1005 కోట్లతో 1,069 కిలోమీటర్ల మేర ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ గిరిజన మారుమూల గ్రామాలకు రోడ్లు లేక ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారని, నేటికీ డోలీ మోతలే కనిపిస్తున్నాయని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యతనిచ్చామని తెలిపారు. పచ్చని అడవి తల్లిని నమ్ముకుంటే బువ్వ పెడుతుందని, అందుకే గిరిజన ప్రాంత మిగతా 7లో

పవన్ పర్యటనతో ట్రాఫిక్‌లో ఇరుక్కున్న విద్యార్థులు

- జెఇఇ మెయిన్స్‌కు హాజరు కాలేకపోయామని కన్నీరు

ప్రజాశక్తి- పెందుర్తి (విశాఖపట్నం)

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అల్లూరి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విశాఖ నుంచి పెందుర్తి మీదుగా వెళ్తున్న సమయంలో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో, జెఇఇ మెయిన్స్ పరీక్ష రాసేందుకు వచ్చిన 23 మంది విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరు కాలేకపోయారు. విద్యార్థుల కథనం ప్రకారం... జివిఎంసి 97వ వార్డు చినముషిడివాడలోని ఐకాన్ డిజిటల్‌లో జెఇఇ మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. విశాఖ విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన పెందుర్తి వైపు పవన్ వెళ్లే క్రమంలో ట్రాఫిక్ నిలిచి పోయింది. అందులో ఇరుక్కుపోయిన విద్యార్థులు పరీక్షకు సకాలంలో హాజరు కాలేకపో యారు. ఆలస్యంగా పరీక్షా కేంద్రానికి రావడంతో వారిని అధికారులు లోనికి అనుమతించలేదు. దీంతో, పరీక్షా కేంద్రం వద్ద వారు నిరసన తెలిపారు.

పరీక్షకు హాజరు కాలేకపోయిన విద్యార్థులు

ట్రంప్ టారిఫ్‌లతో మార్కెట్లు అల్లకల్లోలం

- సెన్సెక్స్ 2,200 పాయింట్ల పైగా పతనం
- రూ.14 లక్షల కోట్లు ఆవిరి
- మదుపర్ల గగ్గోలు

ముంబయి : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల వేటు ప్రపంచ మార్కెట్లలో అల్లకల్లోలం సృష్టిస్తోంది. వరుస నష్టాలతో ఇప్పటికే కుదేలైన మార్కెట్లు.. సుంకాల ప్రకంపనలతో సోమవారం మార్కెట్లు పేకమేడల్లా కుప్పకూలాయి. అమెరికా, యూరప్, ఆసియా స్టాక్ ఎక్స్ఛేంజిలు భారీ నష్టాలను చవి చూశాయి. ఈ ప్రభావంతో దలాల్ స్ట్రీట్‌లోనూ అమ్మకాల వెల్లువ చోటుచేసుకుంది. ఒక్క పూటలో ఓ దశలో దాదాపు రూ.20 లక్షల కోట్ల సంపద తుడిచిపెట్టుకుపోయింది. బిఎస్ఇ సెన్సెక్స్ ప్రారంభంలో 4000 పాయింట్లు పతనమైంది. తుదకు 2,227 పాయింట్లు లేదా 2.95 శాతం పతనమై 73,137కు దిగజారింది. ఇంట్రాడేలో 71,425.01 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 742 పాయింట్లు లేదా 3.24 శాతం నష్టంతో 22,161కి పడిపోయింది. అన్ని రంగాల సూచీలు నష్టాలు చవిచూశాయి. ఐటి, లోహ, రియాల్టీ, ఆటో, ఫైనాన్షియల్ రంగాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్-30లో కేవలం ఒకే ఒక్క సూచీ హిందుస్థాన్ యూనిలీవర్ మాత్రం స్వల్పంగా పెరగ్గా.. మిగతా అన్నీ నేలచూపులు చూశాయి. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.14 లక్షల కోట్లు ఆవిరై.. రూ.389 లక్షల కోట్లకు పరిమితమైంది. ఈ ఒక్క మార్చిలోనే మదుపర్ల సంపద ఏకంగా రూ.30 లక్షల కోట్లు హరించుకుపోయింది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 3.63 శాతం, 3.88 శాతం చొప్పున పతనమయ్యాయి. భారీ నష్టాలతో మదుపర్లు లబోదిబోమన్నారు.

మూడో రోజూ యుఎస్ మార్కెట్లు ధమాల్ 7

రోడ్డు ప్రమాదంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దుర్మరణం

- సిఎం చంద్రబాబు సంతాపం

ప్రజాశక్తి- పీలేరు (అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గ పరిధిలోని సంబేపల్లెలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పీలేరు హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రమ మృతి చెందారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. రమ మృతికి సంతాపం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.... అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో స్పెషల్ కో-ఆర్డినేటర్‌గా విధులకు హాజరయ్యేందుకు పీలేరు నుంచి రాయచోటికి కారులో తన ఇద్దరు సిబ్బందితో రమ సోమవారం బయలుదేరారు. మార్గమధ్యలోని సంబేపల్లె సమీపంలో ఎదురుగా వచ్చిన మరో కారు వీరి కారును ఢీకొంది. దీంతో, రమ అక్కడికక్కడే మృతి చెందారు. అటెండర్ నాయక్, కంప్యూటర్ ఆపరేటర్ ముబారక్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముబారక్ పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అనంతపురం జిల్లాకు చెందిన రమ గత ఏడాది ఫిబ్రవరి ఐదున పీలేరు హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కర్నూలు నుంచి బదిలీపై వచ్చారు. ఎస్‌డిసి పీలేరు నియోజకవర్గం ఓటర్ నమోదు అధికారిగా కూడా ఆమె వ్యవహరిస్తున్నారు. ప్రమాద

రమ (ఫైల్)

సమాచారం తెలుసుకున్న పీలేరు తహశీల్దారు భీమేశ్వరరావు, హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డు ప్రమాదంలో రమ మృతి చెందడం దురదృష్టకరమని ముఖ్యమంత్రి చంద్ర బాబు పేర్కొన్నారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నివాళి

రాయచోటి ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో ఉంచిన రమ భౌతికకాయాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రమాద వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇరువురిని కూడా వారు పరామర్శించారు. రమ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. రమా మృతికి అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి ఒక ప్రకటనతో సంతాపం తెలిపారు ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- తిరుపతి, విజయవాడల్లో విద్యుత్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల ధర్నా
- సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం : సిహెచ్.నర్సింగరావు

2

54 మంది జిల్లా జడ్జిల బదిలీ

2

సాధారణ వివాదాలను క్రిమినల్ కేసులుగా ఎలా మారుస్తారు!

- యుపిలో ఎందుకీ పరిస్థితి
- చెక్ బౌన్స్ కేసులో చీఫ్ జస్టిస్ ఖన్నా వ్యాఖ్య

7

వక్ఫ్ ఆస్తులకు ఎసరు!

కార్పొరేట్లకు అప్పగించేందుకు రంగం సిద్ధం ● పిపిపి పేరుతో లీజుకిచ్చేందుకు ప్రకటన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి, అనంతపురం ప్రతినిధి)

జాతీయ స్థాయిలో వక్ఫ్ చట్ట సవరణపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతుండడగా, రాష్ట్రంలో కూడా కొత్త వివాదం నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని వక్ఫ్ భూములను లీజు విధానంలో 'పెద్దలకు' కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం విమర్శలకు తావిస్తోంది. ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఇఒఐ) పేరుతో వక్ఫ్ భూములను కార్పొరేట్లకు, ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేసింది. భూములు కావాల్సిన వారు వచ్చే నెల ఎనిమిద తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, ఎక్కడి భూములను ఇవ్వనున్నదనేది అత్యంత రహస్యంగా ఉంచడం అనేక సందేహాలకు తావిస్తోంది. పబ్లిక్, ప్రయివేటు భాగస్వామ్యంతో ఈ భూములను లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రధానంగా కీలక వాణిజ్య అవసరాలకు, వ్యాపారాలకు ఈ భూములను అప్పగించనున్నారు. సోలార్ ఎనర్జీ పార్కులు, పారిశ్రామిక వెంచర్లు, వాణిజ్య సముదాయాలు, విద్యా సంస్థలు, వైద్య సంస్థలు వంటివి ఏర్పాటు చేసుకునేందుకు సుముఖంగా ఉన్న పారిశ్రామికవేత్తలు ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదనలతో ముందుకు రావాలని కోరింది.

ఎకరా నుంచి 200 ఎకరాల వరకు ఇలా లీజుకు ఇవ్వనున్నారు. రాష్ట్రంలో దాదాపు 60 వేల ఎకరాల వరకు వక్ఫ్ భూములు ఉన్నట్లు సమాచారం. ఇందులో ఇప్పటికే సగం వరకు భూములు అన్యాక్రాంతమయ్యాయి. వీటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఇప్పటివరకు ఎటువంటి చర్యలూ లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. మిగిలి ఉన్న భూములను లీజుకు ఇవ్వాలని ప్రతిపాదించడం చర్చనీయాంశమైంది.

ఆదాయం కోసమా?

వక్ఫ్ భూములను బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టాలన్న ఆలోచన వెనుక భారీ ఆదాయ సముపార్జన లక్ష్యంగా ఉన్నట్లు సమాచారం. అనేక ప్రాంతాల్లో మార్కెట్ విలువ అధికంగా ఉన్న చోట ఈ భూములను లీజుకు ఇస్తే భారీగా ఆదాయం సమకూరుతుందని అధికారులు అంటున్నారు.

భూముల వివరాల్లో గోప్యత

ఏ భూములను ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ కింద ఇవ్వనున్నారన్న విషయం బయటకు పొక్కనివ్వకుండా రహస్యంగా ఉంచడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే ఏ భూములను ఈ పద్ధతిలో కేటాయించాలన్న గుర్తింపు జిల్లాల వారీగా జరిగినట్టు సమాచారం. ఈ వివరాలను బయటకు ఇవ్వక పోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా భూముల వివరాలను వెల్లడించి ఈ ప్రాంతంలో ఎవరైనా పెట్టుబడులు పెడతారా? అని ప్రకటన ఇవ్వడం పరిపాటి. ఎందుకంటే ఆ ప్రాంతంలో ఎక్కువమంది మొగ్గుచూపితే లీజు ధర కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అటువంటి వివరాలేవి బయటకు వెల్లడించకుండా ప్రకటన ఇవ్వడం పలు సందేహాలకు తావిస్తోంది. ఈ భూములను ఎలా లీజుకు ఇస్తారు? మార్గదర్శకాలు ఏమిటి? అనేవి బయటకు వస్తేనే వాస్తవాలు తెలుస్తాయి.

సుపరిపాలన కోసం సలహామండలి

- జూన్ 12 కల్లా వాట్సాప్ గవర్నెన్స్ పరిధిలోకి మరిన్ని సేవలు
- ఆర్‌టిజిఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మరింత మెరుగ్గా సుపరిపాలన అందించేందుకు ప్రత్యేక సలహామండలిని ఏర్పాటు చేయాలని అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ సలహామండలిలో గేట్స్ ఫౌండేషన్ నుంచి, అలాగే మద్రాసు ఐఐటి, ఇతర ప్రతిష్టాత్మక సంస్థలకు చెందిన 10 మంది నిపుణులను సభ్యులుగా నియమించాలన్నారు. సోమవారం సచివాలయంలో ఆర్‌టిజిఎస్‌పై సిఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మరింత మేలు చేసేలా సుపరిపాలన అందించేందుకు ఇంకా ఏమేమి చేయవచ్చనే దానిపై సలహామండలి అధ్యయనం చేసి సూచనలు చేసేలా ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి ప్రభుత్వ సేవలు కావాలన్నా ఆన్‌లైన్, డిజిటల్, వాట్సాప్ గవర్నెన్స్ సాంకేతిక మార్గాల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని సిఎం సూచించారు.

జూన్ 12 కల్లా ప్రభుత్వం డిజిటల్ రూపంలో అందించగలిగే సేవలన్నింటినీ వాట్సాప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకురావాలని సిఎం స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా ఆర్‌టిజిఎస్‌లో డేటా అనుసంధాన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఓర్వకల్లు దగ్గర ఏర్పాటు చేసే సిటీ రాష్ట్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని అన్నారు. ఓర్వకల్లు పరిసర ప్రాంతాల్లో అతిపెద్ద సోలార్ ప్రాజెక్టు వంటి మరిన్ని పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, ఇక్కడ ఆతిథ్య రంగాన్ని అభివృద్ధి చేసేలా పర్యాటకాభివృద్ధి సంస్థ సహకారంతో ఆధునికంగా హోటల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మొత్తం 500 సేవలు వాట్సాప్ ద్వారా అందించేందుకు వీలుందని, ప్రస్తుతం 245 సేవలు వాట్సాప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకొచ్చినట్లు, 1000కి పైగా సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ముఖ్యమంత్రికి ఐటి, ఆర్‌టిజిఎస్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ వివరించారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటుకు సంబంధించి మాస్టర్ ప్లాన్ రూపొందించే పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఆర్థిక, ప్రణాళికా శాఖల అధికారులకు సిఎం అభినందనలు

ఆర్థికాభివృద్ధిలో దేశం మొత్తమ్మీద రాష్ట్రం రెండో స్థానంలో ఉండటం పట్ల ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తోపాటు ఆర్థికశాఖ, ప్రణాళికాశాఖ ఉన్నతాధికారులను సచివాలయంలో సిఎం చంద్రబాబు అభినందించారు. ఉన్నతాధికారులకు సిఎం బహుమతిగా అరకు కాఫీ గిఫ్ట్ ప్యాక్‌లు అందించారు.

అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పడినందుకు సిఎం సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా పర్యటనలో ఉండటంతో ఈ భేటీకి హాజరుకాలేకపోయారు.

ఆక్వా సమస్య పరిష్కారం కోసం భాగస్వాములతో కమిటీ

అమెరికా సుంకాల కారణంగా నష్టపోతున్న ఆక్వా రాంగాన్ని ఆదుకునే అంశంపై సిఎం చంద్రబాబు సోమవారం సచివాలయంలో అధికారులు, ఎంపెడా ప్రతినిధులు, ఆక్వా రంగ భాగస్వాములతో రెండున్నర గంటలకు పైగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. రాష్ట్ర జిడిపిలో మత్స్యరంగం కీలకమైన భూమిక పోషిస్తుందన్నారు. సుంకాల కారణంగా సంక్షోభం ముంగిట ఉన్న ఆక్వా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ పరంగా అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. సమస్యకు పరిష్కారం చూపేందుకు భాగస్వాములతో కమిటీ ఏర్పాటు చేద్దామని సిఎం ప్రతిపాదించారు. ప్రస్తుత సమస్యకు పరిష్కారం, భవిష్యత్తుకు అవసరమైన ప్రణాళిక రూపొందించేందుకు కమిటీ సూచనలు చేయాలని సిఎం సూచించారు. ఆక్వారైతులు, ఆక్వా రంగ నిపుణులు, ప్రభుత్వ అధికారులు, భాగస్వాములు ఎంపెడా ప్రతినిధులు, ఎగుమతిదారులతో కమిటీ ఏర్పాటు చేసి మరింత లోతుగా సమస్యపై చర్చించి పరిష్కారం చూపేందుకు అవసరమైన సూచనలు ఈ కమిటీ చేయనుందన్నారు. ఆక్వా సాగులో 3 లక్షల మంది రైతులు ఉన్నారని, ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 50 వేలమంది ఆధారపడి ఉన్నారని అన్నారు. ఆక్వా రంగానికి కొత్త సుంకాలు మరింత నష్టం చేస్తాయని రైతులు, ఎగుమతిదారులు తెలిపారు. ఈక్విడార్ వంటి దేశాలు అనుస రిస్తున్న విధానాలపై చర్చించారు. అమెరికాతో కేంద్ర ప్రభుత్వం సత్వర సంప్రదింపులు జరిపేలా మాట్లాడుతానని సిఎం పేర్కొన్నారు.

వీధి కుక్కల సంతతి పెరగకుండా స్టెరిలైజేషన్

వీధి కుక్కల సంతాన నియంత్రణ కోసం 4 నెలల్లో స్టెరిలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు. గుంటూరులో వీధి కుక్క దాడిలో మృతి చెందిన నాలుగేళ్ల బాలుడు కె ఐజక్ కుటుంబానికి సిఎం రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. సిఎం ఆదేశాలతో సోమవారం బాలుడు కుటుంబానికి పరిహారాన్ని అధికారులు అందజేశారు. రాష్ట్రం మొత్తమ్మీద 3.43 లక్షల వీధి కుక్కలు ఉండగా, అందులో 2.03 లక్షల కుక్కలకు స్టెరిలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యిందని ముఖ్యమంత్రికి మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ వివరించారు. వీధి కుక్కల సంఖ్య పెరగకుండా అదుపు చేసేందుకు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల ఖాళీల భర్తీని తక్షణమే చేపట్టాలని సిఎం సూచించారు. గుంటూరు తరహా ఘటనలు మళ్లీ తలెత్తకుండా మున్సిపల్, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

54 మంది జిల్లా జడ్జిల బదిలీ

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో జిల్లా జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 54 మందిని బదిలీ చేసింది. వీరంతా ఈ నెల 21లోగా కొత్త పోస్టుల బాధ్యతలను స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. విజయవాడ ఎసిబి ప్రత్యేక కోర్టు స్పెషల్ జడ్జి బి సత్య వెంకట హిమబిందును స్టేట్ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ సభ్య కార్యదర్శిగా బదిలీ చేశారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఎం బబిత విజయనగరం ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి (పిడిజె)గా బదిలీ అయ్యారు. అనంతపురం పిడిజెగా ఉన్న జి శ్రీనివాస్‌ను నెల్లూరు ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జిగా బదిలీ చేశారు. చిత్తూరు పిడిజెగా ఉన్న ఎరుగుల భీమారావును అనంతపురం పిడిజెగా, విజయవాడ ఎంపి, ఎమ్మెల్యేల కేసుల ప్రత్యేక కోర్టు జడ్జిగా ఉన్న ఎస్ శ్రీదేవిని ఏలూరు పిడిజెగా, ఆమె స్థానంలో గుంటూరు, పోక్సో కేసుల ప్రత్యేక జడ్జిగా ఉన్న ఎ అనిత నియమితులయ్యారు. కృష్ణా జిల్లా, మచిలీపట్నం మొదటి అదనపు జిల్లా, సెషన్స్ జడ్జిగా ఉన్న చిన్నంశెట్టి రాజు విశాఖపట్నం పిడిజెగా నియమితులయ్యారు. కృష్ణా జిల్లా, మచిలీపట్నం పిడిజెగా ఉన్న అరుణ సారికను చిత్తూరు పిడిజెగా బదిలీ చేశారు. ఆలపాటి గిరిధర్ విశాఖపట్నం వ్యాట్ అప్పిలెట్ ట్రిబ్యునల్ ఛైర్మన్‌గా, వ్యాట్ అప్పిలెట్ ట్రిబ్యునల్ ఛైర్మన్ జి గోపి కృష్ణా జిల్లా మచిలీపట్నం పిడిజెగా, కర్నూలు మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి భూపాల్‌రెడ్డిని విజయవాడ ఎసిబి ప్రత్యేక కోర్టు స్పెషల్ జడ్జిగా, నెల్లూరు పిడిజెగా ఉన్న సి యామిని కడప పిడిజెగా, అక్కడ ఉన్న గొల్లా శ్రీదేవిని అనంతపురం ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ ఛైర్మన్ కమ్ లేబర్ కోర్టు ప్రిసైడింగ్ అధికారిగా, విజయనగరం పిడిజె బి సాయికళ్యాణ్ చక్రవర్తిని గుంటూరు పిడిజెగా, ఖాళీగా ఉన్న కర్నూలు సిబిఐ ప్రత్యేక కోర్టు స్పెషల్ జడ్జిగా ఎం శోభారాణి నియమితులయ్యారు.

'ఉక్కు' రక్షణకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలి : ఐఎన్‌టియుసి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి రాష్ట్రంలోని టిడిపి కూటమి నేతలు కట్టుబడి ఉండాలని ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1516వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రయివేటీకరణపై నిర్ణయం వెలువడిన క్షణం నుంచి నేటి వరకూ ఆందోళనలు, నిరసనలు, దీక్షలు కొనసాగుతున్నా కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి పట్టకపోవడం దారుణమన్నారు. తీరు మార్చుకోకుంటే రానున్న కాలంలో ఉద్యమం ఉధృతం కానుందని, ప్రజలు, కార్మికులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

మహా సూర్యనమస్కారంలో పాల్గొన్న విద్యార్థులు

అరకులోయలో మహా సూర్యనమస్కారం

- ప్రపంచ రికార్డు లక్ష్యంగా 21850 మంది విద్యార్థులతో యోగా

ప్రజాశక్తి - అరకులోయ (అల్లూరి జిల్లా)

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ రికార్డే లక్ష్యంగా అరకులోయలో మహా సూర్య నమస్కారం కార్యక్రమం జరిగింది. ఏజెన్సీలోని 41 పాఠశాలలకు చెందిన సుమారు 21,850 మంది విద్యార్థులతో ఈ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. 21 వేలకుపైగా విద్యార్థులు ఐదు నెలలుగా యోగా సాధన చేస్తూ సోమవారం 108 సూర్య నమస్కారాలతో గిన్నిస్ రికార్డు నెలకొల్పేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యం కోసం అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఎంతో కృషి చేస్తున్నారని కితాబిచ్చారు.

108 సూర్య నమస్కారాలు చేయడం సాధ్యం కాదని, ఒక్కొక్క సూర్య నమస్కారంలో 12 ఆసనాలు ఉంటాయని, 108 నమస్కారాల్లో 1296 ఆసనాలు ఉంటాయని, వాటిని వేసి గిరి విద్యార్థులు అసాధ్యాన్ని సుసాధ్యం చేశారని తెలిపారు. ప్రతి రోజూ సూర్య నమస్కారం చేయడం వల్ల మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రమశిక్షణ, జ్ఞాపకశక్తి, ఆత్మస్థైర్యం పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్, పాడేరు ఐటిడిఎ అభిషేక్ గౌడ్, పతంజలి సంస్థ బాధ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు. లండన్ వరల్డ్ రికార్డ్స్ యూనియన్ మేనేజర్ అలిస్ రేనాడ్ విచ్చేసి కార్యక్రమాన్ని పరిశీలించారు. సర్టిఫికెట్‌ను అందజేశారు.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో భారీ వర్షం

- గోడ కూలి కండక్టర్ మృతి
- నేల రాలిన మామిడి

ప్రజాశక్తి - విజయవాడ

ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల పంటలకు నష్టం వాటిల్లింది. రోడ్లపైకి, పల్లపు ప్రాంతాల్లోకి నీరు చేరింది. కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఎ.కొండూరు, రెడ్డిగూడెం, మైలవరం తదితర ప్రాంతాల్లో మామిడి నేల రాలింది. నందిగామ, కంచికచర్ల తదితర ప్రాంతాల్లో మిర్చి రైతులకు నష్టం వాటిల్లింది. జి కొండూరు మండలం పినపాక గ్రామంలో ప్రహరీ కూలి ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన కండక్టర్ ఉయ్యూరు మంగారావు (45) మరణించారు. భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

డిపో కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు అక్రమం

- ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పార్వతీపురం ఆర్‌టిసి డిపోలో కార్మిక, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిపో కార్యదర్శి, కండక్టర్ తాతబాబుపై డిపో మేనేజర్ అక్రమంగా కంట్రోలర్‌తో కంప్లైట్ రాయించి సస్పెండ్ చేసినట్లు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు షేక్ జిలాని బాషా, ప్రచార కార్యదర్శి టిపిఆర్ దొర సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ చర్య వల్ల డిపోలో అశాంతికి దారితీస్తోందని పేర్కొన్నారు. ఈ కేసులో డిపో మేనేజర్ కనీస ప్రమాణాలు పాటించకుండా కండక్టర్ తాతబాబును అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ఈ డిపోలో సి అండ్ టి కేసుల్లో యథేచ్ఛగా సస్పెన్షన్లు చేస్తున్నారని తెలిపారు. ఈ చర్యలను డిపో కార్మికులు తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

అసత్యాలను మానుకోవాలి

- వైసిపికి షర్మిల హితవు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అసత్యాలను వల్లె వేయడం వైసిపి మానుకోవాలని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల హితవు పలికారు. వైసిపి, ఆ పార్టీని మోసే సంస్థలకు పచ్చకామెర్ల రోగం తగ్గినట్లు లేదని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో స్వశక్తితో కాంగ్రెస్ పార్టీ ఎదుగుతుంటే అది చూసి ఓర్వలేని వైసిపి అసత్య ఆరోపణలు చేస్తోందన్నారు. ఇది ఆ పార్టీ చేతకాని తనానికి నిదర్శమన్నారు. గత ఎన్నికల్లో 11 సీట్లకే ప్రజలు పరిమితం చేసినా వారి చేష్టలు మారలేదని విమర్శించారు. తండ్రి ఆశయాలకు తూట్లు పొడిచి, రాష్ట్ర ప్రయోజనాలను ప్రధాని మోడీకి తాకట్టు పెట్టారని, స్వలాభమే పరమావధిగా రాష్ట్రాన్ని దోచుకుతిన్నట్లు ఆరోపించారు. ప్యాలెస్‌లు కట్టుకుని, సొంత ఖజానాలు నింపుకున్నారని విమర్శించారు. ల్యాండ్ టైటిల్ చట్టంతో ప్రజల ఆస్తులను కాజేయాలని చూశారన్నారు. రుషి కొండను కబ్జా చేశారని, రాష్ట్రాన్ని మోడీ దోస్తులకు దోచి పెట్టారని తెలిపారు.

నీటి కొరత లేకుండా చర్యలు

- మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా స్వల్పంగా నీటి కొరత ఉన్న 39 మున్సిపాలిటీల్లో జిల్లా కలెక్టర్లు, సంబంధితశాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సమస్య లేకుండా చూడాలని మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ సూచించారు. మున్సిపాలిటీల్లో వేసవిలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, గృహ నిర్మాణ ప్రాజెక్టుల పూర్తి అంశాలపై సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. జూన్ 12 నాటికి రెండు లక్షల టిడ్కో ఇళ్ళను లబ్ధిదారులకు అందేలా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ నెలాఖరుకు టిడ్కో ఇళ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనపై మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ ఏడాది అక్టోబరు 2 నాటికి అన్ని మున్సిపాలిటీల్లో ఇంటి వద్దే చెత్త సేకరణ, విభజన చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ ఉదయం మున్సిపల్ కమిషనర్లు, పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. అన్న క్యాంటీన్లలో ఆహార సరఫరా నాణ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ఆదేశించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- తిరుపతి, విజయవాడల్లో విద్యుత్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల ధర్నా
- సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం : సిహెచ్.నర్సింగరావు

విజయవాడ ధర్నా చౌక్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, కార్మికులు

ప్రజాశక్తి - విజయవాడ

ఉద్యోగ భద్రత కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యూటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు సోమవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్, తిరుపతి జిల్లాల్లో ధర్నాలు నిర్వహించారు. పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని, వాచ్‌మెన్ నుంచి షిఫ్ట్ ఆపరేటర్లుగా ఉద్యోగోన్నతి పొందిన కార్మికులకు పాత ఆపరేటర్లతో సమానంగా వేతనం చెల్లించాలని, కొత్తగా నిర్మించిన సబ్‌స్టేషన్లలో ఖాళీలను భర్తీ చేయాలని నినాదాలు చేశారు. విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నాలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో అనేక ఏళ్లుగా ఆపరేటర్లు, వాచ్‌మెన్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, బ్రేక్‌డౌన్ సిబ్బంది, బిల్ కలెక్టర్లు, మీటర్ రీడర్లు, స్టోర్స్ హమాలీలుగా వివిధ హోదాల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో కార్మికులు పని చేస్తూ సంస్థ అభివద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందర్నీ రెగ్యులర్ చేయాలని, బిల్ కలెక్షన్ ఏజెంట్లకు, మీటర్ రీడర్లకు, స్టోర్ హమాలీలకు పీస్ రేట్లు పెంచాలని, మహిళా ఉద్యోగులకు 15 రోజుల క్యాజువల్ లీవ్‌లతోపాటు అదనంగా ఐదు రోజులు స్పెషల్ క్యాజువల్ లీవ్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాలను ఎపిసిపిడిసిఎల్ డైరెక్టర్ కె.లింగమూర్తికి, ట్రాన్స్‌కో జెఎండికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జె.రాజశేఖర్, రాష్ట్ర నాయకులు, ఎపిసిపిడిసిఎల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, ఎల్.రాజు పాల్గొన్నారు. తిరుపతిలోని లక్ష్మీపురం సర్కిల్ నుంచి కేశవాయనగుంట ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం వరకు కాంట్రాక్ట్ కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా ఒక్క సమస్యా పరిష్కారం కాలేదని, వందలసార్లు వినతి పత్రాలు సమర్పిస్తున్నా పట్టించుకోకపోవడంలేదని తెలిపారు. 2022 పిఆర్‌సి అరియర్స్ కార్మికులకు నేటికీ చెల్లించకపోవడం అన్యాయమన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే 'ఛలో విజయవాడ' చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పి4 పేరుతో పేదల బతుకులను పెద్దల దయాదాక్షిణ్యానికి వదిలేస్తున్నారని విమర్శించారు. ధర్నా వద్దకు సిజిఎం హెచ్‌ఆర్‌డి రమణదేవి, డిజిఎంలు మూర్తి, సురేంద్రబాబు, వెంకటరత్నం, తదితర అధికారులు వచ్చి కార్మికులతో చర్చలు జరిపారు. డిస్కం పరిధిలోని కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సిఎండితో చర్చలకు ఏర్పాటు చేస్తామని, తమ పరిధిలోని సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన టిడిపి నాయకుడిని కఠినంగా శిక్షించాలి

- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, కంకనాలపల్లి అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తున్న వర్కర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన టిడిపి నాయకులు బొడ్డు వెంకటేశ్వరరావుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి బేబిరాణి, కె సుబ్బరావమ్మ సోమవారం ప్రకటన విడుదల చేశారు. అంగన్వాడీ వర్కర్‌పై వేధింపులు ఆపాలని, కేవలం కేసులు పెట్టి అరెస్టు చేయకుండా కాలయాపన చేయడంతో ఈ బెదిరింపులు మరింత తీవ్రమయ్యాయన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కేసు నమోదు చేయాలని, అంగన్వాడీ వర్కర్‌కు రక్షణ కల్పించాలని కోరారు. అంగన్వాడీ వర్కర్లు స్థానిక శాసన సభ్యుడిని కలిసినా ప్రయోజనం లేకపోవడంతో ముఖ్యమంత్రికి తన గోడు వెళ్లబోసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా పోలీసులు ఇందుకు కారకుడైన వెంకటేశ్వరరావుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టంతోపాటు మహిళను లైంగిక వేధింపుల సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిని శిక్షించాలి : కెవిపిఎస్

అంగన్వాడీ వర్కర్, దళిత వర్గానికి చెందిన స్వర్ణలతకు పదేపదే ఫోన్ చేసి లైంగిక వేధింపులకు గురి చేస్తున్న టిడిపి నాయకుడు బొడ్డు వెంకటేశ్వరరావుపై వెంటనే కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి సోమవారం ప్రకటన విడుదల చేశారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండానే పౌష్టిక ఆహారం ఇవ్వాలంటూ హుకుం జారీ చేయడం దుర్మార్గమన్నారు. సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. స్వర్ణలత భర్త మరణిస్తే బీమా డబ్బు రూ.5 లక్షలు ఇప్పిస్తామని చెప్పి, రూ.లక్ష డిమాండ్ చేయడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. స్వర్ణలత కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. బాధితురాలను రాష్ట్ర హోంశాఖ మంత్రి పరామర్శించి భరోసా ఇవ్వాలన్నారు.

నర్సింగ్ విద్యా సంస్థల ప్రక్షాళన

- మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటు, వాటి నిర్వహణను నియమ, నిబంధనలకు అనుగుణంగా ప్రక్షాళన చేయాలని హైపవర్ కమిటీ నూతన ఛైర్మన్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యు దుర్గాప్రసాదరావుకు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. సచివాలయంలో సత్యకుమార్‌తో దుర్గాప్రసాదరావు సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలు ఇరువురి మధ్య చర్చకు వచ్చాయి. నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటు, వాటి నిర్వహణకు సంబంధించిన పర్యవేక్షణ విషయాల్లో పలు లోపాలు తమ దృష్టికి వచ్చాయని మంత్రి తెలిపారు.

పెద్దయెత్తున అవినీతి, అక్రమాలు జరిగనట్లు ఆరోపణలు ఉన్నాయని, వీటికి అడ్డుకట్ట వేయాలని చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 560 విద్యా సంస్థల్లో ఏడాదికి 30 వేల మంది నర్సింగ్ కోర్సుల్లో ఉత్తీర్ణులవుతున్నారని, వీరిలో 133 సంస్థలు అనగా దాదాపు 25 శాతం 2019-24 మధ్య కాలంలో ఏర్పాటయ్యాయని వెల్లడించారు. ఈ క్రమంలో భారతీయ నర్సింగ్ కౌన్సిల్ నిబంధనలను ఉల్లంఘించి పేరెంట్ హాస్పిటల్ లేకుండానే 28 సంస్థల స్థాపనకు అనుమతి ఇచ్చారని, దీని పరిణామాల పట్ల మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.

భద్రాద్రి రామయ్యకి పట్టాభిషేకం

- హాజరైన రాష్ట్ర గవర్నర్
- స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలోని మిథిలా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన శ్రీరామ పట్టాభిషేకం వేడుక యాత్రికులను అలరించింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ వర్మ ఈ మహోత్సవ వేడుకకు హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తొలుత రామాలయ భద్రుని మండపంలో అర్చకులు స్వామివారి పాదుకలకు అభిషేకం జరిపారు. రాజ లాంఛనాలతో పవిత్ర పావన గౌతమీ నదీ తీరం నుంచి తీర్థములు తీసుకొచ్చారు. భాజాభజంత్రీల సందడి, సన్నాయి మేళాలు యాత్రికుల కోలాటంతో శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని ఊరేగింపుగా తీసుకురాగా.. కల్యాణ మండపంపై స్వామివారిని ఉంచారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ మహోత్సవాన్ని ఆద్యాంతం తిలకించారు. తొలుత రామాలయంలో స్వామివారిని దర్శించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాం నాయక్, భద్రాచలం, ఇల్లందు ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్‌పి రోహిత్ రాజ్, భద్రాచలం ఐటిడిఎ పిఒ రాహుల్, రామాలయం ఇఒ రమాదేవి తదితరులు పాల్గొన్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ వేడుకల విజయవంతంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కీలక భూమిక పోషించారు.

శ్రీకాంత్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

- మధురై నుంచి ఖమ్మానికి భౌతికకాయం
- సిపిఎం నేతల నివాళి
- 9న తుది వీడ్కోలు

శ్రీకాంత్ భౌతికకాయానికి నివాళులుర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం అఖిలభారత 24వ మహాసభల ప్రతినిధిగా మధురై వెళ్లి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్ మృతికి పలువురు నేతలు, ప్రముఖులు నివాళులర్పించారు. మధురైలోని అపోలో ఆస్పత్రిలో ఆదివారం ఆయన మృతి చెందడంతో భౌతికకాయాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు ఖమ్మం తీసుకొచ్చారు. పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీగా ప్రకాష్‌నగర్ నుంచి చర్చి కాంపౌండ్ మీదుగా మమత హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లారు. అక్కడ బాడీ డీకాంపోజ్ కాకుండా రసాయన చర్యలు పూర్తయ్యాక తిరిగి బైక్ ర్యాలీగా సిపిఎం జిల్లా కార్యాలయానికి తీసుకొనివచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రెండు గంటల వరకు ఓ గంటపాటు భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. వివిధ పార్టీల నేతలు, పలువురు ప్రముఖులు, సిపిఎం కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ... ప్రజా ఉద్యమాలకు, సిపిఎంకి యర్రా శ్రీకాంత్ మరణం తీరని లోటు అని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. శ్రీకాంత్ ముగ్గురు కుమారుల్లో ఒకరు అమెరికాలో ఉంటున్న నేపథ్యంలో బుధవారం ఆయనకు తుది వీడ్కోలు పలకనున్నట్టు తెలిపారు. సంతాప సభ అనంతరం శ్రీకాంత్ భౌతికకాయాన్ని స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని తన స్వగృహానికి బైక్ ర్యాలీగా తీసుకొని వెళ్లారు. శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో.. సిపిఐ నేతలు బాగం హేమంతరావు, దండి సురేశ్, ఎంపి వద్దిరాజు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ నేత గుర్రం అచ్చయ్య, టిడిపి, ఎన్‌డి, వివిధ పార్టీల నేతలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, సిఐటియు రాష్ట్ర నాయకులు మధు తదితరులు ఉన్నారు. జపాన్ పర్యటనలో ఉన్న యలమంచిలి పాలీ క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ రవీంద్రనాథ్, నాగమణి, రామకోటేశ్వరరావు, రమాదేవి.. ఫోన్‌లో సంతాపం తెలిపారు.

టిజి గోపాలరావు మృతి పట్ల సిఐటియు సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రక్షణశాఖ పరిశోధన, అభివృద్ధి సంస్థలో పనిచేస్తూ, సుదీర్ఘకాలం పాటు ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అదనపు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి, అనారోగ్య కారణాలతో ఆదివారం మృతిచెందిన టిజి గోపాలరావుకు సిఐటియు రాష్ట్ర కమిటీ సంతాపం తెలియజేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు సోమవారం ప్రకటన విడుదల చేశారు. గోపాలరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రక్షణశాఖ ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణ కోసం గోపాలరావు జీవితాంతం పోరాడారని తెలిపారు. ఈ క్రమంలోనే డిఆర్‌డిఎల్ ఉద్యోగం నుంచి తొలగించబడ్డారని పేర్కొన్నారు. అయినప్పటికీ తన ఉద్యమ జీవితాన్ని కొనసాగించారని చెప్పారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్‌లో కూడా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు.

సంపాదకీయం

ఎర్ర జెండా రెపరెపలు

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ అఖిల భారత మహాసభ తమిళనాడులోని మదురై నగరంలో విజయవంతంగా నిర్వహించడం ముదావహం. గత దశాబ్ద కాలంలో పార్టీ అనుసరించిన రాజకీయ విధానం, దాని అమలు తీరును ఆత్మవిమర్శనా పూర్వకంగా ఒక సమీక్షా నివేదికను రెండు నెలల ముందే పార్టీ శ్రేణులకు అందించి దానిపై శాఖ మొదలు అన్ని స్థాయిల్లో చర్చ అనంతరం మహాసభలో కూలంకషంగా చర్చించడం ప్రజాస్వామిక పని తీరుకు నిదర్శనం. రాజకీయ విధాన సమీక్ష ప్రాతిపదికగా రూపొందించిన రాజకీయ తీర్మానాన్ని బహిరంగంగా విడుదల చేసి సవరణలు, సూచనలు, సలహాలు ఆహ్వానించి, వాటిపైనా మహాసభ చర్చించింది. ఆమోదించిన రాజకీయ విధానాన్ని ఆచరణలోకి తేవడానికి పార్టీ నిర్మాణ పటిష్టత పెంచడానికి తీసుకోవలసిన చర్యలను గురించి నిర్మాణ నివేదిక మార్గ నిర్దేశనం చేసింది. ఈ మూడు డాక్యుమెంట్లపై కూలంకషమైన చర్చ సాగించి అన్నిటినీ మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించడం ఒక ముందడుగు. ఆ రీత్యా 'పార్టీ ఐక్యతకు పటిష్టతకు ఈ మహాసభ ప్రతీక' (దిస్ ఈజ్ ఎ కాంగ్రెస్ ఆఫ్ యూనిటీ అండ్ కన్సాలిడేషన్) అని వ్యాఖ్యానించడం సరైనది. సిపిఐ(ఎం) స్వతంత్ర శక్తిని పెంచుకోవాలనీ వామపక్ష ఐక్యతను పెంపొందించాలని మహాసభ తీసుకున్న నిర్ణయం ఎంతో సబబైనది. సామ్రాజ్యవాదాన్ని, అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిని నఖశిఖ పర్యంతం వ్యతిరేకించడం, సోషలిజం పట్ల మహాసభ అచంచల విశ్వాసం వ్యక్తం చేయడం కొనియాడదగినది.

దేశంలో నయా ఫాసిస్టు ధోరణులు వ్యక్తమవుతున్నాయనీ కార్పొరేట్-మతతత్వ కూటమిని ఒంటరి చేసి ఓడించాలని మహాసభ ఏకగ్రీవంగా నిర్ణయించిన కీలక పిలుపు ఆచరణాత్మకమైనది. ఈనాటి పరిస్థితులను మార్చి శ్రమజీవుల రాజ్యానికి బాట వేసేందుకు అదే సరైన మార్గం!

అఖిల భారత మహాసభలో పార్టీ విధాన నిర్ణయాలు చేసే కేంద్ర కమిటీని, వాటిని అమలు చేయడానికి పొలిట్‌బ్యూరోను, ప్రధాన కార్యదర్శిని ఎన్నుకుంటారు. నూతన ప్రధాన కార్యదర్శిగా ఎంఎ బేబి ఎన్నికయ్యారు. 85 మందితో కూడిన కేంద్ర కమిటీలో 35 మంది కొత్తగా రావడం, అందులో మహిళలు, అణగారిన తరగతులకు చెందినవారి ప్రాతినిధ్యం పెరగడం శ్లాఘనీయం. పార్టీ నిబంధనలు అందరికీ శిరోధార్యమంటూ నిర్దేశిత వయసు మీరిన హేమాహేమీలు స్వచ్ఛందంగా తప్పుకొని తమ బాధ్యతలను తమకంటే చిన్నవారికి అప్పగించడం ఆ పార్టీకే చెల్లింది! కొన్ని ప్రధానమైన జాతీయ అంతర్జాతీయ సమస్యలపై వివిధ తీర్మానాలను మహాసభ ఆమోదించింది. తద్వారా పాలకుల విధానాలను ఎండగట్టడంతోపాటు ఆయా అంశాలపై పార్టీ వైఖరిని కూడా వెల్లడించింది.

భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో పార్టీ అఖిల భారత మహాసభలను మూడు సార్లు నిర్వహించిన ఘనత మదురై నగరానికి దక్కింది. మహాసభకు ముందు మదురైలో, తమిళనాట నలుదిక్కులా వివిధ సమకాలీన అంశాలపై 50కి పైగా సదస్సులు నిర్వహించారు. నిష్ణాతులైన నిపుణులూ ఉద్దండ రాజకీయవేత్తలూ వాటికి హాజరు కావడంతో రాష్ట్రమంతటా విస్తారమైన చర్చకు దోహదపడడం గమనార్హం. ఏప్రిల్ 3న ఫెడరలిజంపై జరిగిన సదస్సు వాటికి కొస మెరుపు! కేరళ, తమిళనాడు ముఖ్యమంత్రులు హాజరై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విపక్ష పాలిత రాష్ట్రాలపట్ల అనుసరిస్తున్న వివక్షను ఎండగట్టారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలను దెబ్బతీస్తున్న నిరంకుశ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా లౌకికవాదులు, దేశభక్తియుత శక్తులు ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. చెన్నై మహానగరంలో మహనీయుడు కారల్ మార్క్స్ విగ్రహాన్ని ప్రతిష్టిస్తామన్న ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటన స్వాగతించదగినది. మహాసభ ముగింపుగా ఆదివారంనాడు మదురై అరుణార్ణవమైంది. భారీ బహిరంగసభ సిపిఐ(ఎం) ప్రతిష్టను ఇనుమడింపజేసింది. వేలాదిమంది యువతీ యువకులతో సాగిన ఎర్ర దండు కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముమ్మాటికీ 'భవిష్యత్తు ఎర్ర జెండాదే'నని సిపిఐ(ఎం) అఖిల భారత మహాసభ చాటి చెప్పింది.

మహనీయుల మాట

మనకు ఒక ఆయుధాన్ని ఇచ్చినందుకు మనం మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లకు రుణపడి వున్నాం. ఆ ఆయుధం మెషీన్ గన్ కాదు. అదే మార్క్సిజం-లెనినిజం.

- మావో

毛澤東

యుద్ధానికి కాలు దువ్వడం దేనికి?

ప్రజా ప్రపంచం

రష్యాపై యూరప్ దేశాలు యుద్ధానికి తలపడే ధోరణిని ప్రదర్శిస్తున్నాయి. ఇది పెట్టుబడిదారీ ప్రపంచంలో ప్రస్తుతం ఒక చిక్కు సమస్యగా కనిపిస్తోంది. రష్యా యూరప్‌ను ఆక్రమించుకునే దురుద్దేశ్యంతో వ్యవహరిస్తోందంటూ యూరప్ దేశాలు పదే పదే చేస్తున్న ప్రచారం బొత్తిగా అర్థం లేనిది. గతంలో అమెరికా గోర్బచేవ్‌కు ఇచ్చిన హామీ ప్రకారం నాటో తూర్పు దిశగా (రష్యా వైపుగా) విస్తరించేందుకు పూనుకోకూడదు. కాని, ఆ హామీని ఉల్లంఘించి రష్యాను రెచ్చగొట్టింది నాటో సభ్య దేశాలే. ప్రత్యేకించి అమెరికా, బ్రిటన్ పూనుకుని రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య మిన్స్క్‌లో కుదిరిన శాంతి ఒప్పందాన్ని భగ్నం చేశాయి. ఆ ఒప్పందం గనుక అమలులోకి వచ్చి వుంటే అసలు యుద్ధమే జరిగేది కాదు. రష్యాను ఎలాగైనా లొంగదీసుకుని అక్కడ ఉన్న సహజ వనరుల మీద తన పెత్తనాన్ని చెలాయించాలన్నదే నాటో దేశాల లక్ష్యం. బోరిస్ ఎల్సిన్ రష్యా అధ్యక్షుడిగా ఉన్న స్వల్ప కాలంలో పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదులు రష్యాను తమ పెత్తనం కిందకు తెచ్చుకోవచ్చునన్న కలలు కన్నారు. కాని ఆ కల ఎక్కువ కాలం నిలవలేదు. కాని వాళ్ళ ఆశలు మాత్రం అలానే ఉన్నాయి. అందుకే ప్రచ్ఛన్న యుద్ధం కాలంలో సోవియట్ యూనియన్ యూరప్‌ను ఆక్రమించు కుంటుందంటూ సాగించిన తప్పుడు ప్రచారాన్నే మళ్ళీ ఇప్పుడు తలకెత్తుకున్నారు. అర్థం పర్థం లేని ఈ ఎత్తుగడ పైకి చూస్తే చిన్నపిల్లలాటలా కూడా అనిపిస్తోంది.

ప్రభాత్ పట్నాయక్

అయితే ఇక్కడో ప్రశ్న తలెత్తుతుంది. ఒకపక్క అమెరికా ఎలాగైనా ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకాలన్న పట్టుదలతో ఉంది. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయంలోనే అంతర్లీనంగా రష్యా ఎటువంటి దురాక్రమణకూ పాల్పడలేదని అంగీకరించినట్లైంది. అయినప్పటికీ, యూరప్ ఇంకా 'రష్యా దురాక్రమణ' ప్రచారాన్ని ఎందుకు కొనసాగిస్తోంది? ఈ ప్రశ్న ముఖ్యంగా జర్మనీ విషయంలో బాగా వర్తిస్తుంది. రష్యాపై ఆంక్షలు విధించిన కారణంగా గణనీయంగా నష్టపోయిన దేశం జర్మనీయే. అంతవరకూ చౌకగా లభిస్తున్న రష్యన్ ముడిచమురు బదులు ఖరీదైన అమెరికన్ ముడిచమురును కొనవలసి వచ్చింది. దాని ఫలితంగా జర్మనీలో ఉత్పత్తి ఖర్చు బాగా పెరిగిపోయింది. దాంతో పరిశ్రమలు తమ ఉత్పత్తి కేంద్రాలను వేరే దేశాలకు తరలించడం ప్రారంభించారు. ఆ విధంగా జర్మనీలో పరిశ్రమలు మూతబడడంతో బాటు, అక్కడి ప్రజల జీవన వ్యయం కూడా బాగా పెరిగిపోయింది. ఉక్రెయిన్ యుద్ధం గనుక ముగిసిపోతే దాని వలన జర్మనీకి తక్కిన దేశాల కన్నా ఎక్కువగా ఊరట లభిస్తుంది. దాని ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. అయినప్పటికీ జర్మనీ ఇంకా రష్యా మీద యుద్ధానికి కాలు దువ్వడం దేనికి?

ఈ పరిణామాలను బట్టి సామ్రాజ్యవాద దేశాల నడుమ వైరుధ్యం, పోటీ మళ్ళీ తీవ్రం అవుతున్నట్టు నిర్ధారణకు రాకూడదు. ఆ యా బడా పెట్టుబడిదారీ ఆధిపత్య వర్గాల మధ్య శత్రుత్వం నెలకొని వుంటే అది సామ్రాజ్యవాద దేశాల నడుమ వైరుధ్యం పెరగడానికి దారి తీస్తుంది. కాని ఇక్కడ అటువంటి శత్రుత్వం లేదు. రష్యా ఎడల అనుసరించవలసిన వైఖరి విషయంలో వేరు వేరు దృక్పథాలు ఉన్నాయి. అంతే. లెనిన్ వివరించినట్టు, బడా పెట్టుబడిదారీ కూటములు వివిధ భౌగోళిక ప్రాంతాలపై ఆధిపత్యం కలిగివుండిన కాలంలో వాటి మధ్య శత్రుత్వం తలెత్తే అవకాశం ఉంటుంది. కాని ఇప్పుడు ప్రపంచం మొత్తాన్ని చుట్టుముట్టిన అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం కొనసాగుతోంది. అందుచేత సామ్రాజ్యవాద దేశాల నడుమ వైరుధ్యం చడీ చప్పుడూ లేకుండా ఉంటుంది. పైగా ఇప్పుడు జర్మనీ గాని, తక్కిన యూరోపియన్ దేశాలు గాని రష్యాతో శాంతి సంధి కుదుర్చుకోవడం తప్ప ఘర్షణను కొనసాగించడం వలన ఎటువంటి ప్రయోజనాలూ పొందలేవు. పైగా, ఎంతకాలంపాటు ప్రస్తుత యుద్ధం కొనసాగినా, దాని ద్వారా రష్యాను ఓడించడం ఏ విధంగానూ సాధ్యం కాదు.

అయితే ఇక్కడ ఒక వాదనను చేయవచ్చు. అమెరికా రక్షణ ఛత్రం నీడలో ఇంతవరకూ ఉక్రెయిన్ యుద్ధం కొనసాగింది. ఇప్పుడు అమెరికా పక్కకు తప్పుకుంటానని అంటోంది. అట్టి పరిస్థితిలో ఆ యుద్ధాన్ని కొనసాగించడానికి యూరప్ దేశాలు తమ సైనిక వ్యయాన్ని పెంచడం అవసరమే కదా. అలా చేయకపోతే, రేపొద్దున ఎటువంటి సంధి కుదిరినా, అందులో యూరప్ దేశాల ప్రయోజనాలను కాపాడుకోవడం సాధ్యం కాదు. అలా రక్షణ వ్యయం పెంచాలంటే సంక్షేమ చర్యల మీద చేసే ఖర్చు తగ్గించి ఆ మేరకు రక్షణ వ్యయాన్ని పెంచాలి. అప్పుడు ప్రజల్లో వ్యతిరేకత వస్తుంది. ఆ ప్రజలకు సర్దిచెప్పి తమ చర్యను సమర్థించుకోడానికి 'రష్యా దురాక్రమణ' ప్రచారాన్ని ముందుకు తెస్తున్నారు.

అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి భారీ ద్రవ్య లోటును ఆమోదించదు. అటువంటి లోటు వలన ఆర్థిక కార్యకలాపాలు మందగిస్తాయని, పెట్టుబడిదారీ స్వేచ్ఛకు భారీ ద్రవ్య లోటు ఆటంకం అని అది భావిస్తుంది. అయితే ఒక పొరుగు దేశం నుండి ప్రమాదం ముంచుకొస్తోందన్నప్పుడు ఇటువంటి అభ్యంతరానికి అంతగా బలం ఉండదు. పైగా యుద్ధ ప్రయత్నాలు కూడా ఆర్థిక కార్యకలాపాలను, ఉపాధిని పెంచుతాయి. అందుచేత ద్రవ్యలోటు పెంచడానికి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి గల అభ్యంతరాన్ని పక్కకు పెట్టవచ్చు. తాజాగా జర్మనీ తన రాజ్యాంగాన్ని సవరించి ప్రభుత్వ రుణ పరిమితిని పెంచుకోడానికి చట్టం చేసింది. యుద్ధ ప్రమాదం రష్యా నుండి పొంచి వుందని ప్రచారం చేయడం ద్వారా సంక్షేమ చర్యలకు కోతలు పడినందువలన ప్రజల్లో తలెత్తే వ్యతిరేకతను కూడా చల్లార్చవచ్చు.

అయితే ఈ వాదన కొంతవరకూ సమంజసంగానే ఉన్నా, ప్రస్తుత పరిస్థితిని పూర్తిగా వివరించడానికి ఇది సరిపోదు. రష్యాతో యుద్ధానికి కాలు దువ్వే ధోరణి యూరోపియన్ దేశాలలో ట్రంప్ అధికారంలోకి రావడానికి మునుపే తలెత్తింది. పచ్చి మితవాద, నయా ఫాసిస్టు రాజకీయ కూటములలో కన్నా, మధ్యేవాద ఉదార బూర్జువా కూటములే ఎక్కువగా ఈ రష్యన్ ప్రమాదం గురించి చాలా బలంగా ప్రచారం చేస్తున్నాయి. ఉదాహరణకు జర్మనీ లోని పచ్చి మితవాద పార్టీ ఎఎఫ్‌డి జర్మనీని మరింత సైనికీకరణ చేయడానికి గాని, అణ్వాయుధాలను సమకూర్చుకోడానికి కాని వ్యతిరేకించదు. బలంగానే సమర్థిస్తుంది, కాని ఆ పార్టీ కన్నా ఎక్కువగా ఇప్పుడు అక్కడ అధికారంలో ఉన్న సోషల్ డెమొక్రాట్లు, ఫ్రీ డెమొక్రాట్లు, గ్రీన్స్ లేదా ఇటీవల విజయాలు సాధించిన క్రిస్టియన్ డెమొక్రాట్-క్రిస్టియన్ సోషల్ యూనియన్ కూటమి ఉక్రెయిన్ యుద్ధం విషయంలో ఎక్కువగా రెచ్చిపోతున్నాయి. ఇటలీ లోని నయా ఫాసిస్టు మెలనీ కాని, హంగరీ లోని నయా ఫాసిస్టు ఓర్బన్ కాని ఈ విషయంలో అంతగా రెచ్చిపోవడం లేదు.

దీనిని బట్టి ఒక నిర్ధారణకు రావచ్చు. నయా ఫాసిస్టు రాజకీయ శక్తులు ఆర్థిక సంక్షోభ సమయంలో బడా పెట్టుబడి ఆధిపత్యాన్ని నిలబెట్టడం కోసం ఏదో ఒక 'అంతర్గత' శత్రువును సృష్టించి (ఏదో ఒక మైనారిటీ తెగకు గాని మైనారిటీ మతానికి గాని చెందిన సమూహాన్ని) ప్రజలలో ఆ శత్రువు పట్ల విద్వేష భావాన్ని రెచ్చగొట్టి వారి దృష్టిని ఆ వైపు మళ్ళిస్తాయి. తద్వారా జీవన సమస్యల నుండి, నిరుద్యోగం వంటి సవాళ్ళ నుండి వారి దృష్టిని తప్పిస్తాయి. అదే మధ్యేవాద ఉదార బూర్జువా రాజకీయ శక్తులు 'బాహ్య శత్రువు' వైపు ప్రజల దృష్టిని మళ్ళిస్తాయి. ఇప్పుడు యూరప్‌లో రష్యాను అటువంటి బాహ్య శత్రువుగా చిత్రిస్తున్నది అందుకే.

ఇది ఈ మధ్య తలెత్తిన ఒక కొత్త ధోరణిగా భావించవచ్చు. ఈ మధ్యేవాద ఉదార బూర్జువా పార్టీలు తమ తమ దేశాల ఆర్థిక వ్యవస్థలను సంక్షోభం లోంచి బైటకు తేవడానికి ఇన్నాళ్ళూ అనుసరిస్తూ వచ్చిన విధానాలు ఏవీ ఇప్పుడు పని చేయడంలేదు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి వీలుగా ప్రభుత్వ వ్యయం పెంచుదామంటే అందుకు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నిబంధనలు అడ్డం వస్తున్నాయి. ఈ పార్టీలు కొన్ని దశాబ్దాల క్రితం ప్రవేశ పెట్టిన నయా ఉదారవాద విధానాల ఫలితంగా ప్రజల్లో పెరిగిన నిరుద్యోగం, పేదరికం వలన వాటి ప్రజా మద్దతు తరిగిపోతోంది. ఆ మద్దతును ఏదో ఒక విధంగా మళ్ళీ కూడగట్టుకోవాలి. అందుకే ఇప్పుడు వాళ్ళు 'రష్యా ప్రమాదం' బూచిని చూపిస్తున్నారు.

దీనితోబాటు ఆయుధాల పరిశ్రమాధిపతుల ఒత్తిళ్ళు కూడా పని చేస్తున్నాయి. ఇన్నాళ్ళూ ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆ పరిశ్రమలకు బాగా ఆర్డర్లు వచ్చాయి. ఇప్పుడు ఆ యుద్ధం ఆగిపోతే వారి లాభాలు తగ్గిపోతాయి. జర్మనీలోని ఒక ప్రముఖ ఆయుధ పరిశ్రమ సంస్థ రైన్ మెటల్‌కు ఇంతవరకూ చేతి నిండా ఆర్డర్లు ఉన్నాయి. ఇప్పుడు జర్మనీ రాజ్యాంగాన్ని సవరించి ఆయుధాల ఖర్చును పెంచడానికి పూనుకోవడం వలన ఆ సంస్థ మరికొన్ని సంవత్సరాలపాటు ఆర్డర్లు పొందగలుగుతుంది. "రష్యన్ దురాక్రమణ" ప్రచారం అందుకు తోడ్పడుతుంది.

అయితే రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థ తనను తాను ఒక "మానవీయ" వ్యవస్థగా మలుచుకోగలిగినట్టు చెప్పుకుంటూ కొనసాగుతూ వచ్చింది. ప్రజాస్వామ్య విధానాన్ని బలపరిచిన వ్యవస్థగా, సార్వత్రిక ఓటు హక్కును కల్పించిన వ్యవస్థగా ప్రచారం చేసుకుంటూ వచ్చింది. సంక్షేమానికి గణనీయంగా ఖర్చు చేస్తున్నట్టు ప్రచారం చేసుకుంది. వలస విధానం ఉనికిలో లేదు కనుక సామ్రాజ్యవాద దోపిడీ దుర్లక్షణాలు తనలో ఏవీ లేనట్టు చెప్పుకుంటూ వచ్చింది. పెట్టుబడిదారీ వ్యవస్థ తాను పూర్తిగా 'మారిపోయానని' చెప్పుకుంటూ కొనసాగింది.

కాని ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇటువంటి ప్రచారాలు చేసుకోడానికి సాధ్యం కావడంలేదు. ఎందుకంటే ఆ 'మానవీయ' లక్షణాలేవీ కొనసాగించడం సాధ్యం కావడం లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ మళ్ళీ తన కల్తీ లేని భయంకరమైన వికృత రూపంతో ముందుకు వస్తోంది. పెట్టుబడిదారీ ప్రపంచంలో నయా ఫాసిస్టు అణచివేత అక్కడ ప్రజాస్వామ్యాన్ని పక్కకు నెట్టివేస్తోంది. ఈ పరిణామం పట్ల సోషల్ డెమాక్రటిక్ పార్టీలు చాలా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. సంక్షేమ రాజ్యం అనే భావనను తోసిరాజనే విధంగా ఇప్పుడు ఆయుధాల ఖర్చును పెంచే చర్యలు చట్టబద్ధత పొందుతున్నాయి. మూడవ ప్రపంచ దేశాలలో ఉన్న సహజ వనరులపై, ముడి సరుకులపై సామ్రాజ్యవాద దేశాలు పట్టు చిక్కించుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నాయి. ట్రంప్ ఉక్రెయిన్‌ను, గ్రీన్‌ల్యాండ్‌ను తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని ప్రయత్నించడం, మరోపక్క గాజాను ఆక్రమించుకుని అక్కడ పర్యాటక పరిశ్రమను అభివృద్ధి చేస్తానంటూ ప్రకటించడం కూడా ఇందులో భాగమే. అందుచేత ఇప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థ మళ్ళీ తన 'మానవీయ' రూపాన్ని సంతరించుకోగలుగుతుందని నమ్మడం అంటే సింహం గడ్డి మేస్తుందని నమ్మడం వంటిదే.

(స్వేచ్ఛానుసరణ)

నయా ఫాసిస్టు రాజకీయ శక్తులు ఆర్థిక సంక్షోభ సమయంలో బడా పెట్టుబడి ఆధిపత్యాన్ని నిలబెట్టడం కోసం ఏదో ఒక 'అంతర్గత' శత్రువును సృష్టించి (ఏదో ఒక మైనారిటీ తెగకు గాని మైనారిటీ మతానికి గాని చెందిన సమూహాన్ని ప్రజలలో ఆ శత్రువు పట్ల విద్వేష భావాన్ని రెచ్చగొట్టి వారి దృష్టిని ఆ వైపు మళ్ళిస్తాయి. తద్వారా జీవన సమస్యల నుండి, నిరుద్యోగం వంటి సవాళ్ళ నుండి వారి దృష్టిని తప్పిస్తాయి. అదే మధ్యేవాద ఉదార బూర్జువా రాజకీయ శక్తులు 'బాహ్య శత్రువు' వైపు ప్రజల దృష్టిని మళ్ళిస్తాయి. ఇప్పుడు యూరప్‌లో రష్యాను అటువంటి బాహ్య శత్రువుగా చిత్రిస్తున్నది అందుకే.

ఇప్పుడు ప్రపంచం మొత్తాన్ని చుట్టుముట్టిన అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం కొనసాగుతోంది. అందుచేత సామ్రాజ్యవాద దేశాల నడుమ వైరుధ్యం చడీ చప్పుడూ లేకుండా ఉంటుంది. పైగా ఇప్పుడు జర్మనీ గాని, తక్కిన యూరోపియన్ దేశాలు గాని రష్యాతో శాంతి సంధి కుదుర్చుకోవడం తప్ప ఘర్షణను కొనసాగించడం వలన ఎటువంటి ప్రయోజనాలూ పొందలేవు. పైగా, ఎంతకాలం పాటు ప్రస్తుత యుద్ధం కొనసాగినా, దాని ద్వారా రష్యాను ఓడించడం ఏ విధంగానూ సాధ్యం కాదు.

దగాపడ్డ నెల్లూరు జిల్లా ధాన్యం రైతులు

సమస్య

నెల్లూరు జిల్లాలో వరి ధాన్యానికి తగిన ధరలు లేక రైతులు తెగ నమ్ముకుంటున్నారు. కాని టిడిపి కూటమి ప్రభుత్వం మాత్రం ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమైంది.

గింజ ధాన్యం మిగలకుండా కొంటాం. 300 కొనుగోలు కేంద్రాలు పెట్టాం. మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోలు చేసిన దళారులు, మిల్లర్లు జైలు పాలే. రైతులకు తగినన్ని గోతాలను సరఫరా చేస్తాం-అని ప్రకటించింది ప్రభుత్వం. కానీ ఆచరణలో జరిగిందేమిటి? కొనుగోలు కేంద్రాలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలాయి. రైతులను ఆదుకోలేదు. రైతులు కొనుగోలు కేంద్రాలకెళితే ధాన్యంలో తేమ, మట్టి పెళ్ళలు, తాలు ఉన్నాయని ఎండబెట్టుకొని రమ్మని వెనక్కు పంపారు. సవాలక్ష నిబంధనలు పెట్టారు. పేరుకు 300 కేంద్రాలు పెట్టినట్లు ప్రకటించినా ఆ కేంద్రాలలో తగినన్ని గోనె సంచులు, తేమ శాతం చూసే మిషన్లు, జిపిఎస్ ఉండే లారీలు, ట్రాక్టర్లు, బ్యాంకు గ్యారంటీ ఇచ్చిన మిల్లర్లు సరిపడా లేరు. పైనుంచి ప్రభుత్వం గోతాలు పంపలేదని ట్రాక్టర్లు, లారీలు, కూలీలు మీరే ఏర్పాటు చేసుకోమని కొనుగోలు కేంద్రం అధికారులు చెప్పడంతో విసిగి వేసారిన రైతులు గత్యంతరం లేక దళారులకు, మిల్లర్లకు ధాన్యాన్ని తెగనమ్ముకున్నారు. ఇందులో అసలు విషయం ఏమిటంటే దళారులు, మిల్లర్లు, ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ నాయకులు సిండికేట్ అయ్యారు. ఇదే ధాన్యాన్ని దళారులు, మిల్లర్లు, రైతుల వద్ద తేమ పేరుతో పుట్టికి 70 కేజీలు అదనంగా అనగా పుట్టి 920 కేజీలు తీసుకుని ధర 16 వేల నుంచి 17 వేల రూపాయలకు కొనుగోలు చేశారు. ఈ ధాన్యానికే రైతుల దగ్గర రికార్డులు తీసుకొని ఆ రైతుల పేరుతోనే ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకుంటున్నారు. రైతు రెండు విధాల నష్టపోతే దళారులు రెండు విధాలా లాభపడ్డారు. ఒక్క దళారి మీద ఒక్క కేసు కూడా లేదు. ఐదు లక్షల టన్నుల ధాన్యం కొంటామని ప్రకటనలు చేశారు. సీజన్ ఏప్రిల్ నెల 15వ తేదీ నాటికి ముగియనుండగా మార్చి 31 నాటికి 74 వేల టన్నులు కొన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో మిల్లర్లు రైతుల పేర్లతో అమ్ముకున్నవి సగం ఉంటాయి.

చంద్ర రాజగోపాల్

నెల్లూరు జిల్లాలో ప్రభుత్వం ప్రకటించిన 3.57 లక్షల ఎకరాల్లో కాక... ఈక్రాప్ నమోదు కాని, పట్టా భూములు, ప్రభుత్వ భూములు, పోరంబోకు, చెరువు లోతట్టు భూములు మరో రెండు లక్షల ఎకరాల వరకు ఉంటాయి. ఆ విధంగా మొత్తం ఆరు లక్షల ఎకరాల్లో 20 లక్షల పుట్ల ధాన్యం ఉత్పత్తి అయింది. పుట్టికి సగటున 3000 రూపాయల వరకు నష్టం లెక్కించినా నెల్లూరు జిల్లా రైతాంగం రూ.450 కోట్లు నష్టపోయింది. ఈ డబ్బు దళారులు, మిల్లర్లు అధికార పార్టీ నాయకుల జేబులలోకి పోగా రెండు విధాలా నష్టపడ్డ రైతులకు తమ కుటుంబ సభ్యుల శ్రమ కూడా మిగలలేదు.

పెట్టుబడులు కూడా చేతికి రాక, మరో పైరు వేసుకునే గత్యంతరం లేక వరినే నమ్ముకుని రైతులు నట్టేట మునిగారు. నెల్లూరు జిల్లాలో ధాన్యం మాసూలు ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభమై ఏప్రిల్ 15 వరకు కొనసాగుతాయి. ప్రారంభంలో కొంత తేమ శాతం ఉన్న మార్చి ఏప్రిల్ నెలలలో ఎండలు ముదిరి తేమ శాతం 17 లోపే ఉంటుంది. బుచ్చిరెడ్డిపాలెం, కోవూరు, రేబాల, లేబూరు, పేడూరు, ఆత్మకూరు, ముత్తుకూరు మరో 50 కేంద్రాలను ఎ.పి రైతు సంఘం నాయకులు స్వయంగా పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు కనీసం బోర్డులు కూడా లేవు. ఒక్కో కేంద్రం పరిధిలో 10 వేలు, 25 వేల ఎకరాలలో వరి వేయగా దిగుబడుల్లో ప్రభుత్వం కొన్నది కేవలం 2 శాతం కూడా లేదు.

రైతుల కోరేది తమ శ్రమకు తగిన ఫలితం. తమ కుటుంబం యావత్తు పనిచేస్తున్నందున కుటుంబం యావత్తు ప్రభుత్వం నిర్ణయించిన జీవనం గడపాలంటే రైతు పెట్టిన పెట్టుబడి పోను అందులో సగం మిగలాలని వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ సూచించారు. ఉదాహరణకు రైతు లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే రూ.1,50,000 ఫలితం రావాలి. దీనిని సి2 ప్లస్ 50 ఫార్ములా అంటారు. ఈ విధానాన్ని బిజెపి కేంద్ర ప్రభుత్వం చట్టం చేయలేదు. పైగా మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను చేసింది. దేశవ్యాప్తంగా రైతులు మూడు నల్ల చట్టాలను వ్యతిరేకంగా పోరాడితే వాటిని రద్దు చేసి కొత్త చట్టాలు తెస్తామని అవి కూడా తేలేదు. పాత నల్ల చట్టాలను మరో రూపంలో తెచ్చే ప్రయత్నంలో బిజెపి ప్రభుత్వం ఉంది.

రైతులు కోరేది గిట్టుబాటు ధర. కేంద్రం ఇచ్చేది కనీస మద్దతు ధర. మద్దతు ధర తక్కువ కాగా అది కూడా అమలు కాక రైతులు ధాన్యాన్ని తెగనమ్ముకుంటున్నారు. కేంద్రం ఎంఎస్‌పి ని నిర్ణయించే సమయంలో పెట్టుబడి వడ్డీ, పెరిగిన ఎరువుల ధరలు, విత్తనాలు, పురుగు మందులు, ట్రాక్టర్ అద్దెలు, పెరిగిన కూలీలు, రైతు జీవన వ్యయం లెక్కలోకి తీసుకోకుండా ఎంఎస్‌పి తక్కువగా నిర్ణయించి కార్పొరేట్లకు పూర్తి అనుకూలంగా వ్యవహరిస్తున్నది. ఆహార ధాన్యాల ధరలు అదుపులో పెట్టకపోతే కార్మికుల జీతాలు ఎక్కువ అడగవలసి వస్తుంది. పరిశ్రమల యజమానులకు అనుకూలంగా ధరలు నిర్ణయిస్తారు. రైతుల చేతుల్లో ధాన్యం ఉన్నప్పుడు ధరలు తక్కువగాను వ్యాపారుల చేతుల్లోకి వెళ్ళగానే ధరలు పెరిగి వ్యాపారులకు లాభదాయకంగా మారుతుంది.

కేరళ రాష్ట్ర ప్రభుత్వం వరి రైతులకు క్వింటాలుకు 800 రూపాయలు బోనస్‌గా ఇచ్చింది. మన రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు 500 రూపాయలు బోనస్‌గా ఇప్పించాలని, మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీము ద్వారా గోదాముల్లో దాచి పెట్టుకున్న రైతులకు ఆర్థిక సహాయం అందించాలని, తగినన్ని గోనె సంచులను సరఫరా చేయాలని, ధాన్యం మద్దతు ధరకు కొనని మిల్లర్లపై చర్యలు తీసుకుని, వారి లైసెన్సులను రద్దు పరచాలని, జిపిఎస్ ఉన్న లారీలను, ట్రాక్టర్లను కూలీలతో పాటుగా అందుబాటులో ఉంచాలని ఎ.పి.రైతు సంఘం పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అర్జీలు సమర్పించింది. రైతుల న్యాయమైన ఈ డిమాండ్లను అమలు పరచకుండా కూటమి ప్రభుత్వం నెల్లూరు జిల్లా రైతాంగాన్ని నట్టేట ముంచింది.

ధాన్యం ధరలు మరీ తగ్గడంతో కౌలు రైతులు అప్పుల పాలవుతున్నారు. కోలుకోలేని స్థితిలో ఉన్నారు. చట్ట ప్రకారం రికార్డ్ అయిన కౌలు రైతులు నాలుగో వంతు కూడా లేరు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలు వారికి వర్తించడం లేదు. మొత్తం రైతులలో సగం మంది కౌలు రైతులు ఉన్నారు. అన్ని ఖర్చులు భరించి భూమి యజమానికి లాభనష్టాలతో సంబంధం లేకుండా ఎకరాకు పుట్టెడు ధాన్యం ఇస్తున్నారు. మద్దతు ధర కన్నా మార్కెట్లో ధరలు బాగా ఉండి తెగుళ్ళు, అధిక వర్షాలు, అనావృష్టి లేకుండా దిగుబడి ఎక్కువ వస్తే అన్ని ఖర్చులూ పోను ఎకరాకు పుట్టి వరకు మిగిలే అవకాశం ఉంది. మార్కెట్ పతనంతో కౌలు రైతుకు మిగిలేదేమీ లేకుండా పోయింది.

కేరళ రాష్ట్ర ప్రభుత్వం వరి రైతులకు క్వింటాలుకు 800 రూపాయలు బోనస్‌గా ఇచ్చింది. మన రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు 500 రూపాయలు బోనస్‌గా ఇప్పించాలని, మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీము ద్వారా గోదాముల్లో దాచి పెట్టుకున్న రైతులకు ఆర్థిక సహాయం అందించాలని, తగినన్ని గోనె సంచులను సరఫరా చేయాలని, ధాన్యం మద్దతు ధరకు కొనని మిల్లర్లపై చర్యలు తీసుకుని, వారి లైసెన్సులను రద్దు పరచాలని జిపిఎస్ ఉన్న లారీలను, ట్రాక్టర్లను కూలీలతో పాటుగా అందుబాటులో ఉంచాలని ఎ.పి.రైతు సంఘం పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అర్జీలు సమర్పించింది. రైతుల న్యాయమైన ఈ డిమాండ్లను అమలు పరచకుండా కూటమి ప్రభుత్వం నెల్లూరు జిల్లా రైతాంగాన్ని నట్టేట ముంచింది. రాజకీయ పార్టీల అనుబంధాలకు అతీతంగా ఢిల్లీ రైతాంగ ఉద్యమ పద్ధతుల్లో ఇక్కడి రైతులు పోరాటంలోకి రావడమే దీనికి పరిష్కార మార్గం.

/ వ్యాసకర్త ఎ.పి రైతు సంఘం సీనియర్ నాయకులు/

జనవాక్యం

అయ్యో...బర్మా!

పెను భూకంపం ధాటికి మయన్మార్ (బర్మా) కకావికలమైంది. 3,350 పైగా మానవ ప్రాణాలు పోయినట్లు, 4,500 మంది క్షతగాత్రులైనట్టు లెక్క ఇప్పటికి తేలినా, గంట గంటకు ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది. అమెరికా అంచనాల ప్రకారం విగత జీవుల సంఖ్య కొన్ని వేలల్లో ఉండొచ్చు. అక్కడి రెండు పెద్ద నగరాలు కూలిన భవనాలు, నిర్మాణాలతో మట్టి దిబ్బలుగా మారినట్లు ఛాయాచిత్రాలు చెప్తున్నాయి. ఆ శిథిల నగరాల్లో చిక్కుకున్న ప్రాణాలు ఎన్ని ఉన్నాయో, ఎంతవరకు నిలబడతాయో ఎవరూ చెప్పలేరు. వెంటనే అక్కడ సహాయక చర్యలు అందించడానికి భారత్ ముందుకు రావడం, 139 టన్నుల సహాయక సామగ్రి, పలు సహాయక బృందాలు, విపత్తు నిర్వహణా టీములు వెంటనే పనిలోకి దిగడం అభినందనీయం. చైనా, రష్యా, బ్రిటన్ కూడా సాయానికి దిగడం సంతోషం. అయితే ఇలాంటి విషాద సమయంలో కూడా అక్కడి సైనిక పాలకులు విపక్షీయులపై ఆయుధ దాడులు ఆపకపోవడం బాధాకరం. జపాన్ తరహాలో నిబంధనల మేరకు నిర్మాణాలు జరిగితే వైపరీత్యాల వేళ తక్కువ ప్రాణ నష్టం, ఆస్తి నష్టం ఉంటుంది. ఇలా వేలాది ప్రాణాలు, విపరీతమైన ఆస్తి నష్టం జరగదు. బర్మాతో సహా, మిగతా దేశాలకు ఈ భూకంపం కనువిప్పు కలిగించాలి. ప్రకృతి వైపరీత్యం జరగకుండా ఎవరూ ఆపలేరు. దాని నుండి తక్కువ నష్టం కలిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోగలవు. అలాంటి చర్యలు సుస్థిరమైన, ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం కాగలదు. ప్రకృతిని శాసించలేం. ఆ కోపానికి గురి కాకుండా, గురైనా తక్కువ బాధ పెట్టేలా సమాయత్తం కావడం మన చేతిలోనే ఉంది. బర్మాకి వచ్చిన కష్టం బాధాకరం. వారి కన్నీరు తుడుస్తూనే, మన కళ్ళు తెరుద్దాం.

-డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

వక్ఫ్ చట్టంపై జమ్ముకాశ్మీర్ అసెంబ్లీలో ఆందోళనలు

శ్రీనగర్ : ఇటీవల పార్లమెంట్ ఆమోదించిన వక్ఫ్ (సవరణ) బిల్లు 2025పై జమ్ముకాశ్మీర్ అసెంబ్లీలో సోమవారం ఆందోళనలు జరిగాయి. సభ ప్రారంభమైన వెంటనే ఈ బిల్లుపై చర్చ నిర్వహించాలని కోరుతూ అధికార నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ అబ్దుల్ రహీం రాథర్ తిరస్కరించిన దగ్గర నుంచి ఈ ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ఎన్‌సితో సహ అసెంబ్లీలో అన్ని పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించాయి. ఈ బిల్లు ఆమోదయోగ్యం కాదని విమర్శించాయి. బిజెపి సభ్యులు వక్ఫ్ బిల్లుకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఎన్‌సి ఇచ్చిన తీర్మానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఆందోళనలతో సభకు పదేపదే అంతరాయం కలిగింది. రెండుసార్లు సభను స్పీకర్ వాయిదా వేశారు. తరువాత కూడా ఆందోళనలు కొనసాగడంతో మూడోసారి స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

జూన్ 3న దక్షిణ కొరియా అధ్యక్ష ఎన్నికలు ?

సియోల్ : దక్షిణ కొరియా అధ్యక్ష ఎన్నికల తేదీని జూన్ 3న మంత్రివర్గం ఖరారు చేయవచ్చని భావిస్తున్నారు. దేశంలో సైనిక పాలన విధించారన్న కారణంపై రాజ్యాంగ కోర్టు గత వారంలో అధ్యక్ష పదవి నుండి యూన్ సుక్ యోల్‌ను తొలగించింది. అధ్యక్ష ఎన్నికల రోజును సెలవు దినంగా ప్రకటించాల్సి వున్నందున చట్టపరంగా అవసరం లేనప్పటికీ మంగళవారం దీనిపై కేబినెట్ నిర్ణయం తీసుకోనుందని సంబంధిత ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. కొత్త అధ్యక్షుడిని 60రోజుల్లోగా ఎన్నుకోవాల్సి వుంది. తాత్కాలిక అధ్యక్షుడు, ప్రధాని హన్ డక్ సూ ప్రకటించేవరకు మీడియా వార్తల్లో వస్తున్న తేదీ ఖరారు కాదని జాతీయ ఎన్నికల కమిషన్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విద్యుద్ఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండల పరిధిలోని రాచువారి పల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాచువారిపల్లి గ్రామానికి చెందిన నంబూరి ప్రసాద్ (46) తన పొలంలో కళింగరి, దోస పంటలను సాగు చేస్తున్నారు. రోజువారి పనిలో భాగంగా సోమవారం మధ్యాహ్నం నీటి తడులు అందించడానికి పొలం వద్దకు వెళ్లారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో మీటర్‌కు ఫీజు వేసేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఈ ప్రమాదంలో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందారు. విషయ తెలిసిన వెంటనే ఎఎస్ఐ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలిచారు. మృతునికి భార్య చంద్రకళ, కుమార్తెలు హర్షిత, తేజస్విని ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టారిఫ్‌లతో అమెరికా బెదిరింపులు

- చైనా విమర్శ

బీజింగ్ : అమెరికా ఏకపక్షవాదాన్ని, రక్షణవాదాన్ని అవలంబిస్తూ టారిఫ్‌లతో ఆర్థిక బెదిరింపులకు పాల్పడుతోందని చైనా విమర్శించింది. "అంతర్జాతీయ నియమాల కంటే కూడా అమెరికాను మొదటి స్థానంలో వుంచడమనేదే ఈ ఏకపక్షవాదం, రక్షణవాదం, ఆర్థిక బెదిరింపుల ప్రధాన లక్ష్యంగా వుంది." అని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ విలేకర్లతో సోమవారం వ్యాఖ్యానించారు. ఈ కొత్త టారిఫ్‌ల వల్ల అంతర్జాతీయ ఉత్పత్తి, సరఫరా చెయిన్ సుస్థిరత దెబ్బతింటుందని అన్నారు. పైగా కోలుకుంటున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా తీవ్రంగా ప్రభావితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత వారంలో చైనా సహా పలు దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెద్ద మొత్తంలో టారిఫ్‌లు విధించారు. దీనిపై చైనా సహా ఇతర దేశాలు కూడా తక్షణమే స్పందించాయి. దీటైన చర్యలు తీసుకున్నాయి. "చైనాను ఎదుర్కొనాలంటే ఒత్తిళ్లు, బెదిరింపులు మార్గం కాదు, చైనా తన చట్టబద్ధమైన హక్కులను, ప్రయోజనాలను కచ్చితంగా కాపాడుకుంటుంది." అని లిన్ చెప్పారు.

ఈ టారిఫ్‌ల సమస్యను పరిష్కరించేందుకు నిర్దిష్ట చర్యలు తీసుకోవాల్సిందిగా టెస్లా సహా అమెరికన్ కంపెనీల ప్రతినిధులను చైనా కోరింది. హాంకాంగ్, షాంఘైల్లో మార్కెట్లు క్షీణించినా చైనా విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. అమెరికా సుంకాలు ప్రభావం చూపినప్పటికీ 'ఆకాశం ఏమీ కుప్పకూలిపోదు' అని పీపుల్స్ డైలీ వ్యాఖ్యానించింది. "విచక్షణారహితంగా అమెరికా విధించిన సుంకాలను ఎదుర్కొంటున్నా మేం ఏం చేస్తున్నామో మాకు తెలుసు, మాకుండే సాధనాలు మాకున్నాయి." అని వ్యాఖ్యానించింది. టారిఫ్ సమస్యకు మూలం అమెరికాలోనే వుందని, అమెరికన్ కంపెనీలు ఆ సమస్యను మూలంలోనే పరిష్కరించగలవని ఆశిస్తున్నట్లు చైనా వాణిజ్య శాఖ సహాయ మంత్రి లింగ్ జీ వ్యాఖ్యానించారు. నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటూ అంతర్జాతీయ సరఫరా గొలుసు స్థిరత్వం దెబ్బతినకుండా కలిసి కట్టుగా కృషి చేయాల్సి వుందని వ్యాఖ్యానించారు.

ద్వితీయశ్రేణి పౌరుల్లా గిరిజనులు, దళితులు

- మోడీ పాలనపై రాహుల్ విమర్శలు

పాట్నా : మోడీ ప్రభుత్వ పాలనలో దేశంలోని గిరిజనులను, దళితులను ద్వితీయశ్రేణి పౌరులుగా చూస్తున్నారని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ విమర్శించారు. పాట్నాలో సోమవారం జరిగిన 'సేవ్ కానిస్టిట్యూషన్ కాన్ఫరెన్స్'లో మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణనను నిర్వహించిందని, దాని ఫలితాల ఆధారంగా రిజర్వేషన్లు పెంచిందని తెలిపారు. బిసిలు, దళితులకు కాంగ్రెస్ ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఇందుకు బీహార్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుల నియామకాలను రాహుల్ ఉదహరించారు.

సోమవారం ముందుగా బీహార్‌లోని బెగుసరాయ్ పట్టణంలో జరిగిన పాదయాత్రలో పాల్గొన్నారు. రాహుల్ వెంట ఎన్ఎస్‌యుఐ జాతీయ ఇన్‌ఛార్జ్ కన్హయ్య కుమార్, బీహార్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేశ్‌కుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

హారీ బ్రూక్‌కు ఇంగ్లండ్ పగ్గాలు

- టి20, వన్డే సారథ్య బాధ్యతలు అప్పగించిన ఇసిబి

లండన్: ఇంగ్లండ్ పురుషుల క్రికెట్ వైట్‌బాల్ కెప్టెన్‌గా యువ బ్యాటర్ హారీ బ్రూక్ ఎంపికయ్యాడు. ఈ మేరకు ఇంగ్లండ్ అండ్ వేల్ క్రికెట్‌బోర్డు(ఇసిబి) సోమవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఇంతకుముందు వన్డేలకు బట్లర్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసినా.. అతడు బ్యాటింగ్‌పై దృష్టిసారించాలని సారథ్య బాధ్యతలనుంచి వైదొలిగాడు. 'ఇంగ్లండ్ వైట్‌బాల్ కెప్టెన్‌గా ఎంపికవ్వడం గౌరవంగా భావిస్తా.. బాల్యంనుంచే ఇంగ్లండ్‌కు సారథ్యం వహించాలని కోరుకున్నా.. నేటితో ఆ కల సాకారమైంది' అని 26ఏళ్ల బ్రూక్ తెలిపాడు. 2022లో అరంగేట్రం చేసిన బ్రూక్ 26 వన్డేల్లో 34.00 సగటుతో 816పరుగులు చేశాడు. 44 టి20ల్లో ఆడాడు. 2022లో ఇంగ్లండ్ జట్టు ఐసిసి టి20 ప్రపంచకప్ నెగ్గిన జట్టులో బ్రూక్ ఒక ఆటగాడు. గతంలో ఇంగ్లండ్ అండర్-19 జట్టు కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. గత నెలలో పాకిస్తాన్ వేదికగా జరిగిన ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లండ్ జట్టు కెప్టెన్‌గా బట్లర్ వ్యవహరించిన సంగతి తెలిసిందే.

చరిత్ర సృష్టించిన కోహ్లి

- టి20ల్లో 13వేల పరుగులు కొట్టిన భారత తొలి బ్యాటర్‌గా రికార్డు

ముంబయి: టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లి అరుదైన ఘనత సాధించాడు. టీ20ల్లో 13,000 పరుగులు మైలు రాయిని అందుకున్న తొలి భారత ప్లేయర్‌గా రికార్డులెక్కాడు. ఐపీఎల్-2025లో వాంఖడే వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో 17 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద విరాట్ ఈ ఫీట్‌ను అందుకున్నాడు. 386 ఇన్నింగ్స్‌లలో కోహ్లి ఈ రేర్ ఫీట్‌ను నమోదు చేశాడు. ఓవరాల్‌గా ఐదో క్రికెటర్‌గా విరాట్ నిలిచాడు. ఈ అరుదైన ఫీట్ సాధించిన జాబితాలో కోహ్లి కంటే ముందు క్రిస్ గేల్ (455 ఇన్నింగ్స్‌ల్లో 14562 పరుగులు), అలెక్స్ హేల్స్ (490 ఇన్నింగ్స్‌ల్లో 13610), షోయబ్ మాలిక్ (514 ఇన్నింగ్స్‌ల్లో 13557), కీరన్ పోలార్డ్ (617 ఇన్నింగ్స్‌ల్లో 13537) ఉన్నారు. అయితే ఇన్నింగ్స్‌ల పరంగా ఈ ఫీట్ సాధించిన రెండో క్రికెటర్ మాత్రం కోహ్లినే కావడం గమనార్హం. కాగా ఐపీఎల్-2025లో విరాట్ తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఈ మ్యాచ్‌లో కూడా కోహ్లి హాఫ్ సెంచరీ సాధించాడు. 60 పరుగులతో కోహ్లి తన బ్యాటింగ్‌ను కొనసాగిస్తున్నాడు. అంతకుముందు కేకేఆర్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో కూడా విరాట్(59) హాఫ్ సెంచరీతో రాణించాడు.

12 శాతం మందే..

- ఆస్తుల వివరాలు ప్రకటించిన 95 మంది హైకోర్టుల జడ్జిలు
- కేరళ, హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టుల్లో 90 శాతం మందికిపైగా వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో తమ ఆస్తుల వివరాలను ప్రకటించిన వివిధ హైకోర్టుల న్యాయమూర్తుల సంఖ్య స్వల్పంగానే ఉన్నది. 12 శాతం మంది మాత్రమే తమ వివరాలను బహిర్గతం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 25 హైకోర్టులలో 769 మంది జడ్జిలు ఉన్నారు. వీరిలో 95 మంది మాత్రమే, అంటే 12.35 శాతం మంది తమ ఆస్తులు, అప్పుల వివరాలను తమ అధికారిక వెబ్‌సైట్‌లలో బహిర్గతం చేయటానికి నిర్ణయించుకున్నారు. ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో కాలిన నోట్ల కట్టలు భారీ మొత్తంలో బయటపడటం భారత న్యాయవ్యవస్థలో పారదర్శకతపై చర్చలు తీవ్రమయ్యాయి. ఈ అంశం భారత ఉన్నత న్యాయవ్యవస్థలోని జడ్జిల ఆస్తుల బహిర్గతం అంశం తెర మీదకు వచ్చింది. దీనికి స్పందనగా సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో తమ ఆస్తుల వివరాలను బహిర్గతం చేయటం కోసం ఈనెల 1న ఫుల్ కోర్ట్ మీటింగ్‌లో సుప్రీంకోర్టులోని 33 మంది న్యాయమూర్తులు అంగీకరించారు.

ప్రస్తుతం ఆరు హైకోర్టులకు చెందిన జడ్జిలు తమ ఆస్తుల వివరాలు ప్రకటించారు. ఇందులో అత్యధికంగా కేరళ హైకోర్టు నుంచి ఉన్నారు. ఈ హైకోర్టుకు చెందిన 44 జడ్జిలలో 41 మంది (93.18 శాతం) తమ ఆస్తుల వివరాలను వెల్లడించారు. ఆ తర్వాత స్థానంలో హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ఉన్నది. ఇక్కడ 12 మందిలో 11 మంది జడ్జిలు (91.66 శాతం) ఆస్తుల వివరాలను ప్రకటించారు.

ఇందుకు విరుద్ధంగా కొన్ని హైకోర్టులలో ఆస్తులను వెల్లడించిన రేటు గణనీయంగా తక్కువగా ఉన్నది. ఛత్తీస్‌గఢ్ హైకోర్టులోని 16 మంది జడ్జిలలో ఒక్కరు మాత్రమే ఆస్తుల వివరాలను వెల్లడించారు. మద్రాసు హైకోర్టులో 65 మందికి గానూ ఐదుగురే వివరాలు బహిర్గతపర్చారు. ఇక ఢిల్లీ హైకోర్టుకు చెందిన 38 మంది జడ్జిలలో ఏడుగురు మాత్రమే సమాచారాన్ని వెల్లడించారు. 2018తో పోలిస్తే ఇది చాలా తక్కువ. అప్పుడు 35 మంది జడ్జిలకు గానూ 29 మంది తమ ఆస్తుల వివరాలను ప్రకటించారు.

ఇక ప్రస్తుతం సుప్రీంకోర్టులోని 33 మంది సర్వింగ్ జడ్జిలలో ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సంజీవ్ ఖన్నాతో కలుపుకొని 30 మంది తమ ఆస్తుల డిక్లరేషన్‌ను అందించినట్టు అధికారిక వెబ్‌సైట్ చూపెడుతున్నది. సాంకేతిక సమస్యలు క్లియర్ అయ్యాక వారి డిక్లరేషన్లు కనబడనున్నాయి.

హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా పార్థసారధి

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా వైవిఎస్‌బిజి పార్థసారధి నియమితులయ్యారు. ఇప్పటి వరకు పార్థసారధి గుంటూరు జిల్లా ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జిగా ఉన్నారు. ఇంతకు ముందు రిజిస్ట్రార్ జనరల్‌గా చేసిన యడవల్లి లక్ష్మణరావు హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా అవ్వడంతో ఆ పోస్టు ఖాళీ అయ్యింది. ఇప్పుడు పూర్తి స్థాయి రిజిస్ట్రార్ జనరల్‌గా పార్థసారధిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governorpet, Vijayawada-520002 (A.P.)

E Procurement Short Tender Notice

NIT No. 114/MAU61-ADMN0IS(INAN)/3/2025-IS /2nd call, dated: 05-04-2025

Name of Work : APCRDA-" Renewal and Upgrade of Sophos XG 430 Firewalls (02 no's) to Sophos XGS 4300 Firewalls (02 no's) present in APCRDA Head Office, Vijayawada with 3 Years Full Guard Enhanced Support Subscription", **ECV: Rs. 19,95,170/-**

The bid can be downloaded on AP e-procurement portal from **08.04.2025** to **15.04.2025** up to **14.00 Hrs.** Due date for submission of Bid is **15.04.2025** up to **15.00 Hrs,** Technical bid opening **15.04.2025 @16.00 Hrs.** For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.

E Procurement Short Tender Notice

NIT No. 05/MAU61-ADMN0IS(MISC)/3/2025-IS, dated: 05-04-2025.

Name of Work : APCRDA-" Supply & Installation of MOTOROLA TLK 100I 4G LTE push-to-talk over cellular radios (SIM BASE WALKIE-TALKIES) (70 no's) with GPS tracking to APCRDA"-
Estimate Contract Value: Rs.20,72,000/-.

The bid can be downloaded on AP e-procurement portal from **08.04.2025** to **11.04.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **11.04.2025** up to **15.00 Hrs,** Technical bid opening **11.04.2025 @16.00 Hrs.** For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.

Sd/- Addl. Commissioner, APCRDA, Vijayawada

టిడిపి మహానాడు నిర్వహణకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-కడప అర్బన్

ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి నేతలు

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మే 27, 28, 29 తేదీల్లో నిర్వహించే మహానాడు నిర్వహణకు అవసరమైన స్థలాన్ని పరిశీలించేందుకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, మంత్రులతో కూడిన మహానాడు కమిటీ వైఎస్ఆర్ జిల్లా కడపలో సోమవారం పర్యటించింది. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, వైఎస్ఆర్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సవితమ్మ, మంత్రి అనగాని సత్యప్రసాద్, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న స్థలాలను పరిశీలించారు. కడప నగరం శివారు ప్రాంతంలో ఉన్న ఎన్‌జిఒ లేఅవుట్స్, జయరాజ్ గార్డన్, విమానాశ్రయం సమీపంలో స్థలాలను పరిశీలన చేశారు.

ఈ సందర్భంగా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ.. ఎన్‌టిఆర్ పుట్టిన రోజు సందర్భంగా మహానాడు నిర్వహించడం 43 సంవత్సరాల నుంచి ఆనవాయితీగా వస్తోందన్నారు. గతంలో ఎన్నడూలేని జరగని విధంగా కడపలో మహానాడును ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తాము మూడు ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. మరోమారు కమిటీ స్థల పరిశీలనకు వస్తుందని, అప్పుడు తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

IREL (ఇండియా) లిమిటెడ్
आईआरईएल (इंडिया) लिमिटेड
(గతంలో ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్)
రేర్ ఎర్త్స్ డివిజన్, కొచ్చి, కేరళ,
ఇ-మెయిల్: purchase-red@irel.co.in
CIN: U15100MH1950601008187
An ISO 9001:2015, ISO 14001:2015 & ISO 45001:2018 కంపెనీ

టెండర్ ప్రకటన

IREL (ఇండియా) లిమిటెడ్, రేర్ ఎర్త్స్ డివిజన్ కింది ఐటం/ఉద్యోగ వివరణ కోసం టెండర్‌ను ఆహ్వానిస్తోంది:

ఐటం /ఉద్యోగ వివరణ	జెఇఎం పోర్టల్‌లో టెండర్ లభ్యత
హెచ్‌పిఆర్‌ఇ మరియు వాటర్ ట్యాంకుల కోసం ట్యాంక్ లెవల్ మానిటరింగ్ సిస్టమ్	07.04.2025 14.00 గంటలు
ఎంఎస్‌ఎఫ్‌ఆర్‌పి మరియు ఎంఎస్ ట్యాంకుల రిప్లేస్‌మెంట్	10.04.2025 14.00 గంటలు

వివరాల కోసం కింది వెబ్‌సైట్‌లను సందర్శించండి: gem.gov.in, www.irel.coin/tender-information https://eprocure.gov.in/cppp పైన పేర్కొన్న టెండర్లకు సంబంధించిన ఏవైనా సవరణలు / పొడిగింపులు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లలో మాత్రమే హోస్ట్ చేయబడతాయి.

తేదీ: 01.04.2025

సం/-
జిఎం & హెడ్, ఆర్ఇడి

CBC 48145/12/0001/2526

बैंक ऑफ महाराष्ट्र
Bank of Maharashtra
ONE FAMILY ONE BANK

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
జోనల్ ఆఫీసు, విజయవాడ, 1వ అంతస్తు, ఇన్ఫినిటీ ప్లాజా, డోర్ నం.: 59ఎ-21-7/3, హై స్కూల్ రోడ్, పటమట, విజయవాడ, ఆం.ప్ర.-520007. టెలి: 0866-2431225.

డిమాండ్ నోటీసు

(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్, 2002 యొక్క రూల్ 3(1)తో చదువబడే ది సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (సార్ఫసీ యాక్ట్) యొక్క సెక్షన్ 13(2) క్రింద)

దిగువ రుణగ్రహీత యొక్క ఖాతాలు **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, రాజమండ్రి శాఖ**తో ఎన్‌పిఏగా వర్గీకరించబడినవి, దిగువ పేర్కొన్న తేదీలలో షార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసును బ్యాంకు జారీచేసింది.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖతోగల దిగువ రుణగ్రహీత ఖాతాలు, ఎన్‌పిఏగా వర్గీకరించబడినది. దిగువ పేర్కొన్న తేదీలలో సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద బ్యాంకు నోటీసు జారీచేసింది. సంబంధితులందరికీ ఈ బహిరంగ ప్రకటన ఒక సమాచార ప్రచురణగా భావించగలరు. దిగువ పేర్కొన్న రుణగ్రహీత/ హామీదారులును సంబంధిత వ్యక్తుల ద్వారా నిర్వహించిన పత్రాలు/ రుణం/ ఇతర ఒప్పందాలు క్రింద చెల్లించు తేదీ వరకు, కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు సదరు తేదీన దిగువ పేర్కొన్న బకాయి మొత్తాలను డిమాండ్ నోటీసు తేదీ నుండి 60 రోజుల్లోగా **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ**కు చెల్లించవలసిందిగా కోరబడినది. రుణగ్రహీతల బాధ్యులు కొరకు హామీగా దిగువ చెప్పిన ఒప్పందాలు మరియు పత్రాలు, వారి పేర్లకు ఎదురుగా చూపిన సదరు ఆస్తులు **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ** కు చార్జ్‌చేయబడినవి.

క్ర. సం.	బ్రాంచి పేరు/ రుణగ్రహీత/హామీదారు పేరు & చిరునామా	02.04.2025 నాటికి బకాయి మొత్తాలు
1.	**1. బ్రాంచి : గుంటూరు శాఖ., రుణగ్రహీత& హామీదారు పేరు& చిరునామా: 1. మెసర్స్ వెంకట ప్రసున ట్రేడర్స్, ప్రతినిధియైన దీని పార్టనర్స్** డోర్ నం.2-31-69, నందులపేట, కవిరాజు వీధి, గాంధీనగర్, తెనాలి-522201, గుంటూరు, ఆం.ప్ర **(రుణగ్రహీత).** **2. శ్రీ పెరాల వెంకట రావు (మేనేజింగ్ పార్టనర్)** ఫ్లాట్ నం.202, 2వ బ్లాక్, శ్రీ హరి నివాసం అపార్టుమెంట్, అమరావతి రోడ్, రామచంద్ర ఫర్నీచర్స్ వెనుక వైపు, నాగరోలు, గోరంట్ల, గుంటూరు-522034, **(హామీదారు).** **3. శ్రీమతి పలుకూరు ఎన్‌విఎఎల్ ప్రసున (పార్టనర్),** డోర్ నం.2-31-68, 69, కవిరాజు వీధి, కొత్త ఎస్‌బిఐ బ్రాంచి ఎదురుగా, నందులపేట, తెనాలి, గుంటూరు, ఆం.ప్ర-522 201. **(హామీదారు/ తాకట్టుదారు).**	**రూ.8,23,80,839/-** (రూపాయలు ఎనిమిది కోట్ల ఇరువై మూడు లక్షల ఎనభై వేల ఎనిమిది వందల ముప్పై తొమ్మిది మాత్రమే) ప్లస్ 03.11.2024 నుండి వర్తించబడు రేటున వర్తించు లెక్కించని వడ్డీ/తదుపరి వడ్డీ ప్లస్ వ్యయాలు& ఇతర చార్జీలు మొ॥నవి.

రుణం విధానం: క్యాష్ క్రెడిట్ రూ.8,00,00,000/- (రూపాయలు ఎనిమిది కోట్లు మాత్రమే) A/c no.60434999704	డిమాండ్ నోటీసు: 02.04.2025	ఎన్‌పిఏ తేదీ: 01.04.2025.

ప్రైమరీ సెక్యూరిటీ: స్టాక్ & బుక్ డెట్స్ యొక్క హైపోతికేషన్.
కొల్లెటరల్ సెక్యూరిటీ: నివాస ఖాళీ ల్యాండ్ యొక్క ఈక్విటేబుల్ తాకట్టు. (సెర్సాయి ఐడి: 20006826629).
ఆస్తి యొక్క షెడ్యూలు: రిజిస్ట్రేషన్ జిల్లా గుంటూరు, సబ్-డిస్ట్రిక్ట్ గుంటూరులోని తెనాలి గ్రామం వద్ద 2266.24చ.మీ.లు విస్తీర్ణంతో మరియు సిటిఎస్/ టౌన్ సర్వే నం.472లోగల ల్యాండ్ యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం వైపు: అబ్దుల్ రహమాన్‌కు చెందిన ఆస్తి మరియు టి.ఎన్.సి క్లబ్ ఆస్తి-222', తూర్పు వైపు: నూకలవేణు గోపాల రావుకు చెందిన ఆస్తి మరియు ఇతరుల ఆస్తి-117', పడమర వైపు: కవిరాజు వీధి మున్సిపల్ బజారు-119'01", దక్షిణం వైపు: భరతిపుడి రామయ్యకు చెందిన ఆస్తి మరియు అన్నపూర్ణమ్మ సత్రామ్ ఆస్తి-197'-10", 2266.24చ.మీ.లు లేదా 2710.4చ.గ.ల విస్తీర్ణపు నివాసిత/ కమర్షియల్ ల్యాండ్, అనుబంధ జామితా ప్రకారం దానికి బిగించిన అనుబంధం మొత్తం.

సంబంధిత రుణగ్రహీతలు/హామీదారులు పై చెప్పినట్లుగా **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ**కు చెల్లింపులుచేయుటలో విఫలం చెందినట్లైతే, **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ** వారు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద మరియు వర్తించదు రూల్స్ పై సెక్యూర్డ్ అసెట్స్ పై చర్యలుతీసుకొనుట ప్రారంభించింది, సంబంధిత రు ణగ్రహీతలు/ హామీదారులు పూర్తి బాధ్యత పైననే సార్ఫసీ యాక్ట్ యొక్క నియమాలలో, సంబంధిత రుణగ్రహీతలు/ హామీదారులు **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ** వారి ముందస్తు వ్రాతపూర్వక అనుమతిలేకుండా అమ్మకం, లీజు లేదా ఇతర రూపాలలో బదిలీచేయలేరు. ఏవేని ఉలంఘనలు జరిగిన షార్ఫసీ యాక్ట్‌తో అనుసరించి, సంబంధిత వ్యక్తులకు శిక్ష లేదా జరిమానా మరియు రెండూను విధించబడు ఆస్కారం ఉంటుంది. సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించు కొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలకు రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది. బట్వాడా కాకుండా వెనుదిరిగిన నోటీసులను క్రింది సంతకందారు నుండి సేకరించవచ్చును. ఈ నోటీసు ప్రచురించబడుచున్నది.

తేదీ: 07.04.2025,
ప్రదేశం: గుంటూరు

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు.

కునాల్ కమ్రా బెయిల్ పొడిగింపు

చెన్నై : మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రాపై పెట్టిన కేసులో మధ్యంతర ముందస్తు బెయిల్‌ను ఈ నెల 17 వరకూ మద్రాస్ హైకోర్టు పొడిగించింది. జస్టిస్ సుందర్ మోహన్ సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. గత నెల మార్చి 28న మంజూరు చేసిన బెయిల్‌ను పొడిగిస్తూ మహారాష్ట్రలోని ఖర్ పోలీస్ స్టేషన్‌కు ప్రైవేటు నోటీస్ జారీ చేసినట్లు కునాల్ కమ్రా తరపు న్యాయవాది వి సురేష్ మీడియాకు తెలిపారు. తదుపరి విచారణను ఈ నెల 17కు లిస్ట్ చేయాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు. సోమవారం విచారణలో కమ్రా న్యాయవాది వాదనలు వినిపిస్తూ ప్రస్తుత కేసులో బెయిల్ వచ్చిన తరువాత ఖర్ పోలీసులు కమ్రాపై మరో మూడు కేసులు నమోదు చేశారని, ముంబయిలో నివసిస్తున్న ఆయన వృద్ధ తల్లిదండ్రులను వేధిస్తున్నారని ఆరోపించారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 23న కునాల్ కమ్రా యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలో చేసిన వ్యాఖ్యల వల్ల షిండేకు పరువునష్టం కలిగిందని ఆరోపిస్తూ ఖర్ పోలీస్‌స్టేషన్‌లో స్థానిక శివసేన ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన ఖర్ పోలీసులు మార్చి 23న విచారణకు హాజరుకావాలని కమ్రాకు సమన్లు జారీ చేశారు.

దీంతో మద్రాస్ హైకోర్టును కమ్రా ఆశ్రయించారు. కమ్రా ముంబయిలో జన్మించినప్పటికీ, ప్రశాంత జీవితం గడపాలనే కోరికతో 2021 నుంచి తమిళనాడు విల్లుపురం జిల్లాలో ఒక గ్రామంలో నివసిస్తున్నారు.

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL CIVIL JUDGE, BENGALURU RURAL, AT BENGALURU

O.S. No. 172/2021

BETWEEN : Sri. Ravi Kumar Attota, Aged about 47 years, S/o. Sri. Mastan Rao Attota, R/o. Apt #415, Vithala Apartment, #46 Kalena Agrahara, Behind Lake, Bannerghatta Road, Bengaluru - 560 076. **...Plaintiff**

AND: Smt. Padmaja Attota, Aged about 42 years, W/of Sri. Ravi Kumar Attota, D/o. Sri Chittinei Venkanna Chowdary, **Residing in portion of house In premises -** Apt#503, Sai Srinivasam Apartment, Maruthi Nagar, 2nd Line, Pattabhipuram Post, Guntur - 522 006, Andhra Pradesh. **...Defendant**

NOTICE TO DEFENDANT
U/o V RULE 20 OF CPC BY WAY OF PP

Smt. Padmaja Attota, Aged about 42 years, W/of Sri. Ravi Kumar Attota, D/o. Sri Chittinei Venkanna Chowdary, **Residing in portion of house In premises -** Apt#503, Sai Srinivasam Apartment, Maruthi Nagar, 2nd Line, Pattabhipuram Post, Guntur - 522 006, Andhra Pradesh.

Whereas the above named Plaintiff has instituted O.S. No. 172/2021 against the Defendant for Injunction and you are hereby warned to appear in this Court in person or by a Pleader duly instructed **on 03.05.2025 at 11-00 AM** in the forenoon, to show cause against the suit, failing wherein, the said suit will be heard and determined ex-parte.

SCHEDULE PROPERTY

All that piece and parcel of residential premise of Apt #415, Vithala Apartment # 46 Kalena Agrahara, Behind Lake, Bannergharra Road, Bengaluru-560076 and measuring Approximately 1104 square feet, in the Uttata Block of residential apartment name Vithala the entire property measuring in all 95920 square feet and delineated by the letters ABCDEFGHIMKLNOPQRA in the attached sketch and bounded on the:

East by : Kere Angala, **West by :** Private Property & Road, **North by :** Private Property, **South by :** Private Properties & Road.

Given under my hand and seal of the court on this 04.04.2025.

By Order of the Court, Sheristedar, Prl. Civil Judge Court, Bangalore (R) Dist., Bangalore.

Sagar .G. Nahar, Advocate
'Vishwa Sagar', No. 60, 1st Floor,
Old Kanakapura Road, Basavanagudi,
Bengaluru-560 004.

భారత ప్రభుత్వము
రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ

Roc.No.2504/2016/EGK **బహిరంగ ప్రకటన** Dated: 29.03.2025

జాతీయ రహదారుల చట్టం, 1956 లోని సెక్షన్ 3జి(3) క్రింద

జాతీయ రహదారుల చట్టం 1956లోని సెక్షన్ 3జి(3) క్రింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తూర్పుగోదావరి (పూర్వం పశ్చిమ గోదావరి జిల్లా) జిల్లాలో కి.మీ.15.320 - కి.మీ. 85.204 వరకు జాతీయ రహదారి నెం.16 గుండుగొలను – కొవ్వూరు సెక్షన్ వరకు రోడ్ నిర్మాణం నిర్వాహణ మరియు ఆపరేషన్ కోసం భారత విశేష రాజపత్రం సంచిక నెం. 1394 (ఇ) పార్ట్ II, సెక్షన్-3, ఉప సెక్షన్ – (ii), తేదీ: 26.03.2025 ప్రచురించబడిన, గెజిట్ నెం. 1376 తేదీ.26.03.2025 భారత ప్రభుత్వం, రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకటన ప్రకారం జాతీయ రహదారుల చట్టం 1956 (48/1956) లోని సెక్షన్ 3డి (2) క్రింది తాకట్టు రుణభారాలు ఏవీ లేకుండా దిగువ షెడ్యూలులో తెలిపిన భూములు, కట్టడాలు మరియు చెట్లు మొదలగు వాటితో కేంద్ర ప్రభుత్వానికి సంక్రమించాయి. సదరు భూములలో ప్రయోజనం గల వ్యక్తులందరూ తమ భూములకు చెందిన డాక్యుమెంట్లు మరియు డాక్యుమెంట్ల జిరాక్స్ కాపీలు / పట్టాదారు పాస్ పుస్తకాలు / టైటిల్ డీడ్స్ లేదాభూములకు సంబంధించిన ఏవేని ఇతర డాక్యుమెంట్లతో మరియు వారికి ఏవేని కట్టడాలు ఉంటే ఆమోదిత ప్లాన్లు, పన్ను అసెస్‌మెంట్స్ , పన్ను రసీదులతో సమర్థ ప్రాధికారి (ఎన్.హెచ్.భూసేకరణ) మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి వారి సమక్షంలో దిగువ తెలిపిన తేదీలలో స్వయంగా లేదా ఏజెంట్ ద్వారా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా హాజరు కావలసిందిగా కోరబడుతున్నారు.

జిల్లా పేరు	మండలం పేరు	గ్రామం పేరు	విచారణ కార్యాలయ చిరునామా	తేది మరియు సమయం
తూర్పుగోదావరి	కొవ్వూరు	కొవ్వూరు	రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం, కొవ్వూరు.	తేది : 10.04.2025, సమయం : ఉ. 11.00 గం. నుండి మ. 01.00 వరకు & మ. 02.00 నుండి సా. 05.00 వరకు

షెడ్యూలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తూర్పుగోదావరి (పూర్వం పశ్చిమ గోదావరి జిల్లా) జిల్లాలో కి.మీ.15.320 - కి.మీ. 85.204 వరకు జాతీయ రహదారి నెం.16 గుండుగొలను – కొవ్వూరు సెక్షన్ వరకు రోడ్ నిర్మాణం నిర్వాహణ మరియు ఆపరేషన్ కోసం, సదరు భూమిలలో వారి సంబంధిత ప్రయోజనం మరియు హక్కుల స్వభావాన్ని తెలియజేయవలసిందిగా కోరబడుతున్నారు. వివరాలకు క్యూఆర్ కోడ్ ను స్కాన్ చెయ్యగలరు

ఇంగ్లీష్ తెలుగు

జిల్లా: తూర్పు గోదావరి
https://egazette.gov.in/
Publication date: 29.03.2025

సం./-
సమగ్ర ప్రాధికారి (భూసేకరణ) &
రెవిన్యూ డివిజనల్ అధికారి, కొవ్వూరు



మృతి చెందిన సీతమ్మ

వడదెబ్బకు ఉపాధి కార్మికురాలు మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్యం జిల్లా)

ఉపాధి హామీ పనులకు వెళ్లిన వేతనదారు వడదెబ్బకు గురై మృతి చెందిన సంఘటన పార్వతీపురం మన్యం జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జియ్యమ్మవలస మండలం డంగబద్ర గ్రామ పంచాయతీ, డంగభద్రవలసకు చెందిన పల్ల సీతమ్మ (55) మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఆ గ్రామ సమీపానగల సీతమ్మ చెరువులో ఉపాధి హామీ పనికి వెళ్లారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఆమె పని నుంచి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో సోమ్మసిల్లిపోయి పడిపోయారు. స్థానికులు వచ్చి చూడగా ఆమె అప్పటికే మృతి చెందారు. పని ప్రదేశం వద్ద ఎటువంటి సౌకర్యాలూ అధికారులు కల్పించకపోవడమే ఈ ఘటనకు కారణమని తోటి వేతనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాకాని బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

- తీర్పు రేపటికి వాయిదా

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి, వైసిపి నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా మైనింగ్‌కు పాల్పడ్డారంటూ నెల్లూరులో కాకానిపై కేసు నమోదైన విషయం విదితమే. కేవలం రాజకీయ కక్షతోనే కేసు నమోదు చేసినట్లు కాకాని తరుపు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని పలువురిని బెదిరించారని పోలీసుల తరుపు న్యాయవాది వాదించారు. ఇరువైపు వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును బుధవారం వెల్లడిస్తామని తెలిపింది. బెయిల్ మంజూరు కాకపోవడంతో కాకాణి అందుబాటులో లేకుండాపోయారు.

విరాళాలను స్వీకరిస్తున్న టిటిడి అదనపు ఈవో

టిటిడికి రూ.కోటి విరాళం

ప్రజాశక్తి - తిరుమల

టిటిడి నిర్వహిస్తున్న వివిధ పథకాలకు సోమవారం రూ.కోటి విరాళం అందింది. ఒడిశాకు చెందిన శివమ్ కాండేవ్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ ఎస్‌వి ప్రాణదాన ట్రస్టుకు రూ.20 లక్షలు, ఎస్‌వి గోసంరక్షణ ట్రస్టుకు రూ.20 లక్షలు, స్విమ్స్ ట్రస్టుకు రూ.20 లక్షలు, ఎస్‌వి సర్వ శ్రేయాస్ ట్రస్టుకు రూ.పది లక్షలు, ఎస్‌వి అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.పది లక్షలు విరాళంగా అందించింది. అదే రాష్ట్రానికి చెందిన బాలభద్ర డెవలపర్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ ఎస్‌వి గోసంరక్షణ ట్రస్టుకు రూ.పది లక్షలు, ఎస్‌వి అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.పది లక్షలు విరాళంగా ఇచ్చింది. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగ నాయకులు మండపంలో టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ఆ కంపెనీల ప్రతినిధి వై రాఘవేంద్ర విశ్వకర్మ విరాళం డిడిలను అందజేశారు.

మద్యం షాపు తొలగించాలని మహిళల ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

మద్యం దుకాణం తొలగించాలని డిమాండ్ చేస్తూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన మహిళలు సోమవారం ధర్నా చేశారు. అంబాజీపేట మండలం మాచవరం వెంకటేశ్వరకాలనీ, కుసుమేవారిపేట, చినకుసుమేవారిపేట, అంబేద్కర్ నగర్‌కు దగ్గరలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని డిమాండ్ చేశారు. ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆవాసాల చెంత మద్యం షాపులను ఏర్పాటు చేయడం దారుణమన్నారు. మందుబాబుల వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్కూలుకు వెళ్లే ఆడపిల్లలు, వివిధ కూలి పనులకు వెళ్లే మహిళలకు రక్షణ కరువైందన్నారు. తక్షణమే మద్యం షాపు తొలగించనిపక్షంలో షాపు వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పంచాయతీ అనుమతులు తీసుకోకుండా స్కూలు, అంబేద్కర్ విగ్రహానికి దగ్గరలో ఉన్న గ్రామాల్లో మద్యం షాపు ఏర్పాటు చేయడం తగదన్నారు. గ్రామానికి 150 మీటర్ల దూరంలో మద్యం షాపు ఉంటే అభ్యంతరం ఏమిటని విచారణకు వచ్చిన ఎక్సైజ్ డిఎస్‌పి ప్రశ్నించడం శోచనీయమన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్‌కు మహిళలు వినతిపత్రం అందించారు. దీనిపై విచారణ చేపట్టాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

ఉరవకొండ వద్ద హంద్రీనీవా పనులను పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

జూన్ 10 నాటికి హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు పూర్తి

- ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు జూన్ 10 నాటికి పూర్తి చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. అనంతపురం జిల్లా ఉరవకొండ వద్ద హంద్రీనీవా కాలువ నుంచి రాగులపాడు రోడ్డు వరకు 35వ ప్యాకేజీ కింద జరుగుతున్న హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పు పనులను అధికారులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. పనుల పరిస్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం హంద్రీనీవాను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాలువ వెడల్పునకు రూ.3,800 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 20 సంవత్సరాలలో జరిగిన పనిని 70 రోజుల్లో పూర్తి చేసేలా ప్రణాళికతో ముందుకెళున్నట్లు చెప్పారు. భైరవాణి తిప్ప, అప్పర్ పేరూరు తదితర ప్రాజెక్టులకు నీటిని ఇవ్వాలన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాలువ వెడల్పు పనులు యుద్ధ ప్రాతిపదికన చేయిస్తున్నారని తెలిపారు. అనుకున్న లక్ష్యంలోపు పనులను పూర్తి చేసేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ సిఈ నాగరాజు, ఎస్ఈ రాజ స్వరూప్ కుమార్‌తో పాటు ఇఇలు, జెఇలు, అధికారులు పాల్గొన్నారు.

ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు చర్యలు

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆక్వా రంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని మత్స్యశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. అమెరికా దిగుమతి సుంకాలు పెంచిన నేపథ్యంలో రైతులు, ఆక్వా రంగ నిపుణులు, వ్యాపారవేత్తలు, మత్స్యశాఖ అధికారులతో విజయవాడలోని ఒక హోటల్‌లో సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. కేవలం విదేశీ ఎగుమతులపైనే ఆధారపడకుండా, స్వదేశీ వినియోగం పెంచేలా నెక్ తరహాలో ఆక్వా రంగంలోనూ రొయ్యల ఉత్పత్తిదారులతో కమిటీని వేసేందుకు ఆలోచన చేస్తున్నామని చెప్పారు. అమెరికా సుంకాల కారణంగా తీవ్ర భయాందోళనలు చెందుతున్న ఆక్వా రైతులు, ఎగుమతిదారులు ప్రస్తుత పరిణామాలకు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఇతర మార్గాల్లో ఆక్వా రంగం కోలుకునే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర తలసరి ఆదాయంలో మత్స్య రంగం కీలక భూమిక పోషిస్తోందని, దేశం నుంచి అమెరికా వెళ్లే సుముద్ర ఆహార ఎగుమతులపై 27 శాతం దిగుమతి సుంకం విధించడం దారుణమన్నారు. ఆక్వా రైతులు ఎలాంటి ప్రయోజనం పొందాలన్నా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉందన్నారు. మేత ధరలు తగ్గింపు విషయంలో తయారీదారులతో చర్చిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ రొయ్యలను వినియోగించేలా వీటి వల్ల కలిగే మేలును విస్తృతంగా ప్రచారం చేయాలని ఉప సభాపతి ఆర్ రఘురామ కృష్ణరాజు సూచించారు. ఆర్మీ మెనూలో సైతం రొయ్యలను చేర్చే విషయమై కేంద్ర మంత్రిని కలిసి చర్చిస్తామన్నారు. ఈ సందర్భంగా అమెరికా తీరుతో ఆక్వా రంగం కుదేలైందని, ఈ నాలుగు రోజుల్లోనే రూ.వంద కోట్ల వరకూ నష్టపోయామని పలువురు రైతులు, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్, ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, వేగేశ్న నరేంద్ర వర్మ, మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ ఆక్వా ఎగుమతి, ఉత్పత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ముస్లిములు

వక్ఫ్ చట్టసవరణ బిల్లు రద్దు చేయాలి

- ముస్లిముల ర్యాలీ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ (కృష్ణాజిల్లా)

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టసవరణ బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కృష్ణా జిల్లా మచిలీపట్నం అర్బన్ పరిధిలోని రాజుపేట షాది ఖానా నుండి కోనేరు సెంటర్ వరకు ముస్లిం సమైక్య వేదిక ఆధ్వర్యంలో ముస్లిముల సోమవారం ర్యాలీ నిర్వహించారు. సిపిఎం, సిపిఐ తదితర వామపక్షాలు వారికి మద్దతుగా నిలిచాయి. ఈ సందర్భంగా ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు ఆంధ్రప్రదేశ్ నుంచి చంద్రబాబు, బీహార్ నుంచి నితీష్‌కుమార్ మద్దతు ప్రకటించారని, వారు తక్షణమే కేంద్రంతో మాట్లాడి బిల్లు ఉపసంహరించుకునేలా చేయకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ముస్లిం సమైక్యవేదిక నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కులమతాల మధ్య చిచ్చు పెట్టి వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించి ముస్లిం సమాజ ఆత్మాభిమానానికి తూట్లు పొడిచిందన్నారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ముస్లింల ఓట్లతో గద్దెనెక్కి సవరణ బిల్లుకు మద్దతు తెలపడం క్షమించరాని నేరమని, వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని అన్నారు. ఈ సవరణ రద్దు చేయకుంటే పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం పరిధిలోని అన్ని మసీదుల కమిటీలు, ముస్లిం సమైక్యవేదిక సభ్యులు అంజద్ బాషా, కడప ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

అహ్మద్ బాషాకు 14 రోజుల రిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్/కడప

వైసిపి నాయకుడు, మాజీ డిప్యూటీ సిఎం ఎస్‌బి అంజాద్ బాష తమ్ముడు ఎస్‌బి అహమ్మద్ బాషకు కడప కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. కడప తాలూకా పోలీసులు సోమవారం కడప సెకండ్ ఎడిఎం కోర్టులో ఆయనను హాజరు పరిచారు. అహ్మద్‌బాషా వివిధ కేసుల్లో నిందితుడిగా ఉండగా ఆదివారం తెల్లవారు జామున కువైట్‌కు వెళ్లేందుకు ముంబయి ఎయిర్‌పోర్టులో ఉన్న సమయంలో కడప పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. పోలీసులు ముంబయి నుంచి సోమవారం తెల్లవారు జామున కడపకు తీసుకువచ్చారు. కడప నగర శివారుల్లోని పోలీసు డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎనిమిది గంటల పాటు విచారించారు. అనంతరం కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఇన్‌స్పెక్టర్ తారాంరెడ్డి, తాలూకా ఎస్ఐ నాగ తులసి ప్రసాద్ సమక్షంలో ఆయనకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అహమ్మద్ బాషను సోదరుడు అంజాద్ బాష రిమ్స్‌లో పరామర్శించారు. అనంతరం పోలీసులు కడప రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పరచగా సిఆర్‌పిసి 326 కింద న్యాయమూర్తి ఈ నెల 21 వరకు అహ్మద్ బాషకు రిమాండ్ విధించారు. దీంతో, ఆయనను పోలీసులు కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

వైద్య పరీక్షల కోసం అహమ్మద్‌బాషాను రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళుతున్న పోలీసులు

పార్వతీపురం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి కార్మికులు

'ఉపాధి' బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి- పార్వతీపురం

ఉపాధి హామీ చట్టం కింద పని చేసిన తమకు బకాయిలు చెల్లించాలని, పనులున్న చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద ఉపాధి కార్మికులు ధర్నా నిర్వహించారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నందున మెడికల్ కిట్లు, మంచినీరు, మజ్జిగ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. తొలుత స్థానిక సుందరయ్య భవన్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ జనవరి నుంచి పనిచేసిన ఉపాధి కార్మికులకు బకాయిలు చెల్లించలేదని, జిల్లాలో సుమారు రూ.50 కోట్లు వరకు బకాయిలు ఉన్నాయని తెలిపారు. పని చేసిన 14 రోజులకు కూలి చెల్లించాలని చట్టంలో ఉన్నప్పటికీ ఇంత వరకూ ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఫారం పాండ్ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. వేసవిలో సక్రంగా పనులు ఇవ్వకుండా అనేకమంది కార్మికులకు గతేడాది వంద రోజుల పని పూర్తికాకుండానే పనులు కల్పించడం ఆపేశారని తెలిపారు. ఏప్రిల్ ఒకటి తర్వాత కూడా గ్రామాల్లో సక్రమంగా పనులు కల్పించడంలేదని, వెంటనే జాబ్ కార్డు ఉన్న ప్రతి కార్మికునికి పనులు కోరుకున్నచోట కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో ఉపాధి పని జరిగిన చోట టెంట్లు, మెడికల్ కిట్లు, మంచినీరు, మజ్జిగ ఇచ్చే వారని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. కార్మికులందరికీ పని కల్పించి బకాయిలు చెల్లించకపోతే భవిష్యత్తులో వారందర్నీ కదిలించి పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, నాయకులు, పలువురు వేతనదారులు పాల్గొన్నారు.

7వ మహాసభను జయప్రదం చేయండి

- ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉన్న రజక వృత్తిదారులు, కార్మికులు, ఉద్యోగులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ... ఈ నెల 20, 21 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభను నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర కమిటీ తెలిపింది. తాడేపల్లిలోని చిట్యాల ఐలమ్మ రజక కల్యాణ మండపంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరరావు, కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు తదితరులతో కలిసి మహాసభల కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ.. సంఘం రాష్ట్ర మహాసభల్లో భాగంగా 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కొండపల్లి పోస్టాఫీసు సెంటర్ నుంచి ప్రదర్శన ఉంటుందని, అనంతరం విటిపిఎస్ బి కాలనీ గ్రౌండ్‌లో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ సభలకు శాసన సభ్యులు గల్లా మాధవి, వసంత కృష్ణప్రసాద్, సంఘం నాయకులు భీమవరపు సుబ్బారావు, కొలనుకొండ శివాజీ, దోనేపూడి కాశీనాథ్, కాజా సరోజ తదితరులు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. బహిరంగ సభ అనంతరం 21వ తేదీన ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో ముత్తవరపు స్వర్ణాదేవి-వెంకటేశ్వరరావు ఆడిటోరియంలో ప్రతినిధుల సభ నిర్వహించి సంఘం చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించడం, భవిష్యత్ కార్యక్రమాలకు ప్రణాళికల రూపకల్పన ఉంటుందన్నారు. రజక వృత్తిదారులపై దౌర్జన్యాలు, అక్రమ కేసులు, గ్రామ సాంఘిక బహిష్కరణలు నేటికీ కొనసాగుతున్నాయని, రజక వృత్తి నిర్వహణ గ్రామీణ ప్రాంతాల్లో అంతరించిపోతుందని తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆహ్వాన కమిటీ అధ్యక్షులు చిక్కవరపు వెంకట రెడ్డయ్య మాట్లాడుతూ.. ఈ మహాసభలను జయప్రదం చేయడానికి విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, మంగళగిరి, తాడేపల్లి నగర కార్యదర్శి పాగోలు శ్రీనివాసరావు, కె యానాదిరావు, ఎం నరసింహరావు, కె శ్రీనివాసరావు, మంజూరు బాబూరావు పాల్గొన్నారు.

ఆర్‌బిఐ ఎంపిసి భేటీ ప్రారంభం

న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన సోమవారం ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ(ఎంపిసి) భేటీ ప్రారంభమయ్యింది. ఈ ద్వైమాసిక పరపతి సమీక్షా సమావేశాల నిర్ణయాలను ఏప్రిల్ 9న వెల్లడించనున్నారు. గత పాలసీ సమీక్షలో వడ్డీ రేట్లకు కీలకమైన రెపో రేటును 0.25 శాతం తగ్గించేందుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మూడు రోజుల సమావేశంలో మరో పావు శాతం కోతకు వీలున్నట్లు నిపుణులు అంచనా వేస్తోన్నారు. భారత్‌పై అమెరికా టారిఫ్‌ల ప్రభావం, రూపాయి పతనం, మారకం నిల్వలపైనా విస్తృత చర్చ జరిగే అవకాశం ఉంది.

జొమాటో సిఒఒ రిన్నుల్ చంద్ర రాజీనామా

బెంగళూరు : జొమాటో ఫుడ్ డెలివరీ బిజినెస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సిఒఒ) రిన్నుల్ చంద్ర తన పదవీకి రాజీనామా చేశారు. ఈ నెల 5నే తను వైదొలిగారని జొమాటో వెల్లడించింది. వ్యక్తిగత, వృత్తిపరమైన లక్ష్యాలకు అనుగుణంగా కొత్త అవకాశాలు, అభిరుచిని కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు జొమాటో వ్యవస్థాపకుడు గోయల్‌కు రాసిన లేఖలో రిన్నుల్ తెలిపారు.

కర్నూలు-IV ట్రాన్స్మిషన్ లిమిటెడ్

(పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ యొక్క 100% పూర్తిగా యాజమాన్యంలోని అనుబంధ సంస్థ)

B-9, కుతుబ్ ఇన్స్టిట్యూషనల్ ఏరియా, కట్వారియా సారాయ్, న్యూఢిల్లీ 110016

నోటీసు

(విద్యుత్ చట్టం, 2003 లోని సెక్షన్ 15 లోని సబ్ సెక్షన్ (2) కింద)

1. **కర్నూలు-VI ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ , న్యూఢిల్లీ-110016, కుతాబ్ ఇనిస్టిట్యూషనల్ ఏరియా, కట్వారీయా సారాయ్‌లో** రిజిస్టర్డ్ కార్యాలయాన్ని కలిగి ఉంది , ఇది కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్, న్యూఢిల్లీ ముందు విద్యుత్ చట్టం, 2003లోని సెక్షన్ 15లోని సబ్-సెక్షన్ (1) కింద ట్రాన్స్‌మిషన్ లైన్లు, సబ్-స్టేషన్లు మరియు ఇతర ఆస్తులకు సంబంధించి ట్రాన్స్‌మిషన్ లైసెన్స్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకుంది, వీటి వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి:-

వరుస నం.	లైన్ పేరు / సబ్ స్టేషన్ (గమనిక ప్రకారం స్థానం)	BPC/సామర్థ్యం యొక్క సర్వే నివేదిక ప్రకారం లైన్ పొడవు	సంవత్సరానికి ట్రాన్స్మిషన్ ఛార్జీలు (INR) మిలియన్లు	COD షెడ్యూల్ చేయండి	వ్యాఖ్యలు
1.	ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు సమీపంలో 4X1500 MVA, 765/400 kV మరియు 4X500 MVA, 400/220 kV కర్నూలు-IV పూలింగ్ స్టేషన్ ఏర్పాటుతో పాటు కర్నూలు-IV PS వద్ద 2X330 MVAr (765 kV) బస్ రియాక్టర్లను ఏర్పాటు చేయడం, 400 kV స్థాయిలో 4500 MVA యొక్క రెండు (2) విభాగాలు మరియు దాని అనుబంధ పరికరాలను ఏర్పాటు చేయడం.	8000 ఎంవిఎ 660 MVAR 1140 MVAR (SLR)	6451.06	24 నెలలు (24.03.2027)	
2.	కర్నూలు-IV- బీదర్ 765 kV D/C లైన్, రెండు సర్క్యూట్లలో రెండు చివర్లలో 330 MVAr SLR (కన్వర్టిబుల్) తో.	375.322 కి.మీ 660 MVArలు (SLR) @ Bidar			
3.	కర్నూలు-IV కర్నూలు-III PS 765 kV D/C లైన్, రెండు సర్క్యూట్లలో కర్నూలు-IV చివర 240 MVAr SLR (కన్వర్టిబుల్) తో.	127.089 కి.మీ			
4.	కర్నూలు-IV పిఎస్ లో ± 300 MVAr STATCOMతో పాటు 2X125 MVAr MSR	± 300 MVAr			
5.	సి'పేటా వద్ద 1X1500 MVA, 765/400 kV ICT (3^వ^) పెంపుదల	1500 ఎమ్‌విఎ			
6.	సి'పేట వద్ద విజయవాడ-నెల్లూరు 400 kV D/C లైన్ యొక్క ఎల్ఐఎల్ఓ	లూప్ ఇన్: 17.947 కి.మీ. లూప్ అవుట్: 18.256 కి.మీ.			

గమనిక: (I) 1,3,4,5 & 6 మూలకాల స్థానాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నాయి. 2 మూలకాలు తెలంగాణ, కర్ణాటక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నాయి.
(ii) పూర్తి పరిధి కోసం దయచేసి https://www.powergrid.in/subsidiaries ని సందర్శించండి.

2. కమిషన్ ముందు దాఖలు చేసిన పూర్తి దరఖాస్తు మరియు ఇతర పత్రాలు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వెబ్‌సైట్ https://www.powergrid.in/subsidiariesలో ఎవరైనా అందుబాటులో ఉన్నాయి. దరఖాస్తును C/o ED (TBCB), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సాదామిని, ప్లాట్ నెం.2, సెక్టార్ -29, గుర్గావ్ 122001 లోని కంపెనీ కార్యాలయంలో, కర్నూలు-IV ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్‌లోని ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జ్ శ్రీ AC శంకరయ్య వద్ద లేదా కమిషన్ కార్యాలయంలో కమిషన్ పేర్కొన్న విధానం ప్రకారం తనిఖీ చేయవచ్చు.
3. అభ్యంతరాలు లేదా సూచనలు ఏవైనా ఉంటే, కార్యదర్శి, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్, 7వ అంతస్తు, టవర్ బి, వరల్డ్ ట్రేడ్ సెంటర్, నౌరోజీ నగర్, న్యూఢిల్లీ- 110029 వద్ద దాఖలు చేయాలి. వార్తాపత్రికలో నోటీసు ప్రచురించబడిన 15 రోజులలోపు అభ్యంతరం(లు)/సూచన(ల) కాపీని దరఖాస్తుదారునికి లేదా అతని అధీకృత ఏజెంట్‌కు పంపాలి.

శ్రీ. ఎ.సి. శంకరయ్య
ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్,
కర్నూలు-IV ట్రాన్స్మిషన్ లిమిటెడ్

స్థలం: న్యూఢిల్లీ
తేదీ: 08.04.2025

A Maharatna PSU

PG/CC/ Notice-218 (TBCB)/Advt-281/24-25 Paramin

వేణుగానాలంకారంలో కోదండరాముడు

ప్రజాశక్తి -ఒంటిమిట్ట

వైఎస్ఆర్ కడప జిల్లా ఒంటిమిట్ట కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ఉదయం స్వామివారు వేణుగాన అలంకారంలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. యాత్రికుల బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. యాత్రికులు స్వామివారికి అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించారు. ఊరేగింపు అనంతరం ఆలయంలో స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనంతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. రాత్రి ఏడు గంటల నుండి భజన బృందాల కోలాటాల నడుమ పురవీధుల్లో హంస వాహనసేవ జరిగింది. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు విశేష సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.

11న ఒంటిమిట్ట కోదండరాముడి కల్యాణోత్సవం : దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం పండుగ వాతావరణంలో యాత్రికులందరూ వీక్షించేలా ఏర్పాట్లు చేపట్టాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. కల్యాణ ప్రాంగణం వద్ద యాత్రికుల కోసం చేపడుతున్న ఏర్పాట్లను మంత్రులు ఎం రాంప్రసాద్‌రెడ్డి, ఎస్ సవిత, వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ సి శ్రీధర్, జిల్లా

వేణుగానాలంకారంలో కోదండరాముడు

ఎస్పి అశోక్ కుమార్, టిటిడి జెఇఒ వి వీరబ్రహ్మం, సివిఎస్ఒ హర్షవర్ధన్‌రాజు, జెసి అదితి సింగ్ తదితర ఉన్నతాధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి ఆనం మాట్లాడుతూ ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఆలయాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. సీతారాములకు ముత్యాల తలంబ్రాలు సమర్పించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వస్తున్నారని తెలిపారు. సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాలు పెంచాలని, వేసవి నేపథ్యంలో ఫైర్ సర్వీస్ మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత మాట్లాడుతూ అందరూ కలిసి కట్టుగా సమిష్టిగా పనిచేసి శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కల్యాణ వేదిక వద్ద బారికేడ్లు, అన్న ప్రసాదము కౌంటర్లు, లైటింగ్, వైద్యశిబిరాలు, మరుగుదొడ్లు, అదనపు పారిశుధ్య సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు.

పయనీర్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - అచ్యుతాపురం (అనకాపల్లి)

కంపెనీ ఎదుట ఆందోళనకు దిగిన కార్మికులు

బ్రాండిక్స్ సెజ్‌లోని పయనీర్ పరిశ్రమ కార్మికులు సోమవారం నుంచి సమ్మె బాట పట్టారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని నినదిస్తూ ఎ, బి షిఫ్ట్ కార్మికులు ఆందోళనకు దిగారు. ఇంక్రిమెంట్స్ వేయడం లేదని, బోనస్ చెల్లించడంలేదని, మేనేజ్‌మెంట్ తీరు సరిగాలేదని తెలిపారు. నైట్ షిఫ్ట్‌కు అదనంగా రూ.100 చెల్లించాలని డిమాండ్ చేశారు. టెక్నీషియన్ల తీరు బాగోలేదని, సమస్యలపై మేనేజ్‌మెంట్‌ను అడిగితే రిజైన్ చేసి వెళ్లిపోవాలనడం అన్యాయమని కార్మికులు తెలిపారు. న్యాయం జరిగే వరకూ సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్మికులకు సిఐటియు మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ పయనీర్ ఎలస్టిక్ పరిశ్రమలో కార్మికులకు ప్రతి ఏటా ఇంక్రిమెంట్ వేయడం లేదన్నారు. కార్మికులు అన్ని విధాలుగా శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సామ్‌సంగ్ నుంచి బెస్పోక్ లాండ్రీ వెంటెడ్ కాంబో

గూర్‌గావ్ : సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ కొత్తగా తమ బెస్పోక్ ఎఐ లాండ్రీ ఉపకరణాల శ్రేణిలో లాండ్రీ వెంటెడ్ కాంబోను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఏడు అంగుళాల ఎఐ హోమ్ టచ్‌స్క్రీన్‌తో కూడిన ఈ మిశ్రమ యూనిట్ వాషింగ్, డ్రైయింగ్ మధ్య లాండ్రీని బదిలీ చేయవలసిన అవసరాన్ని తొలగిస్తుందని పేర్కొంది. ఇది రెండు ప్రీమియం రంగులలో వస్తుందని పేర్కొంది. భారత్‌లో ప్రీ ఆర్డర్లను మాత్రమే తీసుకుంటున్నట్లు పేర్కొంది.

ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బి డిపాజిట్లలో 20 శాతం వృద్ధి

బెంగళూరు : ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ 2025 మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4) 19.7 శాతం వృద్ధితో రూ.37,617 కోట్ల డిపాజిట్లను సాధించినట్లు ప్రకటించింది. ఇదే సమయంలో రుణాల జారీలో 11.6 శాతం పెరుగుదలతో రూ.7,455 కోట్లను నమోదు చేసినట్లు పేర్కొంది. గడిచిన ఆర్థిక సంవత్సరం ముగింపు త్రైమాసికంలో అత్యంత బలమైన ఫలితాలను సాధించినట్లు ఆ బ్యాంక్ పేర్కొంది.

28న నథింగ్ సిఎంఎఫ్ ఫోన్ ప్రో విడుదల

న్యూఢిల్లీ : లండన్ కేంద్రంగా పని చేస్తోన్న టెక్ కంపెనీ నథింగ్ తన సిఎంఎఫ్ సిరీస్‌లో ఏప్రిల్ 28న తన సిఎంఎఫ్ ఫోన్ 2 ప్రోను విడుదల చేస్తోన్నట్లు ప్రకటించింది. 2023లో ఆవిష్కరించిన తన సబ్‌బ్రాండ్ సిఎంఎఫ్ కింద దీన్ని తెస్తోంది. దీంతో పోటో సిఎంఎఫ్ కొత్త ఆడియో ఉత్పత్తులను కూడా పరిచయం చేయనున్నట్లు వెల్లడించింది.

నయా ఫాసిస్ట్ ధోరణులపై పోరాటం

- సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి పిలుపు
- పి.రామమూర్తి విగ్రహం వద్ద నివాళి

మధురై : మదురైలో విజయవంతంగా జరిగిన సిపిఐ(ఎం) మహాసభ చరిత్రలో అత్యంత విశేషమైనదని ఆ పార్టీ నూతన ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రణలో ఉన్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గట్టి హెచ్చరికను మహాసభ జారీ చేసిందని ఆయన తెలిపారు, మోడీ పరిపాలన నయా-ఫాసిస్ట్ ధోరణులను వ్యక్తం చేస్తోందని, ఈ నయా ఫాసిస్ట్ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాలని మహాసభ పిలుపునిచ్చిందని, ఈ పిలుపును ప్రజలు స్వీకరిస్తారని బేబి పేర్కొన్నారు. మహాసభ విజయవంతంగా ముగిసిందని, దీనికి నిర్మాణ నైపుణ్యం, సమిష్టి భాగస్వామ్యం కారణమని స్పష్టం చేశారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తరువాత మదురైలోని తెప్పకుళంలో పార్టీ సీనియర్ నాయకుడు పి.రామమూర్తి విగ్రహానికి పూలమాల వేసిన తర్వాత ఎంఎ బేబి 'దేశాభిమాని'తో మాట్లాడారు. తమిళనాడు ప్రజలకు పార్టీ పట్ల ఉన్న ప్రేమ, నమ్మకం సమావేశం అంతటా, రెడ్ వలంటీర్ మార్చ్, లక్షలాది మంది హాజరైన బహిరంగ సభలో స్పష్టంగా కనిపించిందని తెలిపారు. 1953, 1972లో మదురైలో జరిగిన పార్టీ మహాసభలు కూడా చరిత్రలో కీలకమైనవి. 1972లో జరిగిన తొమ్మిదవ మహాసభలో, ఇందిరా గాంధీ పాలనలో మితిమీరిన నిరంకుశ ధోరణులు, అర్ధ-ఫాసిస్ట్ నియంతృత్వానికి వ్యతిరేకంగా దేశాన్ని పార్టీ హెచ్చరించింది. ఆ తర్వాత కొద్దికాలానికే ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని ప్రకటించారని బేబి గుర్తు చేశారు.

కె. బాలకృష్ణన్, మదురై ఎంపి సు వెంకటేశన్ నేతృత్వంలోని నిర్వాహక కమిటీ, అన్ని వర్గాల ప్రజలను మహాసభలో భాగం చేయడంలో అద్భుతమైన పని చేసింది. ప్రజల ఉత్సాహాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. ఎర్ర దండు కవాతు క్రమశిక్షణ, బహిరంగ సభ ఉత్సాహం నిర్మాణ నైపుణ్యానికి నిదర్శనాలు. బహిరంగ సభ ముగింపులో వర్షం కురుస్తున్నప్పటికీ, ప్రజలు ప్రసంగాన్ని ఉత్సాహంగా విన్నారు' అని బేబి తెలిపారు.

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బహిరంగ సభలో ఎంపురాన్ సినిమా గురించి ప్రస్తావించడాన్ని బేబి గుర్తు చేశారు. కేరళ, తమిళనాడు ముఖ్యమంత్రులు, కర్ణాటక మంత్రి ఎం.సి.సుధాకర్ హాజరైన ఈ సెమినార్ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై విధించిన ఆంక్షలకు వ్యతిరేకంగా ఒక ప్రధాన హెచ్చరిక. ఈ మహాసభలో ప్రకాష్ రాజ్, రోహిణి, సముద్రఖని, వెట్రిమారన్, టిజి జ్ఞానవేల్, సెల్వరాజ్ వంటి సినీ ప్రముఖులు కూడా సంబంధిత కార్యక్రమాలకు హాజరయ్యారని ఎంఎ బేబి తెలిపారు.

మూడో రోజూ యుఎస్ మార్కెట్లు ఢమాల్

ముంబాయి : వరుసగా మూడోరోజూ అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ఎస్ అండ్ పి, డోజోన్స్ బేర్ గుప్పిట్లోకి జారుకున్నాయి. సోమవారం మార్కెట్ ప్రారంభంలోనే ఎస్‌అండ్‌పి 500 సూచీ 229.94 పాయింట్లు లేదా 4.52 శాతం పతనమైంది. డోజోన్స్ 1626 పాయింట్లు లేదా 4.24 శాతం, నాస్‌డాక్ 773 పాయింట్లు లేదా 4.96 శాతం చొప్పున క్షీణించాయి. కొవిడ్ తర్వాత ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. జపాన్ నిక్కీ 8.49 శాతం, సింగపూర్ స్ట్రెయిట్ టైమ్స్ 8 శాతం, హాంగ్‌కాంగ్ హాంగ్‌సెంగ్ 15.24 శాతం, దక్షిణ కొరియా కోస్పీ 5.89 శాతం చొప్పున నష్టాలను చవిచూశాయి. శుక్రవారమే అమెరికా మార్కెట్లు బేర్ గుప్పిట్లోకి వెళ్లాయి. సాధారణంగా ఏదైనా సూచీ రికార్డు గరిష్టాల నుంచి 20 శాతం మేర పతనమైతే దాన్ని బేర్ గుప్పిట్లోకి జారుకున్నట్లు పరిగణిస్తారు.

ప్రధాన కారణాలు..

ట్రంప్ విధానాలకు ధీటుగా చైనా కూడా సుంకాల మోత మోగించడంతో వాణిజ్య యుద్ధం తీవ్రతరమైంది. అమెరికా విధానాలు ప్రపంచ వృద్ధిని దెబ్బతీయడంతో పాటు మాంద్యానికి ఆజ్యం పోస్తోందన్న నిపుణుల అంచనాలు ఇన్వెస్టర్లను బెంబేలెత్తిస్తున్నాయి. మార్కెట్లు మరింత పతనం కానున్నాయనే విశ్లేషణలు అమ్మకాలకు మరింత ఆజ్యం పోశాయి. భారత ఫార్మా రంగంపై కూడా భారీ టారిఫ్‌లు విధించనున్నట్లు యుఎస్ ప్రకటించడంతో అరబిందో ఫార్మా, లారస్ ల్యాబ్స్, లుపిన్ వంటి కంపెనీల షేర్లు నేలచూపులు చూశాయి.

ఎవరూ పెట్టుబడులు పెట్టొద్దు : రాహుల్ గాంధీ

"స్టాక్ మార్కెట్ల నుంచి డబ్బు సంపాదించవచ్చనేది భ్రమే. ఎవరూ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టవద్దు. దేశంలో ఒక్క శాతం మంది మాత్రమే స్టాక్స్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. ట్రంప్ భ్రమను మూటగట్టుకున్న ప్రధాని మోడీ ఎక్కడా కనపడటం లేదు." అని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

ట్రంప్, మోడీ చర్యల వల్లే మార్కెట్లకు తీవ్ర నష్టాలు : జైరామ్ రమేష్

స్టాక్ మార్కెట్లు భారీగా పతనం కావడానికి మోడీనే ప్రధాన కారణమని కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ అన్నారు. మోడీ, ట్రంప్ తమను తాము అపూర్వ స్నేహితులుగా అభివర్ణించుకోవడంలో ఆశ్చర్యం లేదన్నారు. ఎందుకంటే ఇద్దరూ తమ ఆర్థిక వ్యవస్థలు పతనం అవ్వడానికి స్వయంగా సమస్యలు సృష్టించుకోవడంలో నిపుణులని విమర్శించారు. 2016 నవంబర్ 8న చేసిన నోట్ల రద్దు, 2025 ఏప్రిల్ 5 నుంచి అమల్లోకి వచ్చిన పరస్పర సుంకాలు వీటికి ఉదాహరణలని విమర్శించారు. వారిద్దరి చర్యల కారణంగానే మార్కెట్లు తీవ్రంగా నష్టాలు చవి చూస్తున్నాయన్నారు.

ఇది ట్రైలరే : జిమ్ క్రెమెర్

స్టాక్ మార్కెట్లలో ఇప్పుడు నడుస్తోన్నది ట్రైలర్ మాత్రమేనని అమెరికా మార్కెట్ నిపుణులు, హార్వర్డ్ లా గ్రాడ్యుయేట్ జిమ్ క్రెమెర్ పేర్కొన్నారు. ఈ పరిస్థితిని నియంత్రించకపోతే అమెరికన్ మార్కెట్లలో 1987 నాటి బ్లాక్ మండే సంక్షోభ పరిస్థితులు పునరావృతం అవుతాయన్నారు. ట్రంప్ వెంటనే సహకారం చూపుతున్న దేశాలతో చర్చలు జరిపి ఈ ప్రతీకార పన్నులను ఎత్తేయాలని ఆయన సూచించారు. 1987 అక్టోబర్ 19న ఒక్క రోజే అమెరికా డౌజోన్స్ సూచీ ఏకంగా 22.6 శాతం పతనమై.. బ్లాక్ మండేగా నిలిచింది.

సంక్షోభాన్ని అంచనా వేయలేం : వికె విజయ్ కుమార్

ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్లు తీవ్రమైన అస్థిరతను ఎదుర్కొంటున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వికె విజయకుమార్ అన్నారు. ట్రంప్ టారిఫ్‌ల కారణంగా ఏర్పడిన ఈ సంక్షోభం ఎలా మారబోతోందో అంచనా వేయడం కష్టంగా మారిందన్నారు. ఈ సమయంలో వేచి చూడటమే ఉత్తమ వ్యూహమని అన్నారు.

రూపాయికి టారిఫ్‌ల సెగ

- 38 పైసలు పతనం

న్యూఢిల్లీ : అమెరికా టారీఫ్ యుద్ధ అనిశ్చితులకు తోడు దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ భారీగా పతనమయ్యింది. స్టాక్ మార్కెట్ల వరుస పతనం.. ఎఫ్‌ఐఐలు తరలిపోవడంతో రోజు రోజుకు ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలోనే డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 38 పైసలు క్షీణించి 85.82కు దిగజారింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో డాలర్‌తో రూపాయి విలువ 85.79 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 85.57-85.90 మధ్య కదలాడింది. ముడి చమురు బ్యారెల్ ధర 3.03 శాతం తగ్గి 63.59 వద్ద ముగిసింది. శుక్రవారం సెషన్‌లో రూ.3,483.98 కోట్ల ఎఫ్‌ఐఐలు తరలిపోయాయి. భారత్‌కు ట్రంప్ ప్రభుత్వం వ్యూహాత్మక భాగస్వామి అని గొప్పలు చెప్పుకుంటున్న బిజెపి ప్రభుత్వ వర్గాలకు ట్రంప్ టారిఫ్‌ల చర్యలతో రూపాయి పతనం, మార్కెట్ల క్షీణతతోనైనా మేలుకొలుపు కావాలని నిపుణులు సూచిస్తున్నారు. రూపాయి పతనంతో దిగుమతి, దిగుమతి ఆధారిత ఉత్పత్తులు భారం కానున్నాయి. బంగారం ధర మరింత పెరగనుంది. అదే విధంగా ప్రభుత్వ విదేశీ అప్పు చెల్లింపులు భారంగా మారనున్నాయి. ఈ పరిణామాలు అంతిమంగా దేశ ఆర్థిక వ్యవస్థను మందగమనంలోకి నెట్టనున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

యెమెన్‌పై అమెరికా దాడి

- నలుగురు మృతి

సానా : యెమెన్‌పై అమెరికా బలగాలు వైమానిక దాడికి పాల్పడ్డాయి. రాజధాని సానాలో ఆదివారం రాత్రి జరిగిన ఈ దాడిలో నలుగురు మృతి చెందారని ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. అమెరికా యుద్ధ విమానాలు ఒక నివాస భవనంపై దాడి చేయడంతో ఆ ఇంట్లోని నలుగురు మహిళలు, చిన్నారులతో సహా 20 మందికి పైగా గాయపడ్డారు. అలాగే రాజధాని సానాకి పశ్చిమాన ఉన్న బనిమటర్ జిల్లాలో అల్ జబల్ అల్ అస్వాద్ ప్రాంతంపై పలుసార్లు దాడులు జరిపారు. అయితే ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదని అక్కడి మీడియా వర్గాలు పేర్కొన్నాయి.

పెట్రోల్, డీజిల్‌పై రూ.2 ఎక్సైజ్ డ్యూటీ పెంపు

న్యూఢిల్లీ : పెట్రోల్, డీజిల్‌పై రూ.2 చొప్పున ఎక్సైజ్ డ్యూటీని కేంద్రం సోమవారం పెంచింది. ఈ పెంపుతో వినియోగదారులపై ప్రభావం ఉండదని, ఈ భారాన్ని చమురు మార్కెటింగ్ కంపెనీలు భరిస్తాయని కేంద్రం వివరించింది.

సాధారణ వివాదాలను
క్రిమినల్ కేసులుగా ఎలా మారుస్తారు!

- యుపిలో ఎందుకీ పరిస్థితి
- చెక్ బౌన్స్ కేసులో చీఫ్ జస్టిస్ ఖన్నా వ్యాఖ్య
- రెండు వారాల్లోగా అఫిడవిట్లు ఇవ్వాలని డిజిపికి, దర్యాప్తు అధికారికి ఆదేశాలు

న్యూఢిల్లీ : సాధారణమైన సివిల్ వివాదాలను క్రిమినల్ కేసులుగా మార్చివేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఉత్తరప్రదేశ్‌లో రోజురోజుకూ ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని, ఇది చాలా అసంబద్ధమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు.

"ప్రతి రోజూ సివిల్ వివాదాలు క్రిమినల్ కేసులుగా మారిపోతున్నాయి. ఇది చాలా అసంబద్ధం. సివిల్ అంశాలపై తలెత్తిన వివాదాలను నేరాలుగా మార్చరాదు. ఉత్తరప్రదేశ్‌లో చట్టబద్ధ పాలన పూర్తిగా ధ్వంసమైంది. సివిల్ అంశాన్ని క్రిమినల్ కేసుగా మార్చడాన్ని ఆమోదించేది లేదు." అని చీఫ్ జస్టిస్ ఖన్నా వ్యాఖ్యానించారు. దేబూ సింగ్, దీపక్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఖన్నా నేతృత్వంలో బెంచ్ విచారణ సందర్భంగా ఖన్నా ఈ వ్యాఖ్యలు చేశారు. తమపై నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేయడానికి నిరాకరిస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై వారిద్దరూ సుప్రీంను ఆశ్రయించారు. వారిద్దరు చెక్ బౌన్స్ కేసును ఎదుర్కొంటున్నారు. అకస్మాత్తుగా వారిపై క్రిమినల్ నేరాలకు చార్జిషీట్‌ను తెరిచినట్లు తెలుసుకున్నారు. విశ్వాస ఉల్లంఘన, బెదిరింపులు, క్రిమినల్ కుట్ర వంటి ఆరోపణలను కూడా ఎదుర్కొన్నారు. సివిల్ వివాదాలను పరిష్కరించడానికి దీర్ఘకాలం పడుతున్నందున సత్వర పరిష్కారం కోసం కుట్రతో క్రిమినల్ కేసులుగా నమోదు చేస్తున్నారని వారి తరపు న్యాయవాది పేర్కొన్నారు. వారిద్దరిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్‌పై బెంచ్ స్టే ఇచ్చింది. చెక్ బౌన్స్‌కేసు వారిపై కొనసాగుతుందని తెలిపింది.

పోలీసు అధికారి బోనులో నిలబడి వివరణ ఇవ్వాలి : సిజెఐ

ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారి విచారణ సందర్భంగా బోనులో నిలబడి తన చర్యను వివరించాల్సి వుందని, చెక్ బౌన్స్ కేసును ఎలా క్రిమినల్ కేసుగా మార్చారో చెప్పాలని చీఫ్ జస్టిస్ పేర్కొన్నారు. తద్వారా ఆ అధికారి గుణపాఠం నేర్చుకోవాలన్నారు. చార్జిషీట్‌లను దాఖలు చేయాల్సిన పద్ధతి ఇది కాదని తెలుసుకోవాలన్నారు. యుపిలో ఇలాంటి సంఘటనలు రోజురోజుకూ పెరుగుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. సివిల్ జ్యూరిస్‌డిక్షన్ కూడా వుందని లాయర్లు మర్చిపోతున్నారని చీఫ్ జస్టిస్ వ్యాఖ్యానించారు.

రెండు వారాల్లోగా అఫిడవిట్లు దాఖలు చేయాల్సిందిగా డిజిపిని, దర్యాప్తు అధికారిని కోర్టు ఆదేశించింది. ఇద్దరు వ్యక్తులపై సివిల్ వివాదంలోకి క్రిమినల్ చట్టాన్ని తీసుకురావడానికి కారణాలు చెప్పాలని కోరింది. ఈ కేసుపై విచారణను మే 5కు వాయిదా వేసింది.

'వివి ప్యాట్' పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీం

న్యూఢిల్లీ : ఎన్నికల సమయంలో ఎలక్ట్రానిక్ కౌంటింగ్‌తో పాటు ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రెయిల్ (వివిప్యాట్) స్లిప్‌లను వంద శాతమూ చేతితోనే లెక్కించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ అంశంపై ఢిల్లీ హైకోర్టు గతేడాది ఆగస్టు 12న ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ హంస్‌రాజ్ జైన్ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ సోమవారం తోసిపుచ్చింది. ఢిల్లీ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి తమకు ఎలాంటి సహేతుకమైన కారణం కనిపించడం లేదని, అందువల్లే ఈ స్పెషల్ లీవ్ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నామని చీఫ్ జస్టిస్ తెలిపారు. గతంలో ఇలాంటి అంశాలను లేవనెత్తుతూ తన నేతృత్వంలోని బెంచ్ తీర్పునిచ్చిందని, మళ్లీ మళ్లీ దీనిపై ఆందోళన చెందడం సరికాదని అన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎం)ను వివిప్యాట్ స్లిప్‌లతో వంద శాతమూ సరిపోల్చాలంటూ గతంలో దాఖలైన పిటిషన్లను తోసిపుచ్చుతూ సుప్రీంకోర్టు, ఇవిఎంలు సురక్షితమైనవి, సులభమైనవి, భద్రమైనవి, ఓటరుకు సులువుగా వుండేవని పేర్కొంది. జైన్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు తీర్పులను ఉదహరిస్తూ గతేడాది ఆగస్టు 12న ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చింది.

ఒక వ్యవస్థ వుందిగా.. దాన్నే అనుసరిస్తాం!

- వక్ఫ్ అభ్యర్థనల పరిశీలనపై చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా

న్యూఢిల్లీ : వక్ఫ్ (సవరణ) చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తున్న పిటిషన్లను త్వరలోనే విచారిస్తామని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా చెప్పారు. కేసులను అత్యవసరంగా విచారించాలని కోరుతూ పంపే రాతపూర్వక అభ్యర్థనలు లేదా ఇ మెయిల్స్ వంటి వాటిని పరిశీలించేందుకు ఒక పద్ధతి వుందని, దాన్ని కోర్టు అనుసరిస్తుందని జస్టిస్ ఖన్నా చెప్పారు. ప్రధాన న్యాయమూర్తి మొత్తంగా పరిస్థితులను సమీక్షించి, ఆయా కేసులను బెంచ్‌లకు అప్పగిస్తారన్నారు. ఇవన్నీ చూసేందుకు ఇప్పటికే ఒక వ్యవస్థ అమల్లో వుండగా, మీరెందుకు ప్రస్తావిస్తున్నారని జస్టిస్ ఖన్నా పిటిషనర్ల తరపు న్యాయవాది కపిల్ సిబల్‌ను సోమవారం ప్రశ్నించారు. ఈ పిటిషన్లను సత్వరమే విచారించాల్సిన అవసరం వుందని సమస్తా కేరళ జమైతుల్ ఉలేమా తరపు న్యాయవాదులు ఎ.ఎం.సింఘ్వి, జుల్ఫీకర్ అలీ, ఎఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసి తరపు న్యాయవాది నిజామ్ పాషా కూడా కోరారు. వక్ఫ్ ఆస్తులపై, వాటి నిర్వహణపై ఈ చట్టం ఏకపక్షంగా ఆంక్షలు విధిస్తోందని పిటిషనర్లు పేర్కొంటున్నారు. దీనివల్ల ముస్లిముల మత స్వయంప్రతిపత్తికి విఘాతం కలుగుతోందన్నారు. రాజ్యాంగంలోని మౌలిక అంశమైన సమానత్వపు హక్కును ఇది ఉల్లంఘిస్తోందన్నారు.

సుప్రీంకు ఐయుఎంఎల్

1995 నాటి వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ కొత్తగా తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ సోమవారం ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మతపరమైన, దాతృత్వ కార్యకలాపాల కోసం అల్లాకు శాశ్వతంగా అంకితమైన వక్ఫ్ ఆస్తుల పాలన, ఏర్పాటు, రక్షణ వంటి అంశాలను కొత్తగా తీసుకువచ్చిన సవరణలు ప్రాథమికంగా మార్చివేస్తున్నాయని ఐయుఎంఎల్ తన పిటిషన్‌లో పేర్కొంది. రాజ్యాంగంలోని 14, 15, 25, 26 అధికరణలను ఉల్లంఘిస్తున్నాయని ఆ పిటిషన్ పేర్కొంది.

ఐయుఎంఎల్ అధ్యక్షుడు కె.ఎం.కదర్ మొహియుద్దీన్ ఆదివారం మాట్లాడుతూ, వక్ఫ్ చట్టాన్ని కాపాడేందుకు తమ పార్టీ చట్టపరంగా పోరాడుతుందని చెప్పారు.

ఇజ్రాయిల్ ఆక్రమణలో 50% పైగా గాజా

- బంజరు భూమిలా మార్చేశాం : మీడియాతో సైనికులు

టెల్ అవీవ్ : గాజాలో తన మిలటరీ బఫర్ జోన్‌ను విస్తరిస్తూ వస్తున్న ఇజ్రాయిల్ ప్రస్తుతం 50శాతానికి పైగా భూభాగంపై పట్టు సాధించింది. ఈ ప్రాంతమంతా ఎక్కువగా గాజా సరిహద్దు చుట్టుపక్కలనే వుంది. ఇక్కడ మిలటరీ మొత్తంగా ఇళ్లను నేలమట్టం చేసేసింది. పొలాలు, మౌలిక వసతులనేవి కంటికి కనిపించకుండా నాశనమయ్యాయి. ప్రజలు నివసించడానికి వీలుగా ఆ ప్రదేశం లేదని ఇజ్రాయిల్ సైనికులే చెబుతున్నారు. మానవ హక్కుల గ్రూపులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇటీవలి వారాల్లోనే మిలటరీ బఫర్ జోన్ రెట్టింపైంది. హమాస్ వద్ద మిగిలిన బందీలను విడిపించుకునేందుకు ఇజ్రాయిల్ పన్నిన ఎత్తుగడలో భాగంగానే మొత్తంగా గాజాను ఆక్రమించుకుంటూ వెళుతోంది. ఉత్తర, గాజాలను విభజించే కారిడార్ ఇజ్రాయిల్ అధీనంలోనే వుంది. దీనివల్ల దీర్ఘకాలంగా ఈ ప్రాంతంపై పట్టు సాగించడానికి వీలుంటుందని గాజా నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. హమాస్‌ను ఓడించిన తర్వాత కూడా గాజాలో సెక్యూరిటీ పట్టును ఇజ్రాయిల్ కొనసాగిస్తుందని, పాలస్తీనియన్లను అక్కడ నుండి వెళ్లిపోయేలా చేస్తామని గత వారమే ప్రధాని నెతన్యాహు చెప్పారు.

ప్రతి దాన్నీ పనికి రాకుండా చేశాం : మీడియాతో సైనికులు

18 మాసాల క్రితం దాడులు ఆరంభించినప్పటి నుండి ఒక పద్ధతి ప్రకారమే బఫర్ జోన్‌ను విస్తరించుకుంటూ వస్తోందని, ఇజ్రాయిల్ సరిహద్దుకు సమీపంలోనే మొత్తంగా కూల్చివేతలు, ఆక్రమణలు వున్నాయని ఐదుగురు ఇజ్రాయిల్ సైనికులు మీడియాకు తెలిపారు. "ప్రతిదాన్నీ పనికిరాకుండా చేశాం. ఒకవేళ పాలస్తీనియన్లు వెనక్కి తిరిగి వచ్చినా వారు జీవించడానికి ఏమీ మిగల్లేదు, ఇక వారు ఎప్పటికీ వెనక్కి తిరిగి రాకుండా వుండేందుకే ఇదంతా చేసింది." అని కూల్చివేతల బృందాలకు చెందిన సైనికుడు ఒకరు చెప్పారు. తమ పేర్లు చెప్పకుండా వుండే షరతుపై వారు మీడియాతో మాట్లాడారు. మొత్తంగా ఇక్కడున్న భూమి అంతా బంజరు భూమిగా మారిపోయిందని, ఏమీ పండవని వారు చెప్పారు. ఆ సైనికుల వ్యాఖ్యలు, కథనాలతో కూడిన నివేదికను సోమవారం విడుదల చేశారు. గాజా ఆక్రమణ వ్యతిరేక గ్రూపు బ్రేకింగ్ ది సైలెన్స్ ఈ నివేదికను విడుదల చేసింది. విస్తృతమైన రీతిలో విచ్చలవిడిగా విధ్వంసానికి ఉద్దేశపూర్వకంగా మిలటరీ పునాది వేసిందని ఆ గ్రూపు వ్యాఖ్యానించింది. దీనిపై ఇజ్రాయిల్ ఆర్మీ స్పందిస్తూ, అక్టోబరు 7నాటి దాడిలో ధ్వంసమైన దక్షిణ ప్రాంత కమ్యూనిటీల భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతోనే ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. తాము గాజాలోని పౌరులకు హాని కలిగించాలనుకోవడం లేదని, అంతర్జాతీయ చట్టానికి కట్టుబడి వున్నామని తెలిపింది. యుద్ధం ఆరంభించిన తొలినాళ్లలో కిలోమీటరుకు పైగా వుండేలా బఫర్ జోన్‌ను ఏర్పాటు చేసేందుకు ఇజ్రాయిల్ సైన్యం పాలస్తీనియన్లను అక్కడ నుండి పారద్రోలిందని ఆ నివేదిక పేర్కొంది.

విరాళాల్లో 88% బిజెపికే..

(మొదటి పేజీ తరువాయి)

నివేదిక పేర్కొంది. 4,628మంది వ్యక్తిగత దాతల ద్వారా బిజెపికి రూ. 169.126 కోట్లు అందాయి.

ఇక, 2023-24 ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీకి కార్పొరేట్/వ్యాపార రంగాల నుండి 102 విరాళాల ద్వారా మొత్తం రూ.190.3263 కోట్లు అందగా, 1,882 మంది వ్యక్తిగత దాతల ద్వారా రూ.90.899 కోట్లు వచ్చాయని నివేదిక వెల్లడించింది. 2023-24లో మిగిలిన జాతీయ పార్టీలు ప్రకటించిన మొత్తం కార్పొరేట్ విరాళాల కంటే (రూ.197.97 కోట్లు) తొమ్మిది రెట్లు ఎక్కువగా రూ.2064.58 కోట్లు బిజెపికి వచ్చాయి.

విరాళాలిచ్చిన సంస్థలివే!

విరాళాలు ఇచ్చిన సంస్థల్లో ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ బిజెపి, కాంగ్రెస్‌లకు కలిపి మొత్తంగా రూ.880 కోట్లు విరాళంగా ఇచ్చింది. ఎక్కువ విరాళాలు ఇచ్చిన సంస్థల్లో అగ్రస్థానంలో నిలిచింది. ఈ ట్రస్ట్ బిజెపికి రూ. 723.675 కోట్లు (బిజెపి అందుకున్న మొత్తం నిధులలో 32.25 శాతం), కాంగ్రెస్‌కు రూ.156.4025 కోట్లు (కాంగ్రెస్ అందుకున్న మొత్తం నిధులలో 55.56 శాతం) విరాళంగా ఇచ్చింది.

ట్రయంఫ్ ఎలక్టోరల్ ట్రస్ట్ బిజెపికి నాలుగు విరాళాల ద్వారా రూ.127.50 కోట్లు విరాళంగా ఇచ్చింది. డెరైవ్ ఇన్వెస్ట్‌మెంట్స్ బిజెపికి రూ.50 కోట్లు, కాంగ్రెస్‌కు రూ. 3.20 కోట్లు విరాళంగా ఇచ్చింది.

2023-24 ఆర్థిక సంవత్సరంలో బిజెపికి, ఆక్మే సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఐదు విరాళాల ద్వారా రూ. 51 కోట్లు, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఒకే విరాళం ద్వారా రూ.50 కోట్లు, రుంగ్తా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఒకే విరాళం ద్వారా రూ. 50 కోట్లు, దినేష్ చంద్ర ఆర్ అగర్వాల్ ఇన్ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ ఒకే విరాళం ద్వారా రూ. 30 కోట్లు విరాళంగా ఇచ్చాయి.

కాగా, ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ తన నివేదిక ద్వారా బిజెపికి రూ. 723.78 కోట్ల విలువైన 31 విరాళాలను అందించినట్లు ప్రకటించిందని ఎడిఆర్ పేర్కొంది. ఇసికి బిజెపి ఇచ్చిన నివేదికలో రూ.723.675 కోట్ల విలువైన 30 విరాళాలను అందుకున్నట్లు ప్రకటించింది. జయభారత్ ఎలక్టోరల్ ట్రస్ట్ తన నివేదిక ప్రకారం బిజెపికి రూ.5 కోట్లు విరాళంగా ఇచ్చింది. బిజెపి తన నివేదికలో దీని గురించి ప్రస్తావించలేదని ఎడిఆర్ తెలిపింది.

రూ. 20,000 కంటే ఎక్కువ విరాళాలకు సంబంధించిన సరైన వివరాలు లేకుండా ఇచ్చే అసంపూర్ణ నివేదికలను తిరస్కరించాలని, అలాగే పాన్ వివరాలు తప్పనిసరి చేయడం వంటి నిబంధనలు అమలు చేయాలని ఎడిఆర్ తన నివేదికలో సిఫార్సు చేసింది. పార్టీ విరాళాల నివేదికలను కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సిబిడిటి) ప్రతి ఏడాది పరిశీలించాలని, సమాచార హక్కు చట్టం కింద దాతల వివరాలను బహిరంగంగా అందుబాటులో ఉంచాలని సూచించింది. నిబంధనలు పాటించడంలో విఫలమైన పార్టీలపై తీసుకున్న చర్యలపై సమాచారాన్ని బహిరంగ పర్చాలని ఎన్నికల సంఘాన్ని కోరింది. ఇందుకోసం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించాలని ఇసికి ఎడిఆర్ విజ్ఞప్తి చేసింది.

బనకచర్లపై గరంగరం

- అనుమతుల్లేకుండా ఎలా చేపడతారు?
- జిఆర్‌ఎంబిని ప్రశ్నించిన తెలంగాణ
- డిపిఆర్ తయారు కాలేదు : ఎపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతుల్లేకుండా తలపెట్టిందని గోదావరి నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. ఆ ప్రాజెక్టు సమాచారంతోపాటు ఇతర అంశాలపై ఆంధ్రప్రదేశ్ చాలా గోప్యత పాటిస్తోందని నిరసన వ్యక్తం చేసింది. దీనిపై జిఆర్‌ఎంబికి, కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం లేఖలు రాసిందని, అయినా పట్టించుకోకపోవడం సరికాదని వ్యాఖ్యానించింది. హైదరాబాద్‌లోని సాగునీటి శాఖ ప్రధాన కార్యాలయం జలసౌధలో గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జిఆర్‌ఎంబి) సమావేశం సోమవారం చైర్మన్ ఎకె ప్రధాన్ అధ్యక్షతన జరిగింది. దీనికి రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య అధికారులు హాజరయ్యారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అధికారుల మధ్య వాదనలు వాడీవేడిగా సాగాయి. ఈ సందర్భంగా బనకచర్ల ప్రాజెక్టు, తెలంగాణపై దాని ప్రభావం, జిఆర్‌ఎంబి కార్యదర్శి అజగేషన్ ప్రవర్తన, ఇతర అంశాలు చర్చకొచ్చాయి. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ జిఆర్‌ఎంబిని తీవ్రంగా ప్రశ్నించింది. ఎపి సర్కారును తప్పుబట్టింది. గోదావరి-బనకచర్ల అనుసంధానాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ వాదనలు వినిపించింది. రూ.80 వేల కోట్లతో ప్రాజెక్టు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని తెలిపింది. 180 టిఎంసిల మిగులు జలాలను తరలించాలనే లక్ష్యంతో ఎపి సర్కారు పనిచేస్తోందని గుర్తు చేసింది. అలాగే ఈ ప్రాజెక్టు కోసం నాగార్జునసాగర్ కుడికాలువ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రయత్నాలు చేస్తోందని విమర్శించింది. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం జిఆర్‌ఎంబికి లేఖ రాసినా పట్టించుకోకపోవడంపై నిరసన వ్యక్తం చేసింది. ఎపి సర్కారు సమాచారంతోపాటు ఇతర వివరాలను దాచిపెడుతోందని తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు జిఆర్‌ఎంబి చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టు అంశంపై బోర్డుకు కేంద్రం నుంచి లేఖ వచ్చి దాదాపు ఐదు నెలలు కావస్తున్నా తెలంగాణకు చెప్పకుండా బోర్డు నిర్లక్ష్యం చేసిందని గుర్తు చేశారు. బనకచర్ల ప్రాజెక్టు పూర్తి వివరాలు, దానిమూలంగా తెలంగాణపై ప్రభావం తదితర వివరాలను ఎపి ప్రభుత్వం అందించాలని తెలంగాణ అధికారులు బోర్డును కోరారు. ఈ మేరకు ఆ రాష్ట్రానికి ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా సూచించారు. అనుమతులు లేకుండా ప్రాజెక్టు చేపడుతున్నారని తెలంగాణ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఎపి అధికారులు స్పందిస్తూ బనకచర్ల ప్రాజెక్టుకు ఇంకా డిపిఆర్ తయారు చేయలేదని వివరణ ఇచ్చారు. తాము ఎలాంటి పనులూ చేయడం లేదని ఎపి ఇఎన్‌సి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మరోవైపు తెలంగాణలో పెద్దవాగు ప్రాజెక్టు ఆధునీకరణ పనులపై సమావేశంలో చర్చించారు. రూ. 15 కోట్లతో తక్షణ మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జిఆర్‌ఎంబి కార్యదర్శి అజగేషన్ వ్యవహార శైలిని తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. రాష్ట్రాలను సంప్రదించకుండానే బోర్డు సమావేశాలను నిర్వహిస్తున్నారని విమర్శించారు. జిఆర్‌ఎంబిలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఎపి, తెలంగాణకు చెందిన అధికారులను అజగేషన్ వేధిస్తున్నారని, మహిళా ఉద్యోగులను అసభ్యకర మాటలతో దూషిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డోలీ మోతలు తప్పిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధికి 'అడవితల్లి బాట' కార్యక్రమంతో శ్రీకారం చుట్టామని తెలిపారు. గత వైసిపి పాలనలో కేవలం రూ.99 కోట్లును మాత్రమే రోడ్లకు ఖర్చు పెట్టారని విమర్శించారు. ఏజెన్సీ వ్యాప్తంగా సుమారు 1170 గ్రామాలకు రోడ్లు లేవని, దశలవారీగా వాటికి రోడ్లు నిర్మిస్తామని అన్నారు. అరుకు ప్రాంతంలో టూరిజం బాగా అభివృద్ధి చెందాలని, గిరిజన యువత పర్యాటకంగా పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గంజాయికి బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

'ఉపాధి'లో కాఫీ మొక్కల పెంపకం

ఉపాధి హామీ చట్టం ద్వారా లక్ష ఎకరాల్లో కాఫీ పంట సాగుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానని పవన్ కల్యాణ్ తెలిపారు. తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్ర విభజనతో ఎపి తీవ్రంగా నష్టపోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పాల్గొన్నారు. పవన్ కల్యాణ్ ఏజెన్సీ పర్యటన నేపథ్యంలో అనంతగిరి మండల కేంద్రంలో సోమవారం జరిగే వారపు సంతను అధికారులు తాత్కాలికంగా రద్దు చేయడంతో గిరిజనులు ఇబ్బందులు పడ్డారు.

పిపిపి మోడ్‌లో అమరావతిలో మెగా మెడ్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

చేశామన్నారు. మొబైల్ వైద్య వాహనాల ద్వారా ఇంటివద్దే పరీక్షలు చేయించడంతో పాటు డాక్టర్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా సేవలందిస్తారని సిఎం పేర్కొన్నారు.

నియోజకవర్గకేంద్రాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు

టాటా, బిల్‌గేట్స్ ఫౌండేషన్ సహకారంతో వైద్యరంగంలో ముందుకెళ్లడం జరుగుతుందని, ప్రపంచస్థాయి టెక్నాలజీ, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను ఇక్కడకు తీసుకురానున్నట్లు చంద్రబాబు తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 100 నుంచి 300 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను నిర్మిస్తామన్నారు. 175 నియోజకవర్గాలకు గాను 70 నియోజకవర్గాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉన్నాయని, మిగిలిన 105 నియోజకవర్గాల్లో పిపిపి మోడ్‌లో 100 నుంచి 300 బెడ్‌ల ఆసుపత్రులను నిర్మిస్తామన్నారు. పిపిపి విధానంలో నిర్మించి వయబిలిటీగ్యాప్ ఫండింగ్ అందిస్తామని, ఆసుపత్రుల నిర్మాణానికి స్థలంతో పాటు కొంత రాయితీ ఇస్తామన్నారు. దేశ విదేశాల్లో ఉండే నిపుణులను ప్రభుత్వ సలహాదారులుగా పెట్టుకుంటామన్నారు.

మీకోసం

కుక్కర్‌లో అన్నం, పప్పు వండేటప్పుడు అందులో పొడవాటి చెంచా వేస్తే ఎసరు బయటికి రాకుండా ఉంటుంది.

జీవన సౌరభం

ఇంగిత జ్ఞానం లేని మెదడులో ప్రశ్న ఉదయించదు. మౌఢ్యం నిండిన మనసుల్లో ఆలోచన పుట్టదు.

భద్రయ్య మాస్టారు

పదవ తరగతి విద్యార్థులకు ఆరోజు వ్యాకరణం చెబుతున్నారు భద్రయ్య మాస్టారు. ఒక పదాన్ని ఎలా సంబోధించి రాసి పలకవచ్చో చెబుతున్నారు. 'పాత ఊరు అనే పదాన్ని, పాతూరు అని పలకవచ్చు కాని రాయకూడదు. పాత ఊరు అనే రాయాలి' అని చెప్పారు. వాక్య పొందికలో సరిగ్గా రాయడం తెలుసుకున్న విద్యార్థులకు ఈసారి 'ఒక అక్షరాన్ని పదంగా మార్చాలి అంటే మరికొన్ని పదాలు ఎలా తోడవుతాయో' వివరించారు.

'రామునితోక పివరుడు' అని కాకుండా 'రామునితో కపివరుడు' అని రాయాలి. పదాలు సరిగ్గా వాడకపోతే తప్పులు దొర్లుతాయి. నవ్వు తెప్పిస్తాయి మరి' అని హాస్యోక్తిగా చెప్పేసరికి పిల్లలందరూ పగలబడి నవ్వారు.

అప్పుడే పిల్లల మధ్యలోంచి భాస్కర్ లేచి ఏదో అడుగుతుండగా దినకర్ లేచి, 'సార్ మా ఇద్దరి పేర్లల్లో అర్థం కాస్త వివరంగా చెప్పండి' అని అడిగాడు. 'అర్థం చెబుతాలే గాని, నువ్వు ముందు కూర్చోరా భడవా!' అంటూ 'మంచి ప్రశ్న వేశావు. భాస్కర్ అన్నా దినకర్ అన్నా సూర్యుడు అని అర్థం. అయితే నేను మిమ్మల్ని సూర్యుడు అని నేను పిలిస్తే పలుకుతారా! మీ మీ పేర్లతో పిలిస్తేనే కదా పలుకుతారు! అని మాస్టారు నవ్వుకుంటూ చెబుతుండగానే తెలుగు పీరియడ్ ముగిసినట్లు స్కూల్‌బెల్ కొట్టారు. ఆరోజు భద్రయ్య మాస్టర్ క్లాస్ వ్యాకరణంతో సరదాగా గడిచిపోయిందని పిల్లలందరూ భలే సంతోషపడ్డారు.

- కనుమ ఎల్లారెడ్డి,
అమెరికా,
93915 23027.

తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఎనిమిది తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ



వి.శ్యామ్ వర్షిత్,
6వ తరగతి,
సిఆర్‌ఆర్ పబ్లిక్‌స్కూలు,
ఏలూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మహిళలూ... ఈ పోషకాలు అందేలా చూసుకోండి!

గృహిణులైనా, ఉద్యోగాలు చేసే మహిళలైనా ముందుగా వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఆరోగ్యాన్ని రక్షించటానికి సమతుల్య ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలు తమ డైట్‌లో ఖచ్చితంగా పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. లేకపోతే అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. రుతుస్రావం నుంచి ప్రెగ్నెన్సీ, డెలివరీ, మెనోపాజ్ వరకూ ఇలా శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఇది ఒత్తిడికి దారితీస్తుంది. రక్తహీనత, నీరసం, అలసట, తలనొప్పి, రోగ నిరోధకశక్తి తగ్గటం, ప్రెగ్నెన్సీ సంబంధిత రుగ్మతలు, రొమ్ము క్యాన్సర్, ఆర్థరైటిస్, ఓవేరియన్, పాలీసిస్టోసిస్ వంటి సమస్యలతో ఎక్కువగా ఇబ్బందులు పడుతుంటారు. మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి, వారి జీవన నాణ్యతను పెంపొందించుకోవటానికి, దీర్ఘాయువును పొందటానికి ఆహారం కీలకపాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

వయస్సు రీత్యా మహిళలకు శరీరంలో వచ్చే మార్పుల కారణంగా వారికి పలు రకాల విటమిన్లు అవసరమవుతాయి. మగవారితో పోలిస్తే మహిళలకు ప్రత్యేకంగా కొన్ని విటమిన్లు అవసరమవుతాయి. పెరుగుతున్న వయస్సుతోపాటు కొన్ని విటమిన్లు తప్పక తీసుకోవాలి. యునిసెఫ్ నివేదిక ప్రకారంలో ప్రపంచంలో 100 కోట్ల కంటే ఎక్కువ మంది మహిళలు, ఆడపిల్లలు రకరకాల విటమిన్లు, పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ లోపాలను అధిగమించటం కోసం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి.

ఒత్తిళ్లకు దూరంగా ఉండాలి

చాలామంది మహిళలు తమ వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను బ్యాలెన్స్ చేసుకోవటానికి ఇబ్బంది పడతారు. ఇది ఒత్తిడికి దారితీస్తుంది. మహిళలను ఎక్కువగా రక్తహీనత, నీరసం, అలసట, తలనొప్పి, రోగ నిరోధక శక్తి తగ్గడం, ప్రెగ్నెన్సీ సంబంధిత సమస్యలు, రొమ్ము క్యాన్సర్, ఆర్థరైటిస్, ఓవేరియన్ పాలీసిస్టోసిస్ వంటి ఆరోగ్య సమస్యలు వేధిస్తాయి. వారు తీసుకునే ఆహారమే వారి జీవన నాణ్యతను మెరుపర్చుకోవడానికి కీలకపాత్ర పోషిస్తుంది.

ఫోలెట్ : తమ రోజువారీ డైట్‌లో దీనిని ఖచ్చితంగా తీసుకోవాలి. ఇది గుండె ఆరోగ్యం, నరాల పనితీరు, చర్మ ఆరోగ్యం, జీర్ణక్రియ, రక్త ప్రసరణ, ఉత్పత్తిని మెరుగుపర్చటంలో సహాయపడుతుంది. గర్భధారణ సమయంలో దీనికి ఖచ్చితంగా తీసుకుంటే మేలని డాక్టర్లు చెబుతుంటారు. గర్భధారణ సమయంలో, మహిళలు ఫోలెట్ కచ్చితంగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తూ ఉంటారు. ఫోలిక్ యాసిడ్ గర్భంలోని పిండం ఎదుగుదలకు, అభివృద్ధికి అవసరమైన ముఖ్యమైన

పోషకాల్లో ఒకటి. గర్భంలో శిశువు మెదడు, వెన్నుముక అభివృద్ధికి సహాయపడుతుంది. ఇది బ్రకోలీ, క్యాబేజీ, పాలకూర, తృణధాన్యాలు, చిక్కుళ్లు, శనగలు, రాజ్మా, కమల, కరివేపాకు, మెంతి, తోటకూర, గోరుచిక్కుడు, బెండకాయ, గుడ్డు, ఆవు పాలల్లో సమృద్ధిగా లభిస్తుంది.

కాల్షియం : ఎముకలు, దంతాలు బలంగా ఉండటానికి కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలు వయస్సు పెరిగే కొద్దీ బోలు ఎముకల వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఎముకలు పెళుసుగా, బలహీనంగా మారతాయి. ఇవి సమృద్ధిగా ఉండే పాలు, పెరుగు, చీజ్ వంటి డైరీ ఉత్పత్తులను తీసుకోవాలి. పాలకూర, ఆకుకూరల్లోనూ కాల్షియం అధికంగా ఉంటుంది.

ఐరన్ : డబ్ల్యుహెచ్ఓ నివేదిక ప్రకారం దాదాపు 40 మంది గర్భిణీస్త్రీలు రక్తహీనతతో బాధపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఐరన్‌లోపమే. ఫలితంగా అలసట, బలహీనత వేధిస్తాయి. అలసట, బలహీనత వేధిస్తాయి. పౌల్ట్రీ, ఫిష్, నువ్వులు, బెల్లం, బీన్స్ వంటి ఆహార పదార్థాలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది.

ఫైబర్ : ఫైబర్ బరువును నియంత్రించటానికి దోహదపడుతుంది. జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. గుండె సమస్యలు, టైప్ 2 డయాబెటిక్ వంటి దీర్ఘకాలిక సమస్యల ముప్పును తగ్గిస్తుంది. తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు, నట్స్ వంటి ఆహారాలు తీసుకోవాలి.

పొటాషియం : ఇది ఒక ఎలక్ట్రోలైట్. రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. ఆరోగ్యకరమైన కండరాలు, నరాల పనితీరుకు సహాయపడుతుంది. పొటాషియం హైపర్‌టెన్షన్, స్ట్రోక్ ముప్పును తగ్గిస్తుంది. రోజువారీ ఆహారంలో అరటి, కమల, బంగాళదుంపలు, పాలకూర, బీన్స్ వంటి పొటాషియం పుష్కలంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి.

విటమిన్-ఎ : ఆడవాళ్ల ఆరోగ్యానికి విటమిన్-ఎ కీలకమైంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఎముకలు, దంతాలు ఆరోగ్యంగా ఉండటానికి 'ఎ' విటమిన్ తీసుకోవటం అత్యంత అవసరం. దీనికోసం టమోటా, క్యారెట్, బొప్పాయి, గుమ్మడికాయ, పాలకూర, చేపలు, పాలు, గుడ్లు, పుచ్చకాయ వంటివి ప్రతిరోజూ తీసుకుంటుండాలి.

విటమిన్-సి : రోగ నిరోధక శక్తికి పెంపొందించుకోవటానికి తప్పకుండా రోజువారీ డైట్‌లో తీసుకోవాలి. ఇది రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులను నిరోధిస్తుంది. గర్భిణులు, పాలిచ్చే తల్లుల ఆరోగ్యానికి ఇది ఎంతో అవసరం. ఇది సిట్రస్ ఫ్రూట్స్, బంగాళా దుంపలు, స్ట్రాబెర్రీస్, టమాటో, జామ, ఉసిరి వంటి వాటిలో లభిస్తుంది.

విటమిన్-డి : శరీరంలో కాల్షియం పెరుగుదలకు అవసరమైన 'డి' విటమిన్ మహిళల ఆరోగ్యానికి అత్యంత అవసరం. వయస్సుపైబడే కొద్దీ కీళ్ల అరుగుదల, కీళ్ల నొప్పులు వంటివి రాకుండా ఉండేందుకు విటమిన్-డి తీసుకోవటం అవసరం. ఇంటిపట్టునే ఉండే గృహిణుల్లో ఈ విటమిన్ ఎక్కువగా లోపిస్తుంది. అలాంటివాళ్లు రోజుకు కాసేపు ఎండలో ఉండటం అవసరం.

విటమిన్-బి3 : కణాల పనితీరు, పోషకాలను గ్రహించటంలో, నాడీ వ్యవస్థ పనితీరులో 'బి3' విటమిన్ కీలకం. ఇది ట్యూనా చేపలు, వేరుశెనగలు, పుట్టగొడుగులు, గోధుమలు, పాలు, గుడ్లు, బీన్స్ వంటి వాటిలో ఉంటుంది.

విటమిన్-బి6 : హార్మోన్ల ఉత్పత్తికి, మెదడు ఆరోగ్యానికి, రక్తహీనత వంటి సమస్యలను నివారించటానికి విటమిన్-బి6 అవసరం. దీనికోసం డ్రైఫ్రూట్స్, నట్స్, ఎగ్స్, ముడి ధాన్యాలు, బీన్స్, అరటిపండ్లు, మాంసం, ఓట్లు వంటివి తీసుకోవాలి.

విటమిన్-బి9 : ముఖ్యమైన విటమిన్లలో 'బి9' (ఫోలిక్ యాసిడ్) కూడా ఒకటి. ఇది గర్భిణుల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇది ఆకుకూరలు, బీన్స్, పప్పు ధాన్యాలు, అరటిపండ్లు, చేపల్లో ఎక్కువగా ఉంటుంది.

విటమిన్-బి12 : మహిళల్లో రక్తహీనత తగ్గటానికి విటమిన్-బి12 తీసుకోవడం అవసరం. ఇది రక్త కణాలు ఏర్పడటానికి, మెటబాలిజం రేటును పెంచటానికి పెంచటానికి ఉపయోగపడుతుంది. ఇది చేపలు, పాలు, గుడ్డు, మాంసం, పెరుగు వంటి పదార్థాల్లో అధికం.

'వచ్చిన వాడు గౌతమ్' షూటింగ్ 90 శాతం పూర్తి

ఓంకార్ తమ్ముడు అశ్విన్‌బాబు కథానాయకుడుగా రూపుదిద్దుకుంటున్న సినిమా 'వచ్చినవాడు గౌతమ్'. మెడికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీగా తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ 90 శాతం పూర్తయ్యింది. మిగిలిన పార్టును త్వరలో పూర్తిచేయటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మామిడాల ఎం.ఆర్.కృష్ణ దర్శకత్వంలో ఈ సినిమాను టి.గణపతిరెడ్డి నిర్మిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌ను పూర్తి చేసుకుని త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తామని నిర్మాతలు ప్రకటించారు. సాయి రోనక్ అతిథి పాత్రలో నటిస్తున్నారు. ఇతర ప్రధాన పాత్రల్లో రియా సుమన్, అయేషాఖాన్, మురళీశర్మ, సచిన్ ఖేడేకర్, అభినయ, అజయ్, వీటీవీ గణేష్ తదితరులు నటించారు. గౌర హరి సంగీతాన్ని అందిస్తున్నారు.

తారక్‌తో సుకుమార్ సినిమా

పుష్ప 2తో పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ కొట్టిన దర్శకుడు సుకుమార్ కొత్త ప్రాజెక్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. 'పెద్ది' సినిమా షూటింగ్ పూర్తయిన తర్వాత రామ్‌చరణ్‌తో సినిమా చేయాల్సివుంది. దీనికోసం ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ కొనసాగిస్తున్నారు. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ (తారక్) 'వార్ 2'లో నటిస్తున్నారు. త్వరలో ప్రశాంత్‌నీల్ ప్రాజెక్టులో చేరుతారు. ఇలాంటి పరిస్థితుల్లో తారక్‌తో సుకుమార్ భేటీపై ఇండస్ట్రీలో చర్చలు కొనసాగుతున్నాయి. సుకుమార్ సతీమణి తబిత ఇన్‌స్టాలో వీరిద్దరూ కలిసి ఉన్న ఫొటోను షేర్‌చేశారు. 'తారక్‌కి ప్రేమతో' అని సుకుమార్ భుజంపై తారక్ వాలి ఉన్న ఫొటోని పోస్ట్‌చేశారు. దీన్ని తారక్ రీపోస్ట్ చేయగా... మళ్లీ దీన్ని సుకుమార్ రీ పోస్టు చేసి 'మై అభిరామ్' అని రాసుకొచ్చారు. గతంలో సుకుమార్..ఎన్టీఆర్‌తో 'నాన్నకు ప్రేమతో' సినిమా తీయగా అది బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. తాజాగా వీరిద్దరు భేటీపై కొత్త ప్రాజెక్టుకు రంగం షురూ అంటూ ఇండస్ట్రీలో చర్చలు కొనసాగుతున్నాయి.

బాలీవుడ్‌లోకి అనన్య నాగళ్ల

సాఫ్ట్‌వేర్ ఇంజనీరైన అనన్య నాగళ్ల కెరీర్ ప్రారంభంలో 'షాదీ' వంటి షార్ట్ ఫిల్మ్‌లో నటించి నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 'మల్లేశం' మూవీతో ఆమె సినీ ప్రస్థానం మొదలైంది. 'ప్లే బ్యాక్' సినిమాలో మరో వైవిధ్యమైన పాత్రలో నటించారు. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ నటించిన 'వకీల్‌సాబ్'లో నటించే అవకాశాన్ని దక్కించుకున్నారు. అనంతరం 'తంత్ర', 'పొట్టేల్', 'బహిష్కరణ' (వెబ్‌సిరీస్), 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' వంటి సినిమాల్లో వైవిధ్యమైన పాత్రల్లో మెప్పించారు. 'తంత్ర' హిందీ వెర్షన్ జియో హాట్‌స్టార్‌లో టాప్ 2లో ట్రెండ్ అవుతోంది. 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' అమెజాన్ ప్రైమ్ వీడియోలో దేశవ్యాప్తంగా ఇప్పటికీ టాక్ 5లో ట్రెండింగ్‌లో ఉంది. బాలీవుడ్‌లో ఇప్పటికే కొందరు దర్శకులు, నిర్మాతల నుంచి పిలుపులు రావటంతో అటువైపుగా వెళ్తారని సమాచారం.

'గుడ్ బ్యాడ్ అగ్లీ' తెలుగు ట్రైలర్ విడుదల

కోలీవుడ్ స్టార్ కథానాయకుడు అజిత్ కుమార్ నటించిన చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తెలుగు వెర్షన్ ట్రైలర్ విడుదలైంది. మైత్రీ మేకర్స్ బ్యానర్‌లో వై.రవిశంకర్, నవీన్ యెర్నేని ఈ మూవీని నిర్మించారు. ఈనెల 10న ఈ సినిమా విడుదల కానుంది. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ తెరకెక్కించారు. కథానాయిక త్రిష. ఇటీవలే ఈ సినిమా తమిళ వెర్షన్ విడుదలైంది. ఏకంగా 35 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి ట్రెండింగ్‌లో ఉంది. తెలుగు వెర్షన్ కూడా విడుదలైన కొద్ది సేపటికే పెద్ద ఎత్తున వ్యూస్ వచ్చాయి.

'పోలీస్ వారి హెచ్చరిక'లో పాట విడుదల

అభ్యుదయ దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో తూలికా క్రియేషన్స్ పతాకంపై బెల్లి జనార్థన్ నిర్మించారు. ఈ సినిమా నుంచి ఫస్ట్ లిరికల్ సాంగ్‌ను సీనియర్ దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ ఆవిష్కరించారు. 'సుబ్బారావు నా కోసం చీర తెచ్చాడు. అప్పారావు నా కోసం పూలు తెచ్చాడు' అనే సాహిత్యంతో కూడిన పాటకు గజ్వేల్ వేణు సంగీతాన్ని అందించారు. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ ఏ సినిమాకైనా పాటలే ప్రాణమన్నారు. కొన్ని సినిమాలకు ఒక పాట హిట్టయ్యి అది జనబాహుళ్యంలోకి వైరల్ అయితే చాలు ఆ సినిమా సక్సెస్ అనే మైలు రాయి చేరుతుందని ఇటీవల విడుదలై సక్సెస్‌ను సాధించిన సినిమాలు రుజువు చేశాయన్నారు. చిత్ర కథానాయకుడు సన్నీ అఖిల్, దర్శకుడు బాబ్జీ, నిర్మాత బెల్లి జనార్థన్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సినిమాలో హిమజ, జయ వాహిని, అజయ్‌ఘోష్, షాయాజీషిండే, రవి కాలే, శుభలేఖ సుధాకర్, కాశీవిశ్వనాథ్, జబర్దస్త్ వినోద్; పవన్, శాంతిస్వరూప్ నటించారు.

కోహ్లి, పటీధర్ అదరహో...

ఉత్కంఠ పోరులో ముంబయిపై బెంగళూరు గెలుపు • బుమ్రా రీ ఎంట్రీ • చివర్లో కృనాల్ అద్భుత బౌలింగ్

ముంబయి: ఐపిఎల్ సీజన్-18లో భాగంగా వాంఖడే స్టేడియం సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో బెంగళూరు జట్టు 12 పరుగుల తేడాతో గెలిచింది. బెంగళూరు నిర్దేశించిన 222 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబయి జట్టు చివరి బంతి వరకు పోరాడి 209 పరుగులకే పరిమితమైంది. ఆఖరి 6 బంతుల్లో విజయానికి 19పరుగులు చేయాల్సిన ముంబయి జట్టును కృనాల్ పాండ్యా అద్భుత బౌలింగ్‌తో కట్టడి చేశాడు. ఆ ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టి ముంబయి గెలుపును బెంగళూరుకు ఖాయం చేశాడు. దీంతో ఈ సీజన్‌లో ముంబయి జట్టు ఐదు మ్యాచుల్లో నాల్గో ఓటమిని చవిచూడగా.. బెంగళూరు జట్టు మూడో గెలుపుతో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. అంతకుముందు బ్యాటర్లు చెలరేగారు. విరాట్ కోహ్లి (67), కెప్టెన్ రజత్ పటిదార్ (64) అర్ధసెంచరీలతో రాణించారు. వీరిద్దరూ ముంబయి బౌలర్లను ఉతికి ఆరేశారు. బుమ్రా రీ ఎంట్రీతో ముంబయి బౌలింగ్ గాడిలో పడుతుందని భావించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో బెంగళూరు జట్టు నిర్ణీత 20ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 221 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. పిచ్ నుంచి బ్యాటర్లకు సహకారం లభించకపోవడంతో ముంబయి బౌలర్లపై బెంగళూరు బ్యాటర్లు విరుచుకుపడ్డారు. టాస్ గెలిచిన ముంబయి కెప్టెన్ హార్దిక్ పాండ్యా బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో ఆర్సిబి బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ తొలి ఓవర్లోనే బౌల్ట్ బౌలింగ్‌లో అవుటై వెనుదిరిగాడు. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన దేవదత్ పడిక్కల్(37) కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

దీపక్ చాహర్ బౌలింగ్‌లో 4 కొట్టిన విరాట్.. ఆపై బౌల్ట్ బౌలింగ్‌లోనూ రెండుసార్లు బంతిని బౌండరీకి పంపాడు. విల్ జాక్స్ వేసిన 5వ ఓవర్లో కోహ్లి ఫోర్ కొట్టగా ఆర్సీబీ స్కోర్ 50కి చేరింది. దీపక్ చాహర్ వేసిన 6వ ఓవర్లో పడిక్కల్ వరుసగా 6, 6, 4 బదడంతో 20 పరుగులు వచ్చాయి. దాంతో, ఆర్సీబీ పవర్ ప్లేలో వికెట్ నష్టానికి 73 పరుగులు చేసింది. జోరు మీదున్న పడిక్కల్‌ను విఘ్నేష్ పుత్తుర్ అవుట్ చేశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రజత్ పటిదార్ కూడా తన ట్రేడ్ మార్క్ షాట్లతో అలరించాడు. కోహ్లిని, లివింగ్‌స్టోన్‌ను వెంట వెంటనే అవుట్ చేసిన హార్దిక్ పాండ్యా బెంగళూరు జోరుకు బ్రేకులు వేశాడు. వికెట్లు పడినా పటిదార్ మాత్రం వేగం తగ్గించలేదు. మరోవైపు జితేష్ (40నాటౌట్) కూడా చివర్లో మెరుపులు మెరిపించాడు. దీంతో ఆర్సిబి నిర్ణీత 20ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 221 పరుగులు చేసింది. ముంబయి బౌలర్లలో హార్దిక్ పాండ్యా, బౌల్ట్ రెండేసి వికెట్లు పడగొట్టారు. విఘ్నేష్ పుత్తుర్ ఒక్కో వికెట్ పడగొట్టాడు. జస్ప్రీత్ బుమ్రా తప్ప మిగిలిన బౌలర్లందరూ ఓవర్‌కు 10కి పైగానే పరుగులు సమర్పించుకున్నారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రజత్ పటీధర్‌కు దక్కింది.

స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా)

బెంగళూరు: 221/5(20ఓవర్లలో)
(కోహ్లి 67, పటీధర్ 64, హార్దిక్ (2/45)
ముంబయి : 209/9(20 ఓవర్లలో)
(తిలక్ వర్మ 56, హార్దిక్ 42;
కృనాల్ పాండ్యా (4/45), హేజిల్‌వుడ్ (2/37)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
ఢిల్లీ	3	3	0	6	+1.25
గుజరాత్	4	3	1	6	+1.03
బెంగళూరు	4	3	1	6	+1.01
పంజాబ్	3	2	1	4	+0.07
కోల్‌కతా	4	2	2	4	-1.42
లక్నో	4	2	2	4	+0.04
రాజస్తాన్	4	2	2	4	-0.18
ముంబయి	5	1	4	2	-0.01
చెన్నై	4	1	3	2	-0.89
సన్‌రైజర్స్	5	1	4	2	-1.62

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

ఐపిఎల్‌లో నేడు

కోల్‌కతా నైట్‌రైడర్స్ × లక్నో సూపర్ జెయింట్స్
వేదిక: కోల్‌కతా; రాత్రి 7.30గం||లకు

చరిత్ర సృష్టించిన బోపన్న

• 45ఏళ్ల వయసులో ఎటిపి టోర్నీ గెలుపు

న్యూయార్క్: భారత టెన్నిస్ దిగ్గజం రోహన్ బోపన్న చరిత్ర సృష్టించాడు. ఎటిపి మాస్టర్స్-1000 టోర్నీ డబుల్స్ విభాగంలో అద్భుత విజయం సాధించి ఈ టోర్నీ చరిత్రలో అతి పెద్ద వయసులో ఒక మ్యాచ్ గెలుపొందిన ఆటగాడిగా రికార్డు పుటల్లోకెక్కాడు. ఈ క్రమంలో కెనడాకు చెందిన డానియెల్ నెస్టర్‌ను అధిగమించాడు. 2017లో మాడ్రిడ్ మాస్టర్స్‌లో గెలుపొందే నాటికి డానియెల్ వయసు.. 44 ఏళ్ల 8నెలలు. మొనాకో వేదికగా జరుగుతున్న మాంటే కార్లో మాస్టర్స్‌లో బోపన్న అమెరికాకు చెందిన బెన్ షెల్టన్‌తో కలిసి బరిలోకి దిగాడు. రౌండ్-32లో ఫ్రాన్సిస్కో సెరుండొలో, అలెజండ్రో తబిలో జంటతో తలపడి 6-3, 7-5తో విజయం సాధించారు. ఈ మ్యాచ్ సుమారు 71 నిమిషాల సేపు సాగింది. బోపన్న, షెల్టన్ జోడి ఎటిపి ర్యాంకింగ్స్‌లో 14వ స్థానంలో కొనసాగుతోంది.

గతంలో నంబర్ 1తో రికార్డుపుటల్లోకి...

2024 సీజన్‌లో మాథ్యూ ఎబ్డెన్ జత కట్టి డబుల్స్ బరిలో దిగిన రోహన్ బొప్పన్న చెలరేగి ఆడి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ గెలుపొందాడు. దాంతో, ఆ ఏడాది ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానం సాధించాడు. దీంతో అతి పెద్ద వయసులో అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్న తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.

మోహన్‌బగాన్‌ను ఫైనల్‌కు చేర్చిన లాలెంగ్వియా

ఫైనల్‌కు మోహన్‌బగాన్

• 12న టైటిల్‌కై బెంగళూరుతో ఢీ

ముంబయి: ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్ఎల్) ఫైనల్లోకి మోహన్ బగాన్ జట్టు దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో మోహన్ బగాన్ జట్టు 2-0గోల్స్ తేడాతో జంషెడ్‌పూర్‌పై విజయం సాధించింది. తొలి గోల్‌ను జాసన్(51వ ని.)లో చేయగా.. రెండో గోల్‌ను లాలెంగ్వియా(94వ ని.) అదనపు సమయంలో చేశాడు. మరో రెండు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా లాలెంగ్వియా చేసిన గోల్‌తో మోహన్ బగాన్ జట్టు ఫైనల్‌కు చేరింది. ఇరుజట్ల మధ్య జరిగిన తొలిలీగ్ సెమీస్‌లో మోహన్ బగాన్ జట్టు 1-2గోల్స్ తేడాతో జంషెడ్‌పూర్ చేతిలో ఓటమిపాలైంది. అంతకుముందు సెమీఫైనల్లో బెంగళూరు జట్టు 2-1తో గోవాను చిత్తుచేసి ఫైనల్‌కు చేరింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68